ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 09.01.2026 | సంపుటి : 12 సంచిక : 171 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



### తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ సభలు

- ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు నిర్వహణ
- బాధ్యతలు మంత్రి పొంగులేటికి అప్పగింత
- మున్సిపల్ ఎన్నికలతో కాంగ్రెస్ సన్నద్ధం
- మారోసారి ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళికలు

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

మిగతా 2లో..

# పురపోరులో సత్తాచాటాలి



## ఉపాధి హామీచట్టం రద్దు చేసేంత వరకు పోరు ఆగదు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

"పేదలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మొదట అమలు చేసింది ఏపీ, తెలంగాణ రాష్ట్రాలే. ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గిపోయాయి. ఉపాధి హామీని రద్దు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరిగితే కార్పొరేట్ కంపెనీలకు చవకగా కార్మికులు దొరుకుతారు. కార్పొరేట్ కంపెనీలు ఉపాధి హామీ చట్టాన్ని రూపుమాపే కుట్ర చేస్తున్నాయి." - సీఎం రేవంత్

- పేదలకు ఆర్థిక భద్రత కల్పించేందుకే చట్టాన్ని తీసుకొచ్చారు
- పథకాన్ని మొదట అమలు చేసింది ఏపీ,తెలంగాణ రాష్ట్రాలే
- రద్దుతో గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పెరుగుతాయి
- దాంతో కార్పొరేట్ కంపెనీలకు చవకగా కార్మికులు దొరుకుతారు
- పథకం పేరు మార్పు వెనక ప్రధాని మోదీ కుట్ర దాగిఉంది
- వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తిరస్కరిస్తూ గ్రామసభలు తీర్మానించాలి
- పీసీసీ, పీఏసీ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

మిగతా 2లో..

# జనగణనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



- కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వరకు పక్రియ

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశవ్యాప్తంగా జనగణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జనగణన తొలి దశగా ఇళ్ల గణన పక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమై.. సెప్టెంబర్ 30వ తేదీతో ఈ పక్రి య ముగియనుంది. దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం 30 రోజులపాటు ఈ పక్రియను నిర్వహించనుంది. హౌస్ లిస్టింగ్‌లో భాగంగా అన్ని రకాల ఇళ్లు, నివాసాలు, భవనాలు, నిర్మాణాల వివరాలను సేకరించనున్నారు. దేశంలో ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2021లో ఈ జనగణన పక్రియను నిర్వహించాల్సి ఉంది. కానీ కొవిడ్ కారణంగా.. ఈ పక్రియను వాయిదా వేశారు. తాజాగా ఈ జనన గణన పక్రియను నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఈ పక్రియను రెండు దశల్లో నిర్వహించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది. తొలి దశలో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరగనుంది. ఇక రెండో దశలో జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది అంటే.. 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ జనాభా లెక్కలు పూర్తిగా డిజిటల్ రూపంలో చేయనుంది.

మిగతా 2లో..



### జేఈఈ మెయిన్ పరీక్షలు 21 నుంచి..

షెడ్యూల్ విడుదల చేసిన ఎన్టీఏ

న్యూఢిల్లీ(జనంసాక్షి): జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్ష తేదీలను ఎన్‌టీఏ ప్రకటించింది. ఈ పరీక్షకు సంబంధించిన అడ్వాన్స్ సిటీ ఇంటిమేషన్ స్లిప్పులను సైతం విడుదల చేసింది. జనవరి 21 నుంచి 29 వరకు జరిగే ఈ పరీక్షలకు

మిగతా 2లో..



## నాణ్యమైన భోజనం అందించండి

- ప్రతి రెండు నియోజకవర్గాలకు సెంట్రలైజ్డ్ కిచెన్‌లు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- ముఖ్యమంత్రిని కలిసిన హిమాచల్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కమార్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రతి రెండు నియోజకవర్గాలకు ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారులు కేకే, సుదర్శన్‌రెడ్డి, వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లపై చర్చ జరిగింది. విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, లంచ్ అందించాలని సీఎం ఆదేశించారు. సోలార్ కిచెన్ల ఏర్పాటు చేసే అంశాన్నిచ పరిశీలించాలని రేవంత్ సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం



### పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీటిని తీసుకుపోతే

## కేసీఆర్ ఎందుకు ఆపలేదు?

కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్(జనంసాక్షి):కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా

మిగతా 2లో..

### కేసీఆర్‌కు పేరొస్తుందనే పాలమూరు రంగారెడ్డి

# పనులు ఆపారు

పెండింగ్ పనులు పూర్తి చేస్తే తన బాస్ చంద్రబాబుకు కోపం వస్తుందని సీఎంకు భయం

కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు కుస్తీలు పట్టాల్సిన దుస్థితి నెలకొంది: కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలోని కాంగ్రెస్ అసమర్థ పాలనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శల వర్షం గుప్పించారు. ఇవాళ తెలంగాణభవన్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో పలువురు నాయకులు చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ దద్దమ్మ కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు కుస్తీలు పట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు.ఒక్క బస్తా యూరియా కోసం కూడా భారీ క్యూలైన్‌లలో గంటల తరబడి నిలబడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఖరికి క్రాప్ హాలిడేలు ప్రకటించాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో యూరియా కోసం కుస్తీలు లేవని, విత్తనాల కోసం పోటీ లేదని, కరెంటు కష్టాలు లేవని, క్రాప్ హాలిడేలు లేవని కేటీఆర్ చెప్పారు.

మిగతా 2లో..

## మేడారం జాతరకు రండి!

కేసీఆర్‌కు మహిళా మంత్రులకు ఆహ్వానం

గజ్వేల్(జనంసాక్షి):ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో

మిగతా 2లో..



# భారత్‌పై 500 శాతానికి.. బాదుడు



## భారీగా సుంకాల విధింపు బిల్లుకు ట్రంప్ ఆమోదం!

రష్యాపై ఒత్తిడి తీసుకొచ్చే చర్యల్లో భాగంగా నిర్ణయమని వెల్లడి



వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా ఆర్థిక మూలాలను దెబ్బకొట్టాలనే చర్యల్లో భాగంగా ఇండియాపై భారీ సుంకం విధించేందుకు దాదాపు రంగం సిద్ధమైపోయినట్టు కనిపిస్తోంది.రష్యాపై ఆర్థిక ఆంక్షలను కఠిన తరం చేసే చర్యల్లో ఆ దేశం నుంచి చమురు కొంటున్నదేశాలపై ముఖ్యంగా ఇండియాపై 500 శాతం సుంకం విధించే బిల్లుకు ట్రంప ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది.బుధవారం వైట్ హౌస్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమయ్యానని, నెలల తరబడిగా జరుగుతున్న బిల్లుకు ట్రంప్ మద్దతు తెలిపారని అమెరికా రిపబ్లికన్ సెనెటర్ లిండ్సీ గ్రాహమ్ గ్రాహం చెప్పారు. ఈ పరిణామాన్ని వైట్ హౌస్ అధికారి కూడా ధృవీకరించారు. దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్‌లోని యుద్ధాన్ని ముగించేందుకు, శాంతి ఒప్పందం కోసం ప్రయత్నిస్తోంది. అక్కడ శాంతి కోసం తమ ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. పుతిన్‌తో సంప్రదింపులు జరుపుతున్నా, అమాయకులను చంపుతూనే ఉన్నారంటూ గ్రాహం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే

మిగతా 2లో..

## గ్రీన్‌లాండ్‌ను కొనేస్తాం



- స్వాధీనంపై పట్టువీడని ట్రంప్
- ఒప్పుకోకుంటే సైనిక చర్యే..
- వచ్చే వారమే డెన్మార్క్‌కు విదేశాంగ మంత్రి రూబియో

2లో..



## వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయండి

### అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల ఆందోళన

న్యూఢిల్లీ(జనంసాక్షి):అశోక్‌నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలంటూ నిరుద్యోగులు రోడ్డెక్కారు. కేంద్ర గ్రంథాలయం నుంచి అశోక్‌నగర్ చౌరస్తాకు ర్యాలీగా వచ్చిన నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అభ్యర్థులను చెదరగొట్టిన పోలీసులు.. కొందరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో అశోక్‌నగర్‌లో కొద్ది సేపు ట్రాఫిక్ స్తంభించింది.

# అవినీతి కేసులపై దర్యాప్తు జరగాల్సిందే..

ఎఫ్‌ఐఆర్‌లు కొట్టేయడం కుదరదు • హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీం

ఢిల్లీ(జనంసాక్షి): అవినీతి నిరోధక చట్టం కేసులపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఏపీ ఏసీబీ (సీఐయూ) నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. ఇదే సమయంలో ప్రతివాదులను అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది.ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌కు నోటిఫైడ్ పోలీస్ స్టేషన్ హోదా లేదని గంపగుత్తగా ఎఫ్‌ఐఆర్‌లను ఏపీ హైకోర్టు కొట్టేసింది. ఈ క్రమంలో ఏసీబి సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్.. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై నేడు విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం.. ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ)విజయవాడ నమోదు చేసిన అన్ని ఎఫ్‌ఐఆర్‌లపై దర్యాప్తు చేయాలని ఆదేశించింది.

మిగతా 2లో..



### ప్రతీ వీధికుక్కను తరలించాలనలేదు

- కేవలం సంస్థలు, కార్యాలయాల దగ్గరి నుంచి మాత్రమే తరలించాలని ఆదేశాలు ఇచ్చాం
- జంతువుల జనన నియంత్రణపై ప్రధానంగా దృష్టిపెట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు సూచన

9లో..

ఈడీ దాడులు జరుగుతుండగా

## మమత ఎంట్రీ..

- దర్యాప్తు అధికారులపై మండిపడ్డ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి
- ఆమె కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లారన్న దర్యాప్తు అధికారులు


కోల్‌కతా(జనంసాక్షి): రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేపట్టింది. ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసం సహా ఐప్యాక్‌కు సంబంధించిన పలు ప్రాంగణాల్లో గురువారం ఉదయం నుంచి సోదాలు జరుపుతోంది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా కోల్‌కతా సహా పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ సోదాలు జరుగుతున్న సమయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా

మిగతా 2లో..

### భారత్‌తో యుద్ధం తర్వాత

## మా యుద్ధవిమానాలకు గిరాకీ పెరిగింది

- హాట్ కేకుల్లా మా జెట్స్ విక్రయాలు
- ఇక మాకు ఐఎంఎఫ్ నిధులు కూడా అవసరంలేదు
- పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు



ఇస్లామాబాద్(జనంసాక్షి):ప్రగల్భాలు పలకడం, నవ్వులపాలవడం పాకిస్థాన్‌కు కొత్తేంకాదు. అయినా సరే తీరు మార్చుకోని అక్కడి నేతలు మళ్లీమళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారు. తాజాగా దాయాది రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌తో యుద్ధం తర్వాత తమ యుద్ధ విమానాలకు ఎక్కడలేని గిరాకీ వచ్చిందని, అవి హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయన్నారు. ఇకపై తమ ఆర్థిక కష్టాలు తీర్చేందుకు ఐఎంఎఫ్ రుణం కూడా అవసరం ఉండకపోవచ్చని పగటి కలలు కంటున్నారు. "గతేడాది మే నెలలో భారత్‌తో నాలుగు రోజుల పాటు జరిగిన యుద్ధం తర్వాత పాకిస్థాన్‌కు రక్షణ ఆర్డర్లు పెరిగాయి. అవి ఏ స్థాయిలో అంటే.. ఆరు నెలల తర్వాత మాకు అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణాల అవసరం ఉండకపోవచ్చు. పాక్ మిలిటరీ సామర్థ్యాలు ప్రపంచం దృష్టిలో పడ్డాయి"

మిగతా 2లో..

## రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

చెట్టును ఢీకొన్న కారు

నలుగురు విద్యార్థుల దుర్మరణం

రంగారెడ్డి(జనంసాక్షి):రంగారెడ్డి జిల్లాలో గురువారం తెల్లవారు జామున ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడటంతో నలుగురు విద్యార్థులు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ ఇక్ఫాయి యూనివర్సిటీ విద్యార్థులు శ్రీ నిఖిల్, సూర్యతేజ, సుమిత్, రోహిత్, నక్షత్ర కలిసి కోకాపేటలో పుట్టిన

మిగతా 2లో..



## భారత్‌తో యుద్ధం తర్వాత మా యుద్ధవిమానాలకు భారీ గిరాకీ

అని ఖవాజా వ్యాఖ్యలు చేశారు. ఖవాజా మాటలకు, పాక్ ప్రభుత్వ చర్యలకు ఏమాత్రం పొం తన లేదు. కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఐఎంఎఫ్ నుంచి కొన్నేళ్లుగా పాకిస్థాన్ నిధులు అర్థిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నిధులు పొందేందుకు గాను ఐఎంఎఫ్ సూచించిన సంస్కరణల్లో భాగంగా పాక్‌కు చెందిన అంతర్జాతీయ విమానయాన సంస్థ ను అమ్మేందుకు అక్కడి ప్రభుత్వం సిద్ధమైంది. ఇక, 2026-2027 బడ్జెట్‌లో కొన్ని సడలింపులు, సబ్సిడీలు ఇవ్వాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకోసం రుణషరతులపై మినహాయింపులు ఇవ్వాలని ఐఎంఎఫ్‌ను కోరుతోందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఖవాజా చెప్పినట్టుగా పాకిస్థాన్ యుద్ధవిమానాలు జేఎఫ్-17, జే-10కు దొరికిన బయ్యర్లు అజర్‌బైజాన్, లిబియాలు మాత్రమే. బంగ్లాదేశ్ ఇంకా చర్చలు జరుపుతోంది. అయితే, జేఎఫ్-17కు రష్యా, చైనా, ఇటలీ, తుర్కియే, యూకేకు చెందిన పరికరాలను దాయాది అమర్చుతోంది. ఇంజిన్ రష్యాది కాగా.. దాని డిజైనర్, తయారీదారు చైనా. అందులో పాక్ తయారీ పరికరాలు పరిమితంగానే వాడుతున్నారు. దాంతో వాటి అమ్మకాల నుంచి వచ్చే ఆదాయంలో తమ వాటాను ఇతర దేశాలు తీసుకోగా.. షరీఫ్ ప్రభుత్వానికి వచ్చేది అంతంతమాత్రంగానే ఉంటుందని పాక్ రాజకీయ విశ్లేషకులు వెల్లడించారు. ఒకవేళ జేఎఫ్-17ను 15 మిలియన్ డాలర్లు, జే-10ను 40 మిలియన్ డాలర్లకు విక్రయించినా.. 2026 ప్రారంభం వరకు ఉన్న 300 బిలియన్ డాలర్ల అప్పులకుప్పను తొలగించుకోగలదా..? అని ప్రశ్నిస్తున్నారు.

### రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఓ స్నేహితుడిని డ్రాప్ చేసి తిరిగి మోకిల నుండి హైదరాబాద్ నగరానికి వస్తుండగా గురువారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలోని మిర్జాగూడ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది.. కారు వేగం ఎక్కువగా ఉండటంతో అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. నక్షత్ర అనే యువతికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే యువతిని అత్యవసర చికిత్స ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

## కేసీఆర్‌కు పేరొస్తుందనే పాలమూరు రంగారెడ్డి పనులు ఆపారు

పెండింగ్ పనులు పూర్తిచేస్తే కేసీఆర్‌కు ఎక్కడ పేరొస్తుందోననే అక్కసుతోనే సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పండబెట్టిండని కేటీఆర్ ఆరోపించారు. కేవలం 10 శాతం పనులు పూర్తిచేస్తే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నా.. ఈ ప్రభుత్వం ఆ పని చేయడం లేదని విమర్శించారు. పెండింగ్ పనులు పూర్తిచేస్తే కేసీఆర్‌కు పేరొస్తది, తన బాస్ (చంద్రబాబు) కు కోపం వస్తదనే భయంతోనే రేవంత్‌రెడ్డి రైతులను గోసపెట్టుకుంటున్నడని మండిపడ్డారు.

## ఈడీ దాడులు జరుగుతుండగా మమత ఎంట్రీ..

బెనర్జీ ప్రతీక్ జైన్ నివాసానికి వెళ్లడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈడీ అధికారులు జైన్ నివాసంలో తనిఖీలు చేస్తుండగా మమతా బెనర్జీ, కోల్‌కతా పోలీసు కమిషనర్ మనోజ్ వర్మ అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా దీదీ మాట్లాడుతూ.. ఈ సోదాలు రాజ్యాంగవిరుద్ధమని మండిపడ్డారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఈ తనిఖీలు చేస్తున్నారని దుయ్యబట్టారు. "మా పార్టీ రాజకీయ వ్యూహం, అభ్యర్థుల జాబితా, రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకే ఈడీతో ఈ దాడులు చేయిస్తున్నారు. టీఎంసీ పార్టీ హార్డ్‌డిస్క్‌ను తీసుకునేందుకు ఈడీ అధికారులు ప్రయత్నిస్తున్నారు" అని బెంగాల్ సీఎం ఆరోపించారు. అయితే, ఈడీ దాడులు జరుగుతుండగా ప్రతీక్ జైన్ నివాసానికి సీఎం వెళ్లడంపై పశ్చిమబెంగాల్ ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు సువేందు అధికారి అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇది దర్యాప్తులో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడమే అవుతుందన్నారు. ఇలాంటి ప్రవర్తన అనైతికం అని మండిపడ్డారు. ప్రస్తుతం ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడైన ప్రతీక్ జైన్ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగానికి హెడ్‌గానూ వ్యవహరిస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత నుంచి టీఎంసీతో కలిసి ఐప్యాక్ పనిచేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థపై ఈడీ ఎందుకు సోదాలు జరుపుతోందన్న విషయంపై మాత్రం స్పష్టత లేదు. అయితే, మరికొన్ని నెలల్లో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.

మమతా బెనర్జీ కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లారు..

కోల్‌కతాలోని ఐ-ప్యాక్ సంస్థపై దాడులు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో దాడులు చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ ఇంట్లోకి ప్రవేశించారని.. ఎలక్ట్రానిక్ పరికరాలు, పలు దస్త్రాలను సహా కీలక ఆధారాలను తీసుకెళ్లిపోయారని పేర్కొంది. సీఎం సహా ఆమె సహాయకులు, పోలీసులు వాటిని బలవంతంగా తీసుకెళ్లారని వెల్లడించింది. బొగ్గు అక్రమ రవాణా ద్వారా ఆదాయం పొందిన వ్యక్తులకు సంబంధించి కోల్‌కతాలో ఈ సోదాలు చేపట్టినట్లు ఈడీ వెల్లడించింది. హవాలా మనీతో ఐప్యాక్‌కు సంబంధం ఉందని, ఇందులో ఓ వ్యక్తికి ఈ సంస్థకు మధ్య రూ.కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని పేర్కొంది. భారీసంఖ్యలో పోలీసు అధికారులతో ముఖ్యమంత్రి ఐప్యాక్ డైరెక్టర్ నివాసానికి వచ్చారని, అంతకుముందు వరకు సోదాలు శాంతియుతంగా, అధికారికంగా జరిగాయని ఈడీ పేర్కొంది. సాధారణ ప్రక్రియలో భాగంగానే ఈ సోదాలు జరిగాయని, ఏ రాజకీయ పార్టీ, ఏ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని వీటిని చేపట్టలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్పష్టం చేసింది.

ఈడీపై ప్రతీక్ సతీమణి ఫిర్యాదు

సోదాల సందర్భంగా పలు కీలక పత్రాలను చోరీ చేశారని ఆరోపిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై ప్రతీక్ జైన్ తరఫున ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్నామని, వాటిలో వెల్లడైన అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని షేక్స్‌పియర్ సరాని పోలీసులు వెల్లడించారు. ఇదిలాఉంటే, తృణమూల్ కాంగ్రెస్‌కు రాజకీయ కన్సల్టెన్సీగా ఉన్న ఐప్యాక్.. ఆ పార్టీకి ఐటీ, మీడియా కార్యకలాపాలనూ నిర్వహిస్తోంది.

## మాదక ద్రవ్యాల అక్రమ రవాణా..

### కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

**కువైట్(జనంసాక్షి):** మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కువైట్‌లోని ఓ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. మాదకద్రవ్యాలతో పట్టుబడిన ఇద్దరు భారతీయులను దోషులుగా తేల్చి, మరణశిక్ష విధించింది. అయితే, వారిద్దరు భారత్‌లో ఏ రాష్ట్రానికి చెందిన వారనే విషయంపై స్పష్టత లేదు. దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టిన డ్రగ్ కంట్రోల్ అధికారులు.. ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 14 కిలోల హెరాయిన్, 8 కిలోల మెథాంఫెటమైన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. వీటికి సంబంధించిన ఆధారాలను ప్రాసిక్యూటర్లు కోర్టులో ప్రవేశపెట్టగా.. దోషులకు మరణశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది.



# పురపోరులో సత్తా చాటాలి

నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం అని అన్నారు. మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిదని అన్నారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని భాజపా నేతలు ప్రచారం చేశారు. అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారు. తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారు. కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో భాజపా 240 సీట్ల వద్ద ఆగిపోయింది. దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడింది. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభ మవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

## తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ సభలు

అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఖరారు చేసింది. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించింది. కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపైనా చర్చించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో గెలపు బాధ్యతలు తీసుకునేలా దిశానిర్దేశం చేశారు. వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్టులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది. అంతేకాకుండా.. ఆయా జిల్లాల్లోని స్థానిక సమస్యలతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందంటూ ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఇందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

## నాణ్యమైన భోజనం అందించండి

వేగంగా జరగాలని ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపుల్లో యంగ్ ఇండియా స్కూళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

రేవంత్‌ను కలిసిన హిమాచల్ విద్యాశాఖ మంత్రి

సచివాలయంలో సీఎం రేవంత్‌ను హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కమార్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తీసుకువస్తోన్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వివరాలను రోహిత్ కుమార్‌తో రేవంత్ పంచుకున్నారు. జాతీయ విద్యా విధానం తరహాలో త్వరలో తెలంగాణ విద్యా విధానాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకుంటున్న చర్యలను సీఎం రేవంత్ వివరించారు.

## జనగణనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

ఈ జనగణనతోపాటే కులగణనను సైతం చేపట్టాలని ఇప్పటికే కేంద్రం నిర్ణయించింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో కులగణన పక్రియను చేపట్టి.. పూర్తి చేసింది. దీనిని ఆధారంగా చేసుకుని.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపడుతుందంటూ మోదీ ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ విమర్శలు సంధిస్తున్న సంగతి తెలిసిందే.

## అవినీతి కేసులపై దర్యాప్తు జరగాల్సిందే..

ఈ ఎఫ్ఐఆర్‌లపై ఆరు నెలల్లో తుది నివేదిక సమర్పించాలని కోరిం ది. అలాగే, ప్రతివాదులను అరెస్ట్ చేయవద్దు. దర్యాప్తు పూర్తయ్యేందుకు ప్రతివాదులు సహకరించాలి. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లపై, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తులపై ఎలాంటి పిటిషన్‌లను హైకోర్టు స్వీకరించవద్దు అని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత చట్టాలను మార్చుకుంటే పాత చట్టాలు అమల్లో ఉన్నట్లేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, గతంలోనే అవినీతి నిరోధక చట్టం కింద పలువురిపై ఏసీబీ సీఐయూ.. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది.

## మేడారం జాతరకు రండి!

పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం పలికారు.

## జేఈఈ మెయిన్ పరీక్షలు 21 నుంచి..

మీ ఎగ్జామ్ సెంటర్ ఏ నగరంలో ఉందో ముందుగానే తెలుసుకొనేలా ఎన్‌టీఏ గురువారం అందుబాటులోకి తీసుకొచ్చింది. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పరీక్షల షెడ్యూల్ ఇదే..

జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్ -1 పరీక్షలు జరుగుతాయని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. మొదటి షిఫ్టు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు; రెండో షిఫ్టు పరీక్ష మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరగనుంది. జనవరి 29న పేపర్ 2ఎ (బీఆర్క్) పేపర్ 2బి (బి.ప్లానింగ్), పేపర్ 2ఎ, 2బి (బీఆర్క్, బి.ప్లానింగ్ రెండూ కలిపి) ఒకే షిఫ్టులో జరగనున్నాయి. ఈ పరీక్ష ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతుందని పేర్కొంది. జేఈఈ మెయిన్ సెషన్- 1 పరీక్షలు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో, విదేశాల్లోని 15 నగరాల్లో నిర్వహించనున్నట్లు ఎన్టీఏ డైరెక్టర్ (ఎగ్జామ్స్) తెలిపారు. ఎగ్జామ్ సిటీ ఇంటిమేషన్ స్లిప్పుల డౌన్‌లోడ్‌లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అభ్యర్థులు 011-40759000 నంబర్‌కు లేదా తీవవఎజీతినిఏనిబిజీ.జీఇ.తిని ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ తెలుసుకొనేందుకు తమ అధికారిక వెబ్‌సైట్‌ని చెక్ చేసుకోవాలని కోరారు.

## పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీటిని తీసుకుపోతే కేసీఆర్ ఎందుకు ఆపలేదు?

సమావేశంలో సంజయ్ మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించ లేదన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని మండిపడ్డారు.. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వాడుకోలేదు. అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదు. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటికి అభ్యంతరం చెప్పొద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది. ఆ చట్టంలో పాలమూరు-రంగారెడ్డికి పేరే లేదు. పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారు. దీన్ని గతంలో అడ్డుకోలేదు. కాంగ్రెస్, కేసీఆర్ చేసిన మోసాలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసిందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా జలాల విషయంలో రెండు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుంది.. ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామా ఆడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి ఇరిగేషన్ విషయంలో అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్దాలు మాట్లాడారన్నారు. మేము నదీజలాలపై కొట్లాడినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫీల్డ్ లో లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అండగా ఉందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ తామే ప్రారంభించామని కాంగ్రెస్ అంటోంది.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పాలమూరు రంగారెడ్డి పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇది మరణశాసనం. వాళ్లే జాతీయ హోదా ఇవ్వలేదు అని లొల్లి చేస్తూన్నారన్నారు.

# భారత్‌పై బాదుడు 500శాతానికి..

ఈ బిల్లు ఆమోదం ఎంతవరకు సాధ్యమవుతుందో స్పష్టత లేనప్పటికీ, వచ్చే వారం ప్రారంభంలోనే ఓటింగ్ జరగవచ్చని కూడా చెప్పారు. రష్యా దగ్గర చమురు కొనడం అంటే ఉక్రెయిన్‌కు మద్దతు నిరాకరించినట్టే భావిస్తున్నామన్నారు. రష్యా చమురు వాణిజ్యానికి భారతదేశంపై 500శాతం సుంకాన్ని విధించే గ్రాహం-బ్లూమెంటల్ ఆంక్షల బిల్లు ఆమోదం పొందితే. భారతదేశం, చైనా , బ్రెజిల్‌తో సహా ఇతర దేశాలపై 500 శాతం వరకు సుంకాలను విధించడానికి అమెరికా అధ్యక్షుడికి అధికారం ఇస్తుంది. రష్యా చమురు లేదా యురేనియం కొనుగోలు చేయడం అంటే "రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ యుద్ధ యంత్రానికి ఇంధనం" ఇచ్చినట్టేనని గ్రాహం తెలిపారు.

### రష్యా ఆంక్షల బిల్లు

ప్రధానంగా గ్రాహం, డెమోక్రటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ ఈ బిల్లుకు రూపకల్పన చేశారు. రష్యా చమురు, గ్యాస్, యురేనియం ఇతర ఎగుమతులను కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలు, ద్వితీయ ఆంక్షలు విధించడానికి ట్రంప్ ప్రభుత్వానికి అనుమతి లభిస్తుంది. దీని వల్ల రష్యా సైనిక చర్యలకు నిధుల మూలాన్ని నిలిపివేయడమే అవుతుంది. రష్యా చమురులో 70 శాతం భారత్, చైనాలే కొంటున్నాయి. గత ఏడాది ఆగస్టులో రష్యానుంచి చమురుకొనుగోలుచేస్తున్న నేపథ్యంలో భారతీయ వస్తువులపై అదనంగా 25 శాతం సుంకం విధించిన సంగతి తెలిసిందే.

## గ్రీన్‌లాండ్‌ను కొనేస్తాం

**వాషింగ్టన్(జనంసాక్షి):** డెన్మార్క్ దేశంలోని గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని కొనే దిశగా అమెరికా కసరత్తును ముమ్మరం చేసింది. దీనిపై ఆ దేశ ప్రభుత్వంతో చర్చించేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వచ్చే వారం డెన్మార్క్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈవిషయాన్ని గ్రీన్‌లాండ్ ప్రాంతీయ ప్రభుత్వ వెబ్‌సైట్ మంగళవారం రోజే (జనవరి 6న) ధ్రువీకరించింది. డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లోక్కే రస్మ్యూసెన్, గ్రీన్‌లాండ్ విదేశాంగ మంత్రి వివియన్ మోట్జ్ ఫెల్ట్‌ల విన్నపం మేరకు డెన్మార్క్ పర్యటనకు రూబియో వస్తున్నారని వెల్లడించింది. ఈ సున్నితమైన అంశంపై చర్చ కోసం డెన్మార్క్‌కు రావాలని ఇంతకుముందు పలుమార్లు ప్రభుత్వం విన్నవించినప్పటికీ అమెరికా తిరస్కరించిందని తెలిపింది.

గ్రీన్‌లాండ్ స్వాధీనానికి అన్ని మార్గాలు సిద్ధం

సోమవారం సాయంత్రం (జనవరి 5న) వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌లో పలువురు అమెరికా కాంగ్రెస్ సభ్యులతో ఓ ప్రైవేటు సమావేశం జరిగింది. అందులో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారంటూ మంగళవారం రోజు(జనవరి 6న) 'వాల్ స్ట్రీట్ జర్నల్' సంచలన వార్తను ప్రచురించింది. ఎలాగైనా డెన్మార్క్ నుంచి గ్రీన్‌లాండ్‌ను కొనేయాలనే స్పష్టమైన ఆలోచనతో ప్రెసిడెంట్ ట్రంప్ ఉన్నారనే విషయాన్ని రూబియో చెప్పారని ఆ వార్తలో ప్రస్తావించారు. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి సైనిక చర్యను చేపట్టొద్దనే బలమైన అభిప్రాయం వ్యక్తమవుతున్నందున, దాన్ని కొనేయాలనే అభిప్రాయానికి ట్రంప్ వచ్చారని రూబియో తెలిపినట్లు వార్తలో పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం తమ వద్ద అన్ని మార్గాలు సిద్ధంగా ఉన్నాయని మంగళవారం రోజు వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరీ కెరోలిన్ లీవిట్ వెల్లడించారు. అయితే దౌత్యానికే ప్రెసిడెంట్ ట్రంప్ తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె తెలిపారు.

**గ్రీన్‌లాండ్ కొనుగోలు ప్రతిపాదన పాతదే : రూబియో**

కీలక విషయాలన్నీ అప్పటికే వెలుగులోకి వచ్చేయడంతో, బుధవారం రోజు (జనవరి 7న) ఇవే అంశాలను విలేకరులకు విదేశాంగ మంత్రి మార్కో రూబియో అధికారికంగా తెలియజేశారు. తొలిసారి అమెరికా అధ్యక్షుడు అయిన నాటి నుంచే గ్రీన్‌లాండ్‌ను కొనే అంశం గురించి ట్రంప్ మాట్లాడుతున్నారని ఆయన వెల్లడించారు. గ్రీన్‌లాండ్ కొనుగోలు ప్రతిపాదనను పరిశీలిస్తున్న తొలి ప్రెసిడెంట్ ట్రంప్ కాదని, గతంలోనూ పలువురు అమెరికా అధ్యక్షులు ఈ అంశాన్ని పరిశీలించారని రూబియో చెప్పారు. గ్రీన్‌లాండ్ కోసం నాటో కూటమికి దూరమయ్యే రిస్క్ తీసుకుంటారా అని విలేకరులు ప్రశ్నించగా, ఇలాంటి అంశాలపై తాము నేరుగా డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రభుత్వాలతో చర్చిస్తామన్నారు. అమెరికా జాతీయ భద్రత కోసం సైనిక చర్యలకు ఆదేశించే అధికారం ప్రతి అమెరికా అధ్యక్షుడికి ఉంటుందన్నారు.

**డెన్మార్క్‌కు మద్దతుగా ఐరోపా దేశాలు**

గ్రీన్‌లాండ్ విషయంలో ఐరోపా ఖండంలోని ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, పోలాండ్, స్పెయిన్, బ్రిటన్ దేశాలు ఇప్పటికే డెన్మార్క్‌కు మద్దతును ప్రకటించాయి. తమ గ్రీన్‌లాండ్‌ను అమెరికా లాక్కుంటే, నాటో కూటమే అంతమవుతుందని డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడెరిక్సన్ హెచ్చరించారు.

**'గ్రీన్‌లాండ్'లోని ఖనిజ నిక్షేపాలపై అమెరికా కన్ను**

డెన్మార్క్‌లోని స్వయంపాలిత ప్రాంతం 'గ్రీన్‌లాండ్' ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం. ఇది ఉత్తర అట్లాంటిక్ సముద్రం, ఆర్కిటిక్ మహా సముద్రం మధ్యన ఉంది. ఇందులో దాదాపు 57వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. అంటే జనసాంద్రత చాలా తక్కువ. ఇక్కడి జనాభాలో దాదాపు సగం మంది స్థానిక రాజధాని నగరం న్యూక్‌లో నివసిస్తుంటారు. గ్రీన్‌లాండ్ మొత్తం మంచుతో కప్పబడి ఉంటుంది. ఈ మంచురాశుల కింద దాదాపు 34 కీలకమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని యూరోపియన్ యూనియన్ (ఈయూ) గుర్తించింది. ఈ నిక్షేపాల జాబితాలో బంగారం, జింక్, ఐరన్, సహజ వాయువు వంటివి ఉన్నాయి. వీటి కోసమే గ్రీన్‌లాండ్ కొనుగోలుకు అమెరికా ఆసక్తి చూపుతోందనే టాక్ వినిపిస్తోంది. అమెరికా ప్రతిపాదనను గతంలో గ్రీన్‌లాండ్ పాలకులు బహిరంగంగానే వ్యతిరేకించారు. ఈసారి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో డెన్మార్క్ పర్యటనలో ఏం జరుగుతుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. చైనా, రష్యా నౌకాదళాలు ఆర్కిటిక్ మహాసముద్రంలో తిరుగుతున్నాయనే అంశాన్ని బూచిగా చూపించి, గ్రీన్‌లాండ్‌ను అమ్మేలా డెన్మార్క్‌ను అమెరికా ఒప్పించగలుగుతుందా అనేది వేచిచూడాలి.

## అమెరికా పడవలను ముంచేస్తాం

- అగ్రరాజ్యానికి రష్యా వార్నింగ్
- రష్యా జెండా ఉన్న వెనెజువెలా చమురు నౌకను అమెరికా సీజ్ చేయడంపై ఆగ్రహం
- ఆ నౌకలో ముగ్గురు భారతీయులు?

**మాస్కో(జనంసాక్షి):** రష్యా జెండాతో ఉన్న వెనెజువెలా చమురు నౌకను అమెరికా సీజ్ చేయడంతో ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై ఇప్పటికే పుతిన్ సర్కారు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తాజాగా రష్యా చట్టసభ్యుడొకరు దీనిపై మాట్లాడుతూ.. అగ్రరాజ్యానికి గట్టి హెచ్చరికలు చేశారు. అవసరమైతే అమెరికా పడవలను ముంచేస్తామని హెచ్చరించారు. "ఏం చేసినా మాకు శిక్ష పడదు అన్న అతివిశ్వాసంతో అగ్రరాజ్యం ప్రవర్తిస్తోంది. ప్రతీకార చర్యలతో అమెరికాను అడ్డుకోవాలి. అంతర్జాతీయ చట్టాలను ఇలాగే ఉల్లంఘిస్తే మిలిటరీ దాడులను ఎదుర్కోడానికి ఆ దేశం సిద్ధంగా ఉండాలి. అవసరమైతే టార్పిడోలతో దాడులు చేయడం, అమెరికా కోస్ట్ గార్డ్ పడవలను ముంచేయడం వంటివి చేయాల్సి వస్తుంది" అని రష్యా చట్టసభ్యుడు అలెక్సీ జురావ్లెవ్ అన్నారు. ఇదిలాఉండగా.. ఈ నౌక స్వాధీనానికి సంబంధించిన వీడియోను యూఎస్ కోస్ట్‌గార్డ్ విడుదల చేసింది. అమెరికా రక్షణశాఖ, తీర రక్షక దళం సంయుక్త ఆపరేషన్ నిర్వహించి రష్యా నౌక మ్యారినెరా (పాత పేరు బెల్లా-1)ను సీజ్ చేసినట్లు అందులో పేర్కొంది. అమెరికా భద్రత, అంతర్జాతీయ చట్టాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాసుకొచ్చింది. ఐస్‌లాండ్ దక్షిణ తీరానికి 190 మైళ్ల దూరంలో ఈ నౌకను స్వాధీనం చేసుకున్నారు. హెలికాప్టర్ నుంచి అమెరికా మెరీన్లు (సైనిక సిబ్బంది) నౌక పైకి దిగి.. అందులోని సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు బ్రిటన్ కూడా సహకరించడం గమనార్హం. అమెరికా ఈ దాడి చేసే సమయానికి రష్యా దళం అక్కడికి సమీపంలోనే ఉన్నట్లు సమాచారం. దీంతోపాటు ఏ దేశపు జెండా లేని మరో నౌక సోఫియాను కూడా అమెరికా దళాలు సీజ్ చేశాయి.

**ఆ నౌకలో ముగ్గురు భారతీయులు?**

రష్యా జెండాతో వెళ్తున్న వెనెజువెలా 'మ్యారినెరా' నౌకతో పాటు మరో నౌకను అమెరికా సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం భౌగోళిక రాజకీయాల్లో పెను దుమారం రేపుతుండగా.. తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. మ్యారినెరా పేరుతో ఉన్న నౌక సిబ్బందిలో ముగ్గురు భారతీయులు ఉన్నట్లు రష్యా మీడియా పేర్కొంది. అందులో మొత్తం 28 మంది సిబ్బంది ఉండగా.. 17 మంది ఉక్రెయిన్ పౌరులు, ఎనిమిది మంది జార్జియా, ముగ్గురు భారతీయులతో పాటు మరో ఇద్దరు రష్యన్ పౌరులు ఉన్నట్లు సమాచారం. ఈ నౌక పాత పేరు బెల్లా-1 కాగా.. గయానా జెండా ఉండే ఈ నౌకకు ఇటీవలే రష్యా జెండాను అమర్చినట్లు సమాచారం. గతంలో దీనిని ఓ ప్రైవేటు వ్యాపారి అద్దెకు తీసుకున్నారని తెలిసింది.

# లంచం ఇవ్వలేదని.. పోస్టు దక్కనివ్వలేదు..

- ఇంచార్జి డిడబ్ల్యుఓపై ఓ బాధితురాలు ఆరోపణ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** లంచం ఇవ్వలేదని.. వచ్చే పోస్టు దక్కనివ్వలేదని ఓ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. భూపాలపల్లి సిడిపిఓ కార్యాలయ ఆవరణలో అరుణ అనే బాధితురాలు గురువారం వివరాలు వెల్లడించింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి శివారు ఖాసింపల్లి రెండవ అంగన్వాడి సెంటర్లో గత 15 ఏళ్లుగా గుండ్ల అరుణ అనే బాధితురాలు ఆయాగా విధులు నిర్వహిస్తోంది. కాగా ఇక్కడి మొదటి అంగన్వాడి సెంటర్ లో పనిచేసిన టీచర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. పదో తరగతి ఉత్తీర్ణులైన ఆయాలకు ప్రమోషన్ కల్పిస్తామని తెలియడంతో అరుణ స్థానికురాలిగా, అన్ని అర్హతలు కలిగి ఉండి దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో అప్పటి సిడిపిఓ(ప్రస్తుత ఇంచార్జి డిడబ్ల్యుఓ) మల్లీశ్వరి తన కార్యాలయానికి పిలిపించి, ఖాశీంపల్లి అంగన్వాడి సెంటర్ టీచర్ పోస్టు కావాలంటే రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేసిందని బాధితురాలు అరుణ చెప్పింది. తాను నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తినని, లక్ష రూపాయలు ఇచ్చే స్థోమత లేదని చెప్పడంతో కక్షగట్టి, పక్క గ్రామమైన సెగ్గంపల్లికి చెందిన ఆయా దుర్గం లక్ష్మి వద్ద రూ.4 లక్షలు లంచం తీసుకుని ఆమెకే పోస్టు కట్టబెట్టిందని ఆరోపించింది. దరఖాస్తు చేసినప్పటి నుంచి డబ్బుల కోసం అనేక రకాలుగా ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని బాధితురాలు అరుణ వేడుకుంటుంది.

# జో కొడితే నిద్రించేది కాదు బీసీ ఉద్యమం

- ద్రోహం చేసేవాడు ఇంటోడైనా, బయటోడైనా బీసీ ఉద్యమం వదిలిపెట్టదు
- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ జూలూరు గౌరీశంకర్



**యాదగిరిగుట్ట (జనంసాక్షి) :** తెలంగాణలో బీసీ ఉద్యమం పదునెక్కుతుందని దాన్ని ఆపటం ఎవరితరం కాదని ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. బీసీ ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా రాజ్యాధికార దిశగా ముందుకు నడిపించేందుకు బీసీలందర్నీ ఒక్కతాటిపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ చేసిన వాగ్దానాన్ని మరిచి బీసీలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 78 ఏళ్లుగా కాంగ్రెస్ బీజేపీలు బీసీలను మోసగిస్తూనే వస్తున్నాయని అన్నారు. మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో గురువారం యాదగిరిగుట్ట పద్మశాలి భవన్‌లో 37 నియోజక వర్గాల బీసీ యువత, కుల సంఘాల నేతలతో జరిగిన బీసీ సంఘటిత శక్తి నిర్మాణ శిక్షణ శిబిరంలో జూలూరు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "తెలంగాణలో బీసీ ఉద్యమం – సంస్థల పనితీరు ఫలితాలు" అన్న అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కొనసాగుతున్న బీసీ ఉద్యమం పాలకులు జో కొడితే నిద్రపోయే దశలో లేదని అది నివురుగప్పిన నిప్పులా ప్రజ్వరిల్లి తీరుతుందన్నారు. రాష్ట్రంలో పాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ బీసీ ఆకాంక్షలతో ఆటలాడుకుంటుందన్నారు. రాజకీయ పార్టీలకు బీసీలంటే చిత్తశుద్ధి లేదన్నారు. సి.ఎం. రేవంత్ రెడ్డి అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి కేంద్రంపై ఐక్య పోరాటాలు చేయాల్సిన పనిని వదిలివేయటాన్ని బీసీ సమాజం గుర్తించిందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే జరుగుతాయని తెలిసి కూడా రాజకీయ పార్టీలు బీసీలతో ఆటలాడుకుంటున్నాయన్నారు. జరిగిన గ్రామపంచాయితీ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు 82 శాతం సీట్లు సాధించటం బహుజన ఉద్యమాల చైతన్యాన్ని తెలియజేస్తుందని వివరించారు. బీసీలు 51 శాతం సీట్లు సాధించటం అన్నది రేపు జరగబోయే సామాజిక ఉద్యమానికి గుర్తుగా నిలుస్తుందన్నారు. నిర్మాణాత్మక బీసీ ఉద్యమానికి బీసీ యువత అంకితమై నిలవాలన్నారు. మన ఓటు మనం వేసుకునే చైతన్యాన్ని గుండెలనిండా నింపుకుంటే ఆధిపత్యాల కోటలను కూల్చివేసి బహుజన రాజ్యాలను స్థాపించవచ్చునన్నారు. చరిత్ర పొడుగూత బీసీలకు జరిగిన అన్యాయాలను చాటి చెబుతూ ఆధిపత్య రాజకీయ శక్తుల ఆటలు కట్టించేందుకు బీసీ యువత కీలకపాత్ర పోషించవలసిన అవసరం ఉందని జూలూరు తెలిపారు.

మతం మత్తులో మునిగి ఉన్న దేశాన్ని కాపాడేందుకు వామపక్ష ప్రగతిశీల శక్తులన్నీ విశాల విస్తృత వేదికను నిర్మించవలసిన చారిత్రక సందర్భం ఆసన్నమైనదని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కవి రచయిత కందిమల్ల ప్రతాపరెడ్డి తెలిపారు. దేశాన్ని మతం పేరుతో ముక్కలు చేస్తున్న భయంకరమైన స్థితి నుంచి దేశాన్ని రక్షంచవలసిన మహోన్నత బాధ్యతను కమ్యూనిస్టులు తమ భుజస్కందాలపై వేసుకోవాలని పిలుపునిచ్చారు. జస్టిస్ బి చంద్రకుమార్ రచించిన మన దేశం ఎటు పోతుంది? మనం ఏమి చేయాలి అన్న పుస్తకాన్ని గురువారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో కందిమల్ల ప్రతాపరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ఎటు పోతుందో అన్న స్పృహతో నేటి యువతరం ముందుకు రావాలన్నారు. దేశంలోని అవినీతి అక్రమాలు, అన్యాయాలు పాలకుల దుర్నీతి మతం పేరుతో జరుగుతున్న విధ్వంసం విద్యా వైద్య రంగాలను ప్రైవేటుపరం చేయడం తదితర అంశాలకు సంబంధించి సవివరమైన లెక్కల్ని జస్టిస్చంద్రకుమార్ మన ముందు ఉంచారని చెప్పారు. దేశాన్ని మతం మత్తులో ముంచి, యువతరాన్ని గంజాయి మత్తు లోకి దించారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న విధ్వంసకర విధానాల నుంచి రక్షంచే శక్తి ఉన్న కమ్యూనిస్టులు నిస్తేజంగా ఎవరికి వాళ్లు గా విడిపోయి ఉండడం అన్యాయం అన్నారు. దేశంలో ప్రచారం నా యొక్క శక్తిని ఏడ్చికూర్చే పనిని కమ్యూనిస్టులంతా ఏకమై ముందుకు రావాలని తెలిపారు. దేశంలోని ప్రగతిశీల వాదులు మేధావులు, కవులు, రచయితలు, విద్యావంతులు వీళ్ళందరూ ఒక్క గొంతుకై దేశ రక్షణ కోసం నిలవాలన్నారు. ఎన్నికలంటే అమ్మకాల కొనుగోలు కేంద్రాలుగా మార్చివేశారన్నారు. లెఫ్ట్ పార్టీలో ఉన్న లోపాలను సవరించుకొని కమ్యూనిస్టులంతా ఒక తాటిపైకి వచ్చి ప్రజల పక్షంలో నిలవాలని చెప్పారు.

# గౌడ కులస్తులు అన్ని రంగాలలో రాణించాలి

- మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్



**నిర్మల్ రూరల్, జనవరి7(జనం సాక్షి) :** గౌడ కులస్తులు అన్ని రంగాలలో రాణించాలని మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు,తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అమరవేణి నర్సా గౌడ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో గౌడ జన హక్కుల పోరాట మోకుదెబ్బ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో ఇటీవల నిర్మల్,ఆదిలాబాద్ జిల్లాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్,ఉప సర్పంచ్ అభ్యర్థులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా అధ్యక్షులు చేపూరి కనక గౌడ్,ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఎల్.శ్రీనివాస్ గౌడ్ లు సభాధ్యక్షులుగా వహించగా ముఖ్య అతిదులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉట్నూర్ లింగా గౌడ్,రాష్ట్ర కోశాధికారి గర్గుల మురళి గౌడ్,రాష్ట్ర అధికార ప్రతినిధులు బాలసాని సురేష్ గౌడ్,ఇల్లందుల రాజగౌడ్,రాష్ట్ర కార్యదర్శి రంగు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు,గీత కార్మికులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండి గౌడ కుల ధమాషా ప్రకారం రాజకీయ,ఆర్థిక,ఉద్యోగ, విద్య,వైద్య అన్ని రంగాలలో వాటాను దక్కించుకోవాలని తెలిపారు. నూతన సర్పంచులు ప్రభుత్వ పథకాలను పేదలకు అందేవిధంగా చూడాలని తెలిపారు. రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలలో గౌడ కులస్తులు ఐక్యంగా ఉండి ఎక్కువ సంఖ్యలో గెలవాలని సూచించారు. అనంతరం సర్పంచ్,ఉప సర్పంచ్ లకు శాలువాలు,పుష్ప గుచ్చాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు

# కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసుల అండ

- కోటీ 31 లక్షల చెక్కును అందజేసిన డీజీపీ



**హైదరాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కుటుంబానికి బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా అందాల్సిన బీమా మొత్తాన్ని డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ శ్రీ బి శివధర్ రెడ్డి చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో గురువారం నాడు అందజేశారు. అంబర్‌పేట సిపిఎల్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన బోయ పాండు, ఆయన భార్య గత ఏడాది మార్చి 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బోయ పాండుకు బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఖాతా ఉండటంతో, ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించిన ఆయన కుటుంబ సభ్యులకు రూ.కోటి 31 లక్షల చెక్కును డిజిపి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిఎం కె. మురళీకృష్ణ, సలహాదారు రిటైర్డ్ బ్రిగేడియర్ ఎస్.కె. ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు శిక్షణ

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**శాయంపేట, 8 జనవరి (జనం సాక్షి) :** మహిళలు ఆర్థికంగా స్వావలంబులుగా మారేందుకు శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం సాయంత్రం భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలో నాబార్డు సహకారంతో యం ఉ సువిధ సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా స్వావలంబులుగా మారేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించి కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. నాబార్డు సహకారంతో యం ఉ సువిధ సంస్థ మహిళలకు అందిస్తున్న శిక్షణ అభినందనీయమన్నారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆల్ ఇన్ వన్ మెటీరియల్స్ ను ఎమ్మెల్యే జీఎస్సార్ పదో తరగతి విద్యార్థులకు అందజేశారు.

# నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రిలో చేపట్టిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న పోస్టుమార్టం గది నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టుమార్టం గది నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అవుట్ పేషంట్, ల్యాబ్, వార్డులు, పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఓ. పి. లో నమోదు అవుతున్న అనారోగ్య సమస్యల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరిస్తూ సాంకేతిక పరికరాలను సమకూర్చి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా అధికంగా వచ్చే జలుబు, జ్వర పీడితులకు వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యువజన సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**సూర్యాపేట (జనంసాక్షి) :** సూర్యాపేట క్యాంప్ కార్యాలయం లో ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రచురించిన తెలంగాణ యువజన సంఘము నూతన క్యాలెండర్ -2026ని మాజీ మంత్రి వర్యులు జగదీష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలంగాణ యువజన సంఘము ఆధ్వర్యంలో సమాజం లో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటం చేయడం, నాణ్యమైన విద్య - మెరుగైన వైద్యం కోసం వివిధ దశలలో ఉద్యమం చేయడాన్ని అభినందించారు. విద్యార్థి, యువకులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని, సమాజం లోని అవలక్షణాలకు గురి కాకుండా సమాజ శ్రేయస్సు కై పాటు పడాలని ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పై తెలంగాణ యువజన సంఘము ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఉచిత నాణ్యమైన విద్య- మెరుగైన ఉచిత వైద్యం ప్రభుత్వం అందించాలని, సూర్యాపేట జిల్లా లో అనుమతులు, అర్హతలు లేకుండానే పుట్ట గొడుగులుగా ప్రయివేట్ విద్య సంస్థ లు, ప్రయివేట్ హాస్పిటల్స్ పుట్టుకొస్తున్నాయని, ప్రయివేటు విద్య సంస్థ లలో, ప్రయివేట్ హాస్పిటల్స్ లలో అధిక ఫిజుల నియంత్రణ కోసం ఈ ఆర్థిక సంవత్సరం- విద్య సంవత్సరం ఆరంభం లోనే పాఠశాలలు పునః ప్రారంభ సమయంలోనే జిల్లా ప్రభుత్వ ఉన్నత అధికారులు " ఫీ రెగ్యులేషన్ కమిటీ" వేసి అధిక ఫిజులను నియంత్రించాలని అన్నారు. "విద్య- వైద్యం లో అవినీతి కి సహకరించే ప్రభుత్వ అధికారులు ఉగ్రవాదులు కంటే ప్రమాదం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్రే సత్యనారాయణ, రాష్ట్ర సీనియర్ నాయకులు భాషిపంగు సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగు సంతోష్ రెడ్డి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పోరెళ్ల విప్లవ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు సురేష్ నాయక్, జిల్లా కార్యదర్శి ధరవాత్ శివ, నాయకులు వడ్డెపల్లి నరేష్, దారావత్ వెంకటేష్ నాయక్, నకిరేకంటి సందీప్, బానోత్ నవీన్, బోడ పవన్ , శేఖర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా జాతరను నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకతను చాటి చెప్పాలి
- ముఖ్యమంత్రి చేతుల మీదుగా గద్దెల పునః ప్రారంభం
- జాతర పనులపై సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్.శ్రీనివాస రాజు సమీక్ష




**ములుగు బ్యూరో,జనవరి08(జనం సాక్షి) :** గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా జాతరను నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకతను చాటి చెప్పాలని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా గద్దెల పునః ప్రారంభం చేయడం జరుగుతుందని సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్. శ్రీనివాస రాజు తెలిపారు. గురువారం తాడ్వాయి మండలం మేడారం ఐటీడీఏ గెస్ట్ హౌస్ లో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా,డిఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మేడారం జాతర జనవరి 28వ తేదీ నుండి 31 తేదీ వరకు జరుగుతుందని 28వ తేదీన సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి పూజారులు సారలమ్మను, కొండాయి నుంచి గోవింద రాజు,పునుగొండ్ల నుంచి పగిడిద్ద రాజులను గద్దెపైకి తీసుకురావడంతో జాతర ప్రారంభం అవుతుందని,29వ తేదీన సాయంత్రం 6 గంటలకు చిలకల గుట్ట నుంచి పూజారులు సమ్మక్క దేవతను గద్దె మీదకు తీసుకురావడం జరుగుతుందని,30వ తేదీన భక్తులు మొత్తం వన దేవతలకు భక్తులు తమ మొక్కులను చెల్లిస్తారని, 31వ తేదీన సాయంత్రం 6 గంటలకు సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు,పగిడిద్ద రాజు వన దేవతలు వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని తెలిపారు. మేడారం జాతరకు 3 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, జాతర పరిసరాలను 8 జోన్ లుగా,ప్రతి జోన్ లో 8 మంది అధికారులు ఉంటారని, 42 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

జాతరకు వచ్చే భక్తులకు సెల్‌ఫోన్ సిగ్నల్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు, ఇందులో భాగంగా 60 శాశ్వత టవర్లను ఏర్పాటు చేయడం ద్వారా కాల్ డ్రాప్, వీక్ సిగ్నల్ సమస్యలను అధిగమించేలా ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. రహదారులకు సంబంధించి 39 పాత రహదారులు మరియు 10 కొత్త రహదారులలో మొత్తం 525 సమస్యలను పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు.

వీఐపీ వాహనాలు,ఆర్టీసీ బస్సులు, పసర తాడ్వాయి మీదుగా మేడారం కు చేరుకుంటాయని, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ మీదుగా వచ్చే వాహనాలు కాటారం - కల్వపల్లి మీదుగా మేడారం చేరుకుంటాయని హైదరాబాద్ వరంగల్ నుంచి వచ్చే ప్రైవేట్ వాహనాలు పసర మీదుగా చేరుకుంటాయని ఎస్పీ తెలిపారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రత్యేకంగా రహదారులు మరియు పార్కింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా,పార్కింగ్‌కు సంబంధించిన సమాచారం భక్తులకు సులభంగా అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జాతర సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్,ఈఓ వీరస్వామి, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పి ఆర్, ట్రైబల్ వెల్ఫేర్,ఇర్రిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ అధికారులు , డిపిఓ,ఎండోమెంట్, విద్యుత్, డి ఎం అండ్ హెచ్ఓ, ఫైర్, ఎక్సైజ్, ఫిషరీస్, టూరిజం, డిడబ్ల్యూఓ, డివిహెచ్ఓ, ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పాల డైరీని సందర్శించిన వాగ్దేవి విద్యార్థులు

**భీమదేవరపల్లి, జనవరి 08(జనం సాక్షి) :** హుజురాబాద్ పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కాలేజీ బీ.కాం (సీఏ) మొదటి సంవత్సరం విద్యార్థులు తమ ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గురువారం ముల్కనూర్‌లోని ముల్కనూర్ మహిళా కోఆపరేటివ్ పాల డైరీను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల సేకరణ విధానం శుద్ధి ప్రక్రియ ప్యాకింగ్ సరఫరా వ్యవస్థతో పాటు వాటికి సంబంధించిన ఖర్చులు,ఆదాయాలపై సమగ్ర అవగాహన పొందారు. ఇలాంటి ఇండస్ట్రియల్ టూర్ల ద్వారా విద్యార్థులు తరగతి గది చదువులతో పాటు ప్రాక్టికల్‌గా కూడా నేర్చుకునే అవకాశం లభిస్తుందని కళాశాల కరెస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు కొలిపాక రమేష్, సంపత్ పాల్గొన్నారు.

# జనంసాక్షి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డిపిఆర్ఓ



**మంచిర్యాల, జనవరి 8 (జనంసాక్షి) :** జనంసాక్ష 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను మంచిర్యాల డి పి ఆర్ ఓ కృష్ణమూర్తి ఆవిష్కరించారు. గురువారం నాడు మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని డిపిఆర్ఓ చాంబర్ లో క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా ఉంటూ నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురించాలని పేర్కొన్నారు ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మంచిర్యాల బ్యూరో పింగిళి సంపత్ రెడ్డి, స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్ , దండేపల్లి రిపోర్టర్ చక్రపాణి రామకృష్ణాపూర్ రిపోర్టర్ సారంగరావు నస్పూర్ రిపోర్టర్ రామకృష్ణ పాల్గొన్నారు

# ప్రజాస్వామ్య పుట్టినిల్లు నుంచి ప్రజాస్వామ్యంపై దాడి వరకు

అమెరికా స్వాతంత్ర్య చరిత్ర, వెనెజులా ఘటన, ప్రపంచ స్పందనలు 1776 జులై 4న బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తి పొంది స్వాతంత్ర్య దేశంగా అవతరించిన అమెరికా, ప్రజాస్వామ్యానికి ప్రపంచంలోనే ఒక ప్రధాన ప్రతీకగా నిలిచింది. ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల ద్వారానే పాలన సాగాలి అనే భావనను ప్రపంచానికి పరిచయం చేసిన దేశంగా అమెరికా చరిత్రలో స్థానం సంపాదించింది. 1783 సంవత్సరంలో బ్రిటన్ అధికారికంగా స్వాతంత్ర్యాన్ని అంగీకరించినప్పటికీ, 1776 జులై 4నే అమెరికా ప్రజాస్వామ్య ప్రయాణానికి ఆరంభ దినంగా గుర్తించబడుతుంది.

అయితే, స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి రెండు శతాబ్దాలకు పైగా గడిచిన తర్వాత, అదే అమెరికా తన చేతులారా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలకు పాల్పడుతోందా అనే ప్రశ్న ఈనాటి ప్రపంచాన్ని కుదిపేస్తోంది. 2026 సంవత్సరంలో వెనెజులాపై చేపట్టిన అమెరికా దాడి ఈ సందేహాలకు కేంద్రబిందువుగా మారింది. ప్రజలచే ఎన్నికైన ఒక స్వతంత్ర దేశాధ్యక్షుడిని బలవంతంగా తొలగించి, అరెస్టు చేసి, తమ దేశ చట్టాల ప్రకారం విచారణ జరుపుతామని ప్రకటించడం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్రమైన ఆందోళనకు కారణమైంది.

వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోపై మాదకద్రవ్యాల ఆరోపణలు మోపి, ఆ దేశంలో పాలన మార్పు తీసుకురావాలని అమెరికా ప్రయత్నించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని అనేక దేశాలు అభిప్రాయపడ్డాయి. ప్రజాస్వామ్యం అంటే ప్రజల తీర్పును గౌరవించడం; కానీ ఆ తీర్పు తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నప్పుడు దాన్ని అంగీకరించని ధోరణి అమెరికా వ్యవహారంలో పదే పదే బయటపడుతోంది. ఈ సంఘటనపై ప్రపంచ దేశాల ప్రతిస్పందనలు విభిన్నంగా ఉన్నప్పటికీ, మెజారిటీ దేశాలు అమెరికా చర్యను ఖండించాయి. చైనా, రష్యా ఈ దాడిని సార్వభౌమత్వంపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించాయి. లాటిన్ అమెరికా ప్రాంతంలోని బ్రెజిల్, మెక్సికో, చిలీ వంటి దేశాలు ఇది ప్రమాదకరమైన ఉదాహరణగా మారుతుందని హెచ్చరించాయి. యూరోప్‌కు చెందిన కొన్ని దేశాలు కూడా అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ఈ చర్య జరిగిందని పేర్కొన్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో చర్చ జరిగినా, అమెరికా ప్రభావం కారణంగా స్పష్టమైన తీర్మానం రావడంపై పెద్దగా ఆశలు కనిపించలేదు.

వెనెజులా ఘటనతో పాటు, అమెరికా ప్రజల్లోనే ట్రంప్ విదేశాంగ విధానాలపై పెరుగుతున్న వ్యతిరేకత మరో ముఖ్యమైన అంశం. 2026 జనవరిలో వెలువడిన ప్రజాభిప్రాయ సర్వేల ప్రకారం, వెనెజులాపై అమెరికా చేపట్టిన బలవంతపు చర్యలకు కేవలం 33 శాతం మంది అమెరికన్లు మాత్రమే మద్దతు తెలిపారు. 67 శాతం మంది ఈ చర్యను వ్యతిరేకించారు లేదా అనుమానంతో చూశారు. డెమోక్రాటిక్ పార్టీకి చెందిన వారిలో కేవలం 11 శాతం మాత్రమే మద్దతు తెలపగా, రిపబ్లికన్ వర్గాల్లో 65 శాతం వరకు మద్దతు కనిపించింది. ఈ గణాంకాలు అమెరికా సమాజంలోనే ప్రజాస్వామ్య విలువలపై తీవ్ర విభజన ఉందని స్పష్టంగా సూచిస్తున్నాయి.

అదే విధంగా, 2025 చివరి నాటికి ట్రంప్ మొత్తం ఆమోద రేటింగ్ సుమారు 40 శాతంగా నమోదవడం, అమెరికా ప్రజల్లో విస్తృత స్థాయిలో అసంతృప్తి ఉందనే వాస్తవాన్ని బలపరుస్తోంది. 72 శాతం మంది అమెరికన్లు అమెరికా ఇతర దేశాల వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందనే భయాన్ని వ్యక్తం చేసినట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇది అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థలోనే పెరుగుతున్న ఆత్మపరిశీలనకు సంకేతంగా చూడవచ్చు.

ఇరాక్, లిబియా, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో గతంలో జరిగిన అమెరికా జోక్యాలు కూడా ఇదే తరహా ప్రజాస్వామ్య విరుద్ధ ధోరణికి ఉదాహరణలుగా నిలుస్తాయి. మారణాయుధాల పేరుతో ఇరాక్‌పై దాడి చేసి, చివరికి ఆ ఆరోపణలు అబద్ధమని తేలినా, ఆ దేశం అనుభవించిన విధ్వంసానికి బాధ్యత ఎవరు వహించారనే ప్రశ్న ఇప్పటికీ మిగిలే ఉంది. లిబియాలో గడాఫీ హత్య అనంతరం ఆ దేశం ఎదుర్కొంటున్న అ???కత్వం కూడా అమెరికా జోక్యాల ఫలితమేనని అనేక విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ ప్రజాస్వామ్యంపై వ్యక్తం చేసిన ఆలోచనలు మరింత ప్రాసంగికంగా మారుతున్నాయి. లింకన్ ప్రజాస్వామ్యాన్ని ఒక రాజకీయ వ్యవస్థగా మాత్రమే కాకుండా, ప్రజల గౌరవాన్ని కాపాడే నైతిక బాధ్యతగా చూశాడు. ప్రజల చేత ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకే జవాబుదారీగా ఉండాలని ఆయన విశ్వసించాడు. ప్రజల అభిప్రాయాన్ని లెక్కచేయని పాలన ఎంత శక్తివంతమైనదైనా, అది ప్రజాస్వామ్యం కాదని లింకన్ స్పష్టం చేశాడు.

ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల ద్వారానే నడిచే పాలన భూమి మీద నుంచి అంతరించిపోకూడదన్నదే ఆయన ఆలోచనల సారాంశం. ఓటు అనే ఆయుధం తుపాకీ కన్నా శక్తివంతమని ఆయన నమ్మాడు. ప్రజల స్వరం మౌనమైతే, అధికార బలం దురహంకారంగా మారుతుందని లింకన్ హెచ్చరించాడు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించడమే నిజమైన దేశభక్తి అని ఆయన భావించాడు. ప్రజాస్వామ్యం ప్రజలదే, ప్రజల మీద కాదు అనే సత్యాన్ని లింకన్ తన జీవితంతో చాటిచెప్పాడు.

1776లో స్వాతంత్ర్యం సాధించిన అమెరికా, తన చరిత్రను తిరిగి చూసుకుంటే, స్వేచ్ఛ కోసం పోరాడిన ప్రజల ఆశయాలను తానే తానే ఉల్లంఘిస్తున్నదా అనే ప్రశ్న ఎదురవుతోంది. వెనెజులాపై దాడి, ప్రపంచ దేశాల స్పందనలు, అమెరికా ప్రజల్లోనే పెరుగుతున్న వ్యతిరేకతకలిసి ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యం ఉపన్యాసాలతో కాదు, ఆచరణతోనే నిలుస్తుంది. ఆచరణ తప్పితే, ప్రజాస్వామ్య పుట్టినిల్లు అనే గుర్తింపు కూడా చరిత్ర పుస్తకాలలో ఒక వ్యంగ్య వాక్యంగా మాత్రమే మిగిలిపోతుంది.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# అమెరికా ఒక దౌర్జన్య శక్తి - ట్రంప్ ఒక ఉన్మాది



ఇరాక్‌పై 2003 దాడితో అమెరికా ప్రారంభించిన క్రూరమైన 'శాశ్వత యుద్ధ' విధానం, ఇప్పుడు తన రూపం మార్చుకొని వెనిజులా, గ్రీన్లాండ్, కొలంబియాలపై దృష్టి సారించింది. ఈ దేశాలపై ఉన్న చమురు, అరుదైన ఖనిజాల నిల్వలు, వాటి ప్రాధాన్యత గురించి అమెరికా చేసే ప్రచారం వారి వాస్తవ ఉద్దేశాలను బహిర్గతం చేస్తుంది. ప్రపంచాన్ని మోసగించే పద్ధతిలో, ప్రతిసారీ వేర్వేరు కారణాలు చెప్పి దేశాలపై దాడి చేస్తున్న అమెరికా రాజకీయాలు ఇప్పుడు ప్రజాస్వామ్యం కోసం కాదు, ఆర్థిక లాభాల కోసం అనేది స్పష్టమైంది.

గతంలో అమెరికా... ఇరాక్ వద్ద రసాయినిక మారణాయుధాలు ఉన్నాయని, ప్రపంచ శాంతికి ముప్పు ఉందని ప్రచారం చేసింది. తర్వాత ఆ వాదనలు అబద్ధమని రుజువైనప్పటికీ, అమెరికా తప్పు ఒప్పుకోలేదు. అలాగే, వెనుజులా విషయంలో మాదకద్రవ్యాల నెట్వర్క్ ను నాశనం చేయడానికి దాడి చేస్తున్నామని అంటున్నారు. కానీ వాస్తవం ఏమిటంటే, వెనిజులాలో అపారమైన చమురు నిక్షపాలు, బంగారం, వజ్రాలు,ఇతర అరుదైన లోహాల నిల్వలు ఉన్నాయి. అమెరికన్ కంపెనీలు ఇప్పటికే అక్కడి వనరులపై దృష్టి పెట్టాయి. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను కిడ్నాప్ చేసి తీసుకువెళ్ళడం, ఆ దేశ చమురు పరిశ్రమను స్వాధీనం చేసుకోవాలనే చేసే రౌడీ దౌర్జన్యాల ప్రకటనలు స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ చర్యలు ఒక దేశ సార్వభౌమాధికారాన్ని పూర్తిగా అతిక్రమించే దోపిడీ చర్యలే.

గ్రీన్లాండ్‌లో 1.5 మిలియన్ టన్నుల అరుదైన ఖనిజాలు ఉన్నాయని, భద్రతా కారణాలతోపాటు ఈ వనరులు అమెరికాకు అవసరమని ప్రచారం చేస్తున్నారు. ఈ విధంగా, ట్రంప్ ప్రభుత్వం ప్రపంచ వనరులపై తమ ఆధిపత్యాన్ని స్థాపించడానికి ప్రయత్నిస్తోంది. కొలంబియాలోని ఖనిజ వనరులపై కూడా దృష్టి ఉంది. ఇది కేవలం భద్రతా సమస్య కాదు, ఒక ఆర్థిక దోపిడీ. ప్రపంచ వ్యాప్తంగా చమురు ఉత్పత్తిలో వెనిజ్వేలా వాటా ఒక శాతం కన్నా తక్కువే అయినప్పటికీ, ప్రపంచ చమురు నిక్షపాల్లో ఐదింట ఒక వంతు అక్కడే ఉంది. ఈ వనరులు అమెరికాకు అపారమైన ఆర్థిక లాభాల్ని ఇస్తాయి. ప్రస్తుతం 38.4 ట్రిలియన్ డాలర్ల అప్పుల్లో ఉన్న అమెరికా ఈ వనరుల దోపిడీ ద్వారా తన ఆర్థిక సమస్యలను తీర్చుకోవాలనుకుంటోంది.

అమెరికా రౌడీ ఇజాన్నీ ప్రపంచ దేశాలు భరించాల్సిందేనా? ఈ ప్రశ్న ఇప్పుడు ప్రతి దేశం ఎదుర్కొంటున్న సవాలు. అమెరికా సైనిక శక్తి ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది. వారి రక్షణ బడ్జెట్ మిగతా ప్రపంచం మొత్తం బడ్జెట్ కంటే ఎక్కువ. అయినప్పటికీ, చైనా, రష్యా, సౌత్ కొరియా వంటి దేశాలు కలిసి పని చేస్తే అమెరికా సైనిక శక్తిని ఎదురించగలవు. కానీ, రాజకీయ ఏకాభిప్రాయం లేకపోవడం, ఆర్థికంగా ఆధారపడటం వల్ల ఈ దేశాలు ఒకచోట కలిసి పని చేయడం కష్టం. అమెరికా తన ఆర్థిక మరియు రాజకీయ ప్రభావాన్ని ఉపయోగించి ఈ దేశాల మధ్య విభేదాలు సృష్టిస్తుంది, తద్వారా వారు ఏకీభవించకుండా చూస్తుంది.

అమెరికా చేతిలో ఎంతమంది దేశాధినేతలు చనిపోయారు? ఇది ఒక చరిత్ర పుటల్లో దాగిఉన్న నిజం. ఇరాక్ లో సద్దాం హుస్సేన్, లిబియాలో అమ్మర్ గద్దాఫీ వంటి నాయకులు అమెరికా జోక్యంతో పదవీచ్యుతులు కావడం, చనిపోవడం జరిగింది. ఇప్పుడు వెనిజ్వేలాలో నికోలస్ మదురో కూడా ఇదే గతిని అనుభవిస్తున్నారు. ఈ విధంగా, అమెరికా ప్రభావ వలయం నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించే నాయకులను తొలగించడానికి నిరంతరం ప్రయత్నిస్తోంది. ఇది రాజ్యాల సార్వభౌమాధికారంపై తీవ్రమైన దాడి. ఒక దేశం స్వయం ప్రతిపత్తి కలిగి ఉండటం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం అనే సూత్రం అమెరికా చర్యల వల్ల అర్థరహితమైంది. ఈ సందర్భంలో యునైటెడ్ నేషన్స్ మరియు అంతర్జాతీయ న్యాయస్తానాల పాత్ర ఏమిటి? అమెరికా దౌర్జన్యాలను యు.ఎన్.ఓ. ఎదురించలేదు. అంతర్జాతీయ న్యాయస్థానం మరియు భద్రతా మండలి ఉన్నప్పటికీ, అమెరికా వాటిని నిర్లక్ష్యం చేస్తుంది. భద్రతా మండలిలో వీటో అధికారం ఉన్న అమెరికా, తనపై నిర్ణయాలు రాకుండా చూసుకోగలదు. అంతర్జాతీయ న్యాయస్థానం నిర్ణయాలు అమలు చేయడానికి సైనిక శక్తి లేదు. కాబట్టి, ఈ సంస్థలు అమెరికా వంటి శక్తివంతమైన దేశాల ముందు నిస్సహాయంగా ఉన్నాయి. అమెరికా తరచుగా ఈ సంస్థల నియమాలను ఉల్లంఘిస్తుంది, కానీ దానిపై పరిణామాలు ఏమీ ఉండవు.

**చివరకు, ప్రశ్న ఇదే:** ఈ దౌర్జన్యాన్ని ఎవరు ఎదురించగలరు? ప్రపంచ దేశాలు సామూహికంగా నిలదొక్కుకోవాలి. బహుళపక్ష వ్యవహారాలను బలోపేతం చేయాలి. యు.ఎన్. సంస్కరణలు తప్పనిసరి, తద్వారా శక్తివంతమైన దేశాలు వీటో అధికారాన్ని దుర్వినియోగం చేసుకోకుండా నిరోధించాలి. ఆర్థికంగా బలహీనమైన దేశాలు వనరులను స్వయం నియంత్రణలో ఉంచుకోవడానికి మరియు వివిధ దేశాలతో సహకరించడానికి వీలు కల్పించాలి. ప్రపంచంలోని ప్రజలు, మాధ్యమాలు ఈ దౌర్జన్యాన్ని గుర్తించి నిరసన వ్యక్తం చేయాలి. అమెరికా దౌర్జన్యం కేవలం ఒక దేశం విషయం కాదు, ఇది మానవత్వం, న్యాయం మరియు అంతర్జాతీయ నియమాల పట్ల ప్రపంచ వ్యవస్థ యొక్క ప్రతిస్పందనకు పరీక్ష. ఈ సవాళ్లను ఎదుర్కోవడం మానవ హక్కులు మరియు సార్వభౌమత్వం కోసం పోరాటం అవసరం.ఈ ప్రమాదం కేవలం వెనుజులాకే పరిమితం కాదు.రేపటి రోజున మన దేశంపై కూడా దండెత్తే ప్రమాదం లేకపోలేదు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## వ(వి)లువల విప్లవం

ఆమె నడుస్తుంది
అరకొర ఆచ్ఛాదనతో
కప్పమని కొందరు
ఆమె నడుస్తుంది
ఆంక్షల ముసుగుతో
విప్పమని కొందరు
ప్రోగ్రెసివ్ ప్రపంచంలో

నవ నాగరికత నగీషీలు
డార్క్ ఛాయలో
గిరిగీసుకున్న సంజాయిషీలు
ఇది
బరితెగించిన స్వేచ్ఛో
బలవంతపు ఇచ్ఛో
స్త్రీవాదంపై కక్ష
మరి.. కక్ష్యలేవో
తెలిపేదెవరు తెలిసేదెవరు

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

## వృద్ధాప్యం

వృద్ధుల జీవితం
జ్ఞాన మార్గం
అది యువతకు
బోధి వృక్షం

కలి కాలం
బంధాలు దారి తప్పింది
వృద్ధుల ఊపిరి
కాలం మింగేస్తుంది

ఎన్నో మలుపులు
పడచుతనం
ఎన్నో ముడతలు
ముసలి తనం

కాలం
ఎవరి కోసం ఆగదు
వృద్ధాప్యం
ఆనందంగా సాగాలి

వయస్సులో

స్వంత ఇంటి చింత ఉండదు
వృద్ధాప్యం వస్తే
స్వంత ఇల్లు అవసరం

జీవిత ప్రయాణం
బాల్యం నుండి వృద్ధాప్యం
వృద్ధాప్యం
స్వర్గ మార్గానికి


**తుమ్మా రాజా**
**కోదాడ**
**8099918883**

# సావిత్రిబాయి పూలేతో పాటు ఫాతిమా షేక్

మనదేశంలో ఆడపిల్ల చరిత్ర, వర్తమానం, భవిష్యత్ ను అక్షరాలతో వెలిగించిన జ్ఞానజ్యోతి సావిత్రిబాయి పూలే. ఆ జ్ఞానజ్యోతికి తోడైన మరో మహిళ ఫాతిమా షేక్. సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ 19వ శతాబ్దంలో మహారాష్ట్రలో మహిళల విద్యా వ్యాప్తికి కృషి చేసిన తొలి మహిళా గురువులు. సావిత్రిబాయి భారతీయ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచింది. ఆమె విద్య ఉద్యమంలో పాల్గొని ఆ కుటుంబానికి తోడుగా నిలిచిన దేశ తొలి ముస్లిం మహిళా టీచర్ ఫాతిమా షేక్. సావిత్రిబాయి పూలేతో కలిసి దళిత, ముస్లిం, బాలికల విద్యా వ్యాప్తికి కృషి చేసింది. ఫాతిమా షేక్ 1831 జనవరి 9న పుణెలో జన్మించారు. సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావ్ పూలే ప్రోత్సాహంతో ఇంట్లోనే విద్యావంతురాలైనది. ఫాతిమా షేక్ ఆమే సోదరుడు ఉస్మాన్ షేక్ సహకారంతో విద్యనభ్యసించింది. సావిత్రిబాయి పూలేతో పాటు ఫాతిమా షేక్ అహ్మద్ నగర్ లోని సింథియా ఫర్రార్ అమెరికన్ మిషనరీలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఫాతిమా సోదరుడు ఉస్మాన్ షేక్ ఇంట్లోనే పూలే దంపతుల 1848లో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. ఆ దంపతులు స్థాపించిన పాఠశాలల్లో ఫాతిమా షేక్ విద్య బోధించింది. 1851లో ముంబాయిలో రెండు పాఠశాలల స్థాపనలో పాల్గొన్నది. వీరిద్దరూ అట్టడుగు కులాల ఆడపిల్లలకు, ఆధిపత్య కులాల ఆడ పిల్లలకు విద్యానందించి వారి సాధికారతకు కృషి చేసిన తొలి ఫెమినిస్ట్ లు. అన్ని కుల, మతాల పిల్లలకు విద్యను బోధించారు. వారి విద్యా ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించింది. భవిష్యత్ తరాల కోసం వాళ్ళు అవమానాలను, దాడులను సైతం భరించారు. అమ్మాయి చదువు అవనికి వెలుగని చాటిచెప్పి అంతరిక్షం దాకా నడిపించిన గొప్ప మహిళామణులు.

**పూలే దంపతులకు అండగా ఫాతిమా కుటుంబం**

ఫాతిమా షేక్ సహకారం లేకుండా పూలే దంపతుల స్త్రీ, దళిత విద్యా ఉద్యమం పరిపూర్ణం కాదు. ముస్లిం మహిళగా కుల, మత భేదాలు వీడి సమానత్వ ఆలోచనలకు అండగా నిలబడి, భారతీయ స్త్రీవాదానికి పునాది వేశారు. సావిత్రిబాయి పూలే స్త్రీలను చైతన్యపరచడానికి 1852 లో "మహిళా సేవ మండలు సంఘాన్ని స్థాపించింది. లింగ వివక్షతకు, పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడింది. కుల వ్యవస్థలో సామాజిక అణిచివేతను, మూఢత్వాన్ని పారద్రోలి



(మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి జనవరి 9)

"సత్యాన్ని" శోధించడానికి 1873 లో భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి సత్యశోధక సమాజాన్ని ప్రారంభించినది. ఈ సంస్థ బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపింది. వితంతు పునర్వివాహల కోసం కృషి చేశారు. బాల్యంలో వైధవ్యాన్ని అనుభవించే ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్ల పోశారు. వితంతు స్త్రీల శిరోముండనంను తీవ్రంగా ఖండించి ఆపేసింది. సత్యశోధక్ సమాజ్ లోని 'మహిళా విభాగం' సావిత్రిబాయి నేతృత్వంలో పురోహితులు లేకుండానే వివాహాలను నిర్వహించారు. కరువు బారిన పడి అనాథలైన పిల్లలను అక్కున చేర్చుకున్నారు. వీరినే పిల్లలుగా భావించి ఆ పుణ్య దంపతులిద్దరు సంతానాన్ని వద్దనుకున్నారు. యశ్వంత్ రావు అనే అనాధ బాలున్ని దత్తపుత్రుడిగా పెంచుకున్నారు. పూలే దంపతులు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా బాలికల పాఠశాలలు ప్రారంభించడంతో జ్యోతీరావ్ పూలేను తండ్రి ఇంటి నుంచి బయటకు పంపాడు. అప్పుడు ఫాతిమా సోదరుడు మియాన్ ఉస్మాన్ షేక్ పూలే దంపతులకు ఆశ్రయమిచ్చారు. పూలే దంపతుల సంస్కరణలను అడగడుగున ఆదిపత్య కులాలు వ్యతిరేకించినప్పటికీ వారికి ఫాతిమా కుటుంబం సహకరించింది. కానీ ఫాతిమా షేక్ ను చరిత్రలో ఒక అజ్ఞాత హీరోగా, కేవలం సావిత్రి నీడగా చూడడం సరికాదు. ఆమెతో పాటు నడిచిన సహోద్యోగిగా, సహచరిగా, సహోదరిగా గుర్తుంచుకోవాలి.

**ఉమ్మడి సహకారంతో విముక్తి ఉద్యమాలు**

సావిత్రిబాయి పూలే బాలికలకు విద్య బోధించడానికి వెళ్తున్నప్పుడు అగ్రకులాలు ఆమెపై రాళ్లు, పశువుల పేడ నీళ్ళు చల్లి తీవ్ర అవమానాలు గురిచేసినప్పుడు ఫాతిమా తో పాటు పలువురు అండగా నిలిచారు. చమార్ కులానికి చెందిన కర్ర సాము యోధుడు లహూజీ సాల్వే(మాతంగి) ఆమెకు రక్షణగా నిలిచాడు. ఆయన మహారాష్ట్రలో జ్యోతిబా పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ లో చురుకుగా పనిచేసి, దళిత, అస్పృశ్యులకు విద్యా ప్రచారం, కులవివక్ష వ్యతిరేక పోరాటాలు చేశాడు. తమిళ దళిత నాయకుడు అయోతి దాస్ ద్రావిడ ఆలోచనల పయనీరు అని పిలుస్తారు. ఆయన ద్రావిడ, దళిత రాజకీయాలకు పునాది వేశాడు. ఆయన ఆలోచనా వారసత్వంతో పెరియార్ ద్రావిడ ఉద్యమాన్ని విస్తృతపరిచి అట్టడుగు వర్గాల సామాజిక, రాజకీయ చైతన్యానికి కృషిచేశారు. అనాడు పెరియార్ ,అంబేద్కర్ బహుజన పోరాటాలపై కూడా మాట్లాడుకున్నారు. మహారాష్ట్ర కొల్హాపూర్ సంస్థాన రాజు, రిజర్వేషన్ పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ అంబేద్కర్‌కు ఆర్థిక సహాయం చేసి, దళిత, బహుజన ఉద్యమాన్ని ప్రోత్సహించాడు. పూలే దంపతుల విద్య ఉద్యమానికి ఫాతిమా షేక్ అండగా నిలిచింది. పై ఉదాహరణలు పరిశీలించినట్లయితే పూలే దంపతులు, ఫాతిమా షేక్ నుంచి అంబేద్కర్ వరకు బీసీలకు, దళితులకు, ముస్లింలకు చక్కటి అనుబంధం ఉండేదని స్పష్టమవుతుంది. నేడు ఆ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్స్ కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో '42 శాతం రిజర్వేషన్ సాధన సమితి' పేరుతో ఉమ్మడి ఉద్యమం జరుగుతుంది. ఇది మరింత బలపడి సమాజంలో వెళితే బహుజన రాజ్యాధికారానికి పునాదిపడుతుంది.



**సంపతి రమేష్ మహారాజ్**
**సామాజిక విశ్లేషకులు**
**7989579428**

# సమాజంలో అశాంతి, అభద్రత

**పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం సమాజంలో అశాంతి, అభద్రతకు లోనూ చేస్తున్నది. మన దేశంలో ఉపాధి అవకాశాల స్వరూపం సమూలంగా మారిపోతోంది. చదివిన చదువుకు సంబంధం లేని ఉద్యోగాలు చేస్తున్నారు. దొరికిన ఉద్యోగం ఎప్పుడూ ఊడుతుందో తెలియని భయం ప్రయివేటు ఉద్యోగుల్లో కనిపిస్తోంది. పని గంటలు పెరిగిపోతున్నాయి. సాఫ్ట్వేర్ కంపెనీలు రాత్రికి రాత్రి మెయిల్స్ పంపుతూ... ఉద్యోగులను టెర్మినెట్ చేస్తున్నాయి. వేళాపాళా లేని ఉద్యోగాలు చేస్తున్న వారు అనారోగ్యం బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వర్క్ టెన్షన్ తో ఎవరితో కలవకుండా... ఒక రకమైన జైలు జీవితం గడుపున్నారు. ఫలితంగా మానసిక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి.**

ఉన్నత విద్య, అత్యున్నత నైపుణ్యం కలిగిన వారు ఒక వర్గంగా... సాధారణ విద్య, నైపుణ్యం నేర్వని యువత వేరొక వర్గంగా సమాజం చీలి పోతున్నది. నైపుణ్యం కలిగిన వారు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, క్వాంటమ్ కంప్యూటింగ్, మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, హాస్పిటాలిటీ వంటి రంగాలలో కళ్లు చెదిరే జీతాలు అందుకొంటున్నారు. రెండవ వర్గం వారు చాలీచాలని జీతాలతో, ఎదుగుబొదుగు లేని ఉద్యోగంతో, దిన దిన గండం నూరేళ్ల ఆయుష్షు మాదిరిగా బతుకులు వెళ్లదీస్తున్నారు. మానవ సంబంధాలు, విలువలు శీనిస్తున్నాయి. సమాజంలో సంపన్న, పేద వర్గాల మధ్య సంపద పంపిణీలో తేడా ఒక పెను రమాదంగా మారబోతున్నదని ప్రపంచం యావత్తు ఆందోళన చెందుతున్నది. ఇదే సమయంలో యువతరంలో, కేవలం ఉద్యోగాల మీద ఆధారపడి బ్రతికే వారి మధ్య కూడా అంతస్తుల అంతరం పెరుగుతున్నది. ఇది ఆందోళన కలిగించే సామాజిక పరిణామం.



అసంతృప్తి, అసహనం, నిరాశ నిస్పృహలతో లక్షల మంది యువకులు జీవితాలు గడిపే సామాజిక వాతావరణం దేశానికి ఎంత మాత్రం హితం కాదు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మారుతున్న సమాజంలో ఉత్పన్నం అవుతున్న కొత్త సమస్యలపై దృష్టి సారించి.. సమాజంలో పెరుగుతున్న అశాంతి, అసహనం, ఆదాయ అంతరాలను తొలగించాలి.

ప్రతి రాష్ట్రంలో గిగ్ వర్కర్లుగా లక్షలాది మంది మారిపోతున్నారు. పై చదువులు కోసం కొందరు సంపాదన సరిపోక మరికొందరు..పెళ్లి చేసుకుని త్వరగా సెటిల్ అవ్వాలని ఇంకొందరు.. ఇలా రకరకాల అవసరాలు గిగ్ వర్కర్లుగా మారడానికి కారణం. స్విగ్గి, జొమాటో, బ్లింక్ ఇట్, బిగ్ బాస్కెట్, అమెజాన్ వంటి యాప్ ఆధారిత సర్వీస్ రంగంలో పని చేస్తున్న చిరుద్యోగులు సమ్మె చేశారు. దేశం మొత్తం మీద లక్షల సంఖ్యలో యువతీ యువకులు పని చేస్తున్న ఈ రంగంలో. నిర్ణీత పని గంటలు లేవు. అర్ధరాత్రి కూడా పనిచేయాలి. కాలంతో పోటీ పడుతూ.. నిమిషాల్లో ఆర్డర్లను కస్టమర్లకు అందించాలి. ఓలా, ఊబర్ వంటి ట్యాక్సీ సర్వీసులలో వున్న డ్రైవర్లు 24 గంటలూ అందుబాటులో వుండాలి. కానీ వీరి జీతాలకు హామీ లేదు. వీరి జీవితాలకు భద్రత కూడా లేదు. సాంకేతిక పరిజ్ఞానం సృష్టించిన ఉపాధి అవకాశాలివి. వీరి చదువులు ఎంత చిన్నవైనా, డిజిటల్ లిటరసీ కలిగిన వారు కావడం గమనార్హం. ఎంత పని చేస్తే అంత ఆదాయం అనే ఆకర్షణ చూపి వీరిని ఉద్యోగాల లోకి ఆకర్షిస్తున్నాయి కంపెనీలు. కానీ సాంకేతిక పరిజ్ఞానం మాయాజాలంతో పని చేసే కొద్దీ ఆదాయం తగ్గిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చెప్పిన సమయానికి నిముషాలు, సెకండ్లలో లెక్క వేసి వీరి పని తీరును అంచనా వేస్తాయి కంప్యూటర్లు. దానికి తగినట్లే వారికి వచ్చే రాబడి నిర్ణయిస్తాయి. చెప్పిన సమయానికి డెలివరి ఇవ్వాలంటే, ట్రాఫిక్ అధికంగా వున్న రోడ్లలో కూడా శరవేగంతో తమ వాహనాలను పరుగులెత్తించాలి. దానివల్ల పలు సందర్భాలలో వారి ప్రాణాలకే ముప్పు వస్తుంది. మరొక పక్క డెలివరీ ఇస్తే వచ్చే రాబడి, స్పీడ్ వెళ్లారనో, ట్రాఫిక్ రూల్స్ పాటించలేదనో పోలీసులు విధించే చలానాలకు సరి పోతున్నది. నెల చివరన చూసుకొంటే, తినడానికి తిండి కూడా ఇవ్వలేని రాబడి పని ఇది. కష్టం మాత్రం నరాలు తెగిపోయే ఒత్తిడితో కూడుకొన్నది. పైగా డెలివరీ ఇవ్వడానికి వెళ్లిన ఇళ్ల వద్ద అన్ని సమయాలలో వీరికి సరైన గౌరవ మర్యాదలు లభించడం లేదు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ విలువను గుర్తించలేని వినియోగదారులు వీరి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ వుంటారు.

అడగగానే ఉద్యోగం వస్తుందనే ఆశతో లక్షల సంఖ్యలో యువతీ యువకులు ఈ ఉద్యోగాలకు వెళ్తున్నారు. కానీ ఎన్నాళ్లు పని చేసిన వారి జీవితాలలో మెరుగుదల కన్పించడం లేదు. కన్పిస్తుందనే ఆశ కూడా లేదు. కంపెనీలు లాభాపేక్షతో పని చేసేవి కాబట్టి, ఉద్యోగుల భద్రత, రాబడి మీద దృష్టి పెడతాయని భావించలేము. ప్రభుత్వాలే వీరికి అండగా నిలవవలసిన సమయం వచ్చింది. కార్మిక చట్టాలను వీరికి అమలు చేసి, కనీస వేతనాలు, జీవిత భద్రత, ప్రమాదాల నుంచి రక్షణ, జీవిత బీమా, ఆరోగ్య వసతి వంటి కనీస భరోసా కల్పించడం ప్రభుత్వాలు తక్షణం చేయవలసిన పని. అసంతృప్తి, అసహనం, నిరాశ నిస్పృహలతో లక్షల మంది యువకులు జీవితాలు గడిపే సామాజిక వాతావరణం దేశానికి ఎంత మాత్రం హితం కాదు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మారుతున్న సమాజంలో ఉత్పన్నం అవుతున్న కొత్త సమస్యలపై దృష్టి సారించి... సమాజంలో పెరుగుతున్న అశాంతి, అసహనం, ఆదాయ అంతరాలను తొలగించాలి. ఉపాధి అవకాశాలు పెంచుతూ...చిరుద్యోగులకు మేమున్నాం అన్న భరోసా కల్పించాలి.



**వంగ మహేందర్ రెడ్డి**
**సీనియర్ జర్నలిస్ట్**
**9963155523**

## కవితధర్మం

కాలంతో మనం
అప్పుడు అయిన ఇప్పుడు
అక్షరాలు బందీ కావు
హృదయ స్పందనలు అనుభవాల స్పటికాలు
ఆధునిక కవితలు
పద్యం ఇక రాజదర్బాంలో కాదు

పల్లె సుద్దుల్లో
ఆకలితో కేకలు వేసే బాల్యంలో
పేద వాడి ఆకలితో నడుస్తుంది
కవికి కిరీటం అవసరం లేదు
నాడు అయిన నేడు అయిన
సమాజ సమస్యలే అతని
అస్త్రాలు ప్రశ్నించుటే అతని
నైజం
అలంకారం కంటే అర్థం

ముఖ్యమైంది
ఛందస్సు,అలంకారాలు కంటే
చైతన్యం గొప్పది

**ఉమాశేషారావు వైద్య**
**లెక్చరర్, కామారెడ్డి**
**9440408080**

# వనపర్తి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుదాం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐ.డి. ఒ.సి ప్రాంగణం నుండి నల్ల చెరువు వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, జిల్లా ఎస్పీ డి సునీత తో కలిసి జెండా ఊపి ప్రారంభించడమే కాకుండా స్వయంగా ర్యాలీలో పాల్గొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించని వారికి తాము కూడా ఎప్పటికీ సహకరించబోమని కరాఖండిగా చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అధికారులు రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా ప్రభుత్వ సిబ్బంది కూడా ప్రతి ఒక్కరు నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడంలో వనపర్తి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానం లో నిలుపుదామని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిరోజు రోడ్డు భద్రతపై కొంత అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ డ్రైవింగ్ కారణంగా జీవితాలను నాశనం చేసుకోకుండా, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు. కాలికో, చేతికో ప్రమాదం జరిగితే కృత్రిమ అవయవాలను అమర్చడానికి వీలుంటుంది కానీ తలకు గాయాలయితే ప్రాణాలకే ప్రమాదం కాబట్టి హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. రోడ్ సేఫ్టీ పై పత్రిక విలేకరులు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కథనాలు రాయాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బైక్ పై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి తప్పక రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు మనం పాటించడమే కాకుండా ఎదుటివారిలో కూడా అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రత వారోత్సవాలను మార్చి మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా ఎస్పీ డి సునీత మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల ద్వారా నిత్యం ఎంతో మంది మరణిస్తున్నారని, కాబట్టి ప్రజలు ప్రతి ఒక్కరూ రోడ్ సేఫ్టీ పాటిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకి ఆధునిక ద్విచక్ర వాహనాలు కొనివ్వడమే కాకుండా వారు అత్యధిక వేగంతో వెళ్లకుండా కంట్రోల్ కూడా చేయాలన్నారు. యువత అధిక వేగం వల్ల అనర్థాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. యువత కొంతమంది స్టైల్ కోసం హెల్మెట్ ధరించకుండా నిర్లక్ష్యం చేస్తారని, ఆ పద్ధతి ప్రాణాలకే ముప్పు తెస్తుందని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరు బైక్పై వెళ్లేటప్పుడు రోడ్ సేఫ్టీ రూల్స్ పాటిస్తూ హెల్మెట్ ధరించి వెళ్లాలని తెలియజేశారు. బైక్ ర్యాలీ సందర్భంగా నల్లచెరువు కట్టపై రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బాలాజీ నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి మానస, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, ఇతర అధికారులు, విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు. స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి కి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి,ఎస్పి సునీత రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పోగొట్టుకున్న బంగారు చైను అప్పగించిన పోలీసులు




**చిన్నశంకరంపేట, జనవరి 8 (జనం సాక్షి) :** పడాల సరిత భర్త సుధాకర్, అల్వాల్ కు చెందిన ఆమె పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలిపిన విషయం ఏమనగా, నిన్న తేది 07.01.2026 నాడు మెదక్ వారి బంధువు చనిపోగా అంత్యక్రియలకు కుటుంబం తో పాటు వెళ్లి ఆనంతరం తిరిగి మేడ్చల్ వెళ్ళుతు మార్గమాధ్యలో టీ త్రాగడానికి రాత్రి 7 గంటల సమయములో గవ్వలపల్లి చౌరస్తా లో కారు దిగి టీ త్రాగిదా మని, దిగి నా హ్యాండ్ పర్సు ఎక్కడో పడిపోయిందని, దానిలో ఒక తులము వజను గల బంగారు చైన్ పోయిందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాధు చేయగా, వెంటనే ఎస్సై నారాయణ, గౌడ్ స్పందించి, కానిస్టేబుల్ ప్రవీణ్ ను అట్టి బంగారు గొలుసు ను కనుగొనుటకు గవ్వలపల్లి వెళ్లి అక్కడ జజ కెమెరా లను చెక్ చేయమని, చెప్పి పంపగా కానిస్టేబుల్ ప్రవీణ్ జజ కెమెరా లను షోధించి అట్టి మహిళా పోగొట్టుకున్న బంగారు చైన్ ఆచూకి తెలుసుకొని, అట్టి మహిళకు అప్పిగించనైనది. బంగారు చైన్ వెతికి తెచ్చిన కానిస్టేబుల్ ప్రవీణ్ ను ఎస్సై నారాయణ ప్రత్యేకంగా అభినందించినారు.

## ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని కొత్లాపూర్ గ్రామ పంచాయతీ భవనం

- అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయం
- నూతన సర్పంచ్ ఆధ్వర్యంలో పూర్తి అయ్యేనా..?



**మర్పల్లి, జనవరి 8 (జనంసాక్షి) :** గ్రామస్తుల సౌకర్యార్థం ప్రభుత్వం మంజూరు చేసిన నూతన గ్రామ పంచాయతీ భవనం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పంచాయితీ భవనం పూర్తి కాకపోవడంతో అరకొర వసతుల మధ్య పాలన కొనసాగుతోంది. మండలంలో నీ కొత్లాపూర్ కొత్త పంచాయతీ భవన నిర్మాణానికి గత కొన్ని ఏళ్ల క్రితం పునాది పడింది. అప్పట్లో పనులు ప్రారంభమై, స్లాబ్ వేసిన తర్వాత పనులు ప్రారంభం కాలేవు అవి మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం వర్షపు నీరు చేరి నాణ్యత దెబ్బతింటోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇటీవల జరిగిన ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థి చెట్టుకింద ప్రమాణస్వీకారం చేశారు. గత కొన్ని నెలల నుంచి పంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుంది. పంచాయితీ భవన నిర్మాణ పనుల గురించి గ్రామ పంచాయితీ కార్యదర్శి సరైన సమాధానం తెలపడం లేదు. లక్షల రూపాయల ప్రజా ధనం వెచ్చించి సగం వరకు నిర్మించిన ఈ భవనాన్ని ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేసి, వీలైనంత త్వరగా భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు వేడు వేడుకుంటున్నారు.

## శాస్త్రవేత్తలను తయారు చేయడమే అక్షర హైస్కూల్ లక్ష్యం

- రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక కావడం గర్వకారణం
- అక్షర హైస్కూల్ ప్రిన్సిపాల్ మోహనకృష్ణ గౌడ్



**తాండూరు, జనవరి 8 (జనంసాక్షి) :** నేటి సమాజానికి అవసరమైన శాస్త్రవేత్తలను తయారు చేయడమే అక్షర హై స్కూల్ ప్రధాన లక్ష్యమని అక్షర హై స్కూల్ ప్రిన్సిపాల్ మోహనకృష్ణ గౌడ్ పేర్కొన్నారు.విద్య అంటే కేవలం పుస్తకాల పరిమితుల్లో బంధించబడిన జ్ఞానం కాదు.విద్య అంటే సమస్యను గుర్తించి, దానికి పరిష్కారాన్ని చూపే శక్తి. ఆ శక్తికి సజీవ నిదర్శనంగా తాండూరులోని అక్షర హై స్కూల్ నిలిచింది. వికారాబాద్ జిల్లా పరిగిలో జనవరి 5, 6 తేదీలలో తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మరియు ఇన్‌స్పైర్ మానక్ పోటీలలో అక్షర హై స్కూల్ విద్యార్థులు అసాధారణ ప్రతిభను ప్రదర్శించి జిల్లా స్థాయిలో సంచలన విజయం సాధించారు.జిల్లా వ్యాప్తంగా 262 ప్రాజెక్టులు ప్రదర్శించబడిన ఈ వైజ్ఞానిక మహోత్సవంలో అక్షర హై స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి పి. మనోల్లాస్ రెడ్డి ప్రథమ బహుమతి సాధించారు.వ్యర్థ పదార్థాలను మండించి విద్యుత్ ఉత్పత్తి చేయడం, అదేవిధంగా విడుదలయ్యే కార్బన్‌ను శుద్ధి చేసే వినూత్న ఆలోచనతో రూపొందించిన ఆయన ప్రాజెక్ట్, పర్యావరణ పరిరక్షణకు శాస్త్రీయ పరిష్కారంగా న్యాయనిర్ణేతల ప్రశంసలు పొందింది. 'ఇన్‌స్పైర్ మానక్ విభాగంలో',మొత్తం 53 ప్రాజెక్టుల మధ్య పోటీలో 10వ తరగతి విద్యార్థిని శ్రీనిధి ప్రథమ బహుమతి పోందారు.వాతావరణం నుండి నీటిని గ్రహించి, దానిని శుద్ధి చేసి వినియోగానికి అనుకూలంగా మార్చడం అనే ఆమె ప్రాజెక్ట్, రాబోయే తరాలకు నీటి సమస్యకు మార్గదర్శకంగా నిలిచింది. ఈ అపూర్వ విజయాల వెనుక విద్యార్థుల ప్రతిభకు దిశానిర్దేశం చేసిన మార్గదర్శకులు టీచర్ సి. రవికుమార్ కృషి ప్రశంసనీయం. విద్యార్థుల్లో ప్రశ్నించే మనసును, సృజనాత్మక ఆలోచనను పెంపొందించడంలో ఆయన పాత్ర కీలకం. జిల్లా స్థాయిలో పాఠశాలకు గౌరవాన్ని తీసుకొచ్చిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన మార్గదర్శకుడు టీచర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ మోహనకృష్ణ గౌడ్,మేనేజ్‌మెంట్ సభ్యులు సీ. ప్రవీణ్, శ్రీకాంత్ కులకర్ణి,ఎండీ యూనిస్, రవీందర్ రెడ్డి, శోభరాణి తదితరులు ఘనంగా సన్మానించి, హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షర హై స్కూల్ లక్ష్యం మార్కులకే పరిమితం కాదు.సమాజానికి అవసరమైన శాస్త్రవేత్తలను, ఆలోచనాత్మక పౌరులను తయారు చేయడమే మా ఆశయమన్నారు. ఈ విజయం విద్యార్థులది మాత్రమే కాదొ ఇది అక్షర విద్యా విధానానికి వచ్చిన గుర్తింపు అని అన్నారు. ఈ ప్రథమ బహుమతి విజేతలు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక కావడం మరింత గర్వకారణమన్నారు.జిల్లా నుంచి రాష్ట్రానికి రాష్ట్రం నుంచి దేశానికి అక్షర విద్యార్థుల విజ్ఞాన ప్రయాణం మరింత ఎత్తులకు చేరాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించారు.

## వృత్తి విద్యతో ఉపాధి..

**మొయినాబాద్, జనవరి 8 (జనం సాక్షి) :** వృత్తివిద్య తో నిరుద్యోగ యువతకు ఇతామ్స్ అకాడమీ అందిస్తున్న ఫ్యాషన్ డిజైన్ మేకప్ ఆర్టిస్ట్ కోర్సులు స్వయం ఉపాధికి ఎంతో ఆదర్శమని జేఎన్ఎ ఎఫ్ ఎ యు.. సి ఎఫ్ ఏ ప్రొఫెసర్ ఆనంద్ రావు పేర్కొన్నారు. నగరంలోని అమీర్పేట్ లో గల హితంస్ అకాడమీ హిందుస్థాన్ ఇనిస్ట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ మరియు మేనేజ్మెంట్ స్కిల్స్ లో భాగంగా ఫ్యాషన్ డిజైన్ మేకప్ఆర్టిస్ట్ నైపుణ్య అభివృద్ధికి నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి లో భాగంగా 2026 గ్రాడ్యుయేషన్ డే ను మున్సిపల్ పరిధిలోని సురంగల్ సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు అకాడమిక్ డైరెక్టర్ విద్యావేత్త ఎం రఫీ అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ఆనంద్ రావు ప్రొఫెసర్ కమల్ రాయి లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వారు ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వృత్తి విద్యా పూర్తి చేసుకున్న విద్యార్థులకు గోల్డ్ మెడల్ పట్టాలను అందజేశారు. హిందుస్థాన్ ఇనిస్ట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ మేనేజ్మెంట్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 40 శాతం స్కాలర్షిప్లను అందిస్తున్నామని అన్నారు యువత ఫ్యాషన్ డిజైన్ మేకప్ కలను అనుసరించేలా ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు హిందుస్థాన్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ మేనేజ్మెంట్ స్కిల్స్ ప్రపంచ స్కిల్ డెవలప్మెంట్ కోర్సులతో యువతను నైపుణ్యంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



## సాంకేతికతతో మొబైల్ ఫోన్‌ల రికవరీ

- ఆరు నెలల్లో 1,039 ఫోన్లు స్వాధీనం
- బాధితుల ముఖాల్లో చిరునవ్వు



**మల్కాజిగిరి, జనవరి 8 (జనంసాక్షి) :** మారుతున్న కాలంతో పాటు దొంగలు కూడా అప్ డేట్ అవుతున్నారు. కానీ వారి కంటే వేగంగా మల్కాజిగిరి పోలీసులు సాంకేతికతను వాడుతూ మొబైల్ దొంగల పని పడుతున్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ (సిఈఐఆర్)పోర్టల్ అస్త్రంగా పోగొట్టుకున్న వేలాది మంది బాధితులకు వారి ఫోన్లను అందజేశామని మల్కాజిగిరి కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు క్రైమ్ డిసిపి గుణశేఖర్ నేరెడ్‌మెట్‌లోని మల్కాజిగిరి కమిషనర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించి బాధితులకు ఫోన్లను అందజేశారు.ఆరు నెలల స్వల్ప కాలంలోనే ఎల్బీ నగర్, మల్కాజిగిరి సీసీఎస్ బృందాలు గాలించి ఏకంగా 1,039 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు, వీటి విలువ సుమారు 2 కోట్ల 8 లక్షలు ఉంటుందని తెలిపారు. ఏళ్ల తరబడి దాచుకున్న జ్ఞాపకాలు, ముఖ్యమైన డేటా ఉన్న ఫోన్లు తిరిగి రావడంతో బాధితుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎల్బీ నగర్ 739, మల్కాజిగిరి 300 రికవరీ చేశామని తెలిపారు.మొబైల్ ఫోన్ పోతే అది కేవలం ఆస్తి నష్టం మాత్రమే కాదు, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది. చోరీ ఫోన్లను సైబర్ నేరగాళ్లు వాడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ రికవరీ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన అదనపు డీసీపీ రామేశ్వర్, ఏసీపీ కరుణ సాగర్, ఐటీ సెల్ బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మొబైల్ పోయిన వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు, సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు ఒరిజినల్ బిల్లు ఉంటేనే కొనాలి, బిల్లు లేకుండా కొంటె నేరంలో ఫోన్లు కొన్నవారు భాగస్వాములు కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

## యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు

- యాసంగి సీజన్ పంటల సాగుకు సరిపడ యూరియా అందుబాటులో ఉంది
- మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని

**తలకొండపల్లి, జనవరి 8 (జనంసాక్షి) :** మండలంలో రైతులకు సరిపడ యూరియా నిల్వలు ఉన్నాయని,మందుల కొరత లేదని మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని స్పష్టం చేశారు. గురువారం ఎరువుల ఉత్పత్తులను ఏఈఓ లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.దుకాణాల్లోని యూరియా నిల్వలను,విక్రయాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని మాట్లాడుతూ..రైతుల ఆందోళన చెందకుండా తమ పట్టాదారు పాసుబుక్,ఆధార్ కార్డులను చూపి సాగు భూమికి కావలసిన యూరియాను రైతులు పొందవచ్చని సూచించారు.ఈ రబీ సీజన్లో ఇదివరకే 10850 యూరియా బ్యాగులను రాంపూర్,చంద్రధన గ్రామాల రైతులకు అందించడం జరిగిందని,అలాగే ఆగ్రో రైతు సేవ కేంద్రాలు గట్టు ఇప్పలపల్లి,తలకొండపల్లి,పిఏసిఎస్ తలకొండపల్లి,ప్రైవేట్ డీలర్స్ దుకాణాలలో రోజుకు 1000 బ్యాగుల చొప్పున యూరియా నిలువలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.డీలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు.రైతులు పంట అవసరాన్ని బట్టి మాత్రమే యూరియాను వినియోగించాలని, అధిక మోతాదులో వాడటం వల్ల నేల సారవంతం తగ్గి పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతోందని రైతులకు తెలిపారు.రైతులు డీలర్ల వద్ద యూరియా బస్తాలను ఏ ప్రాంతంలో తీసుకున్న ఆధార్ నెంబరు ఎంట్రీ చేయగానే ఈ సీజన్లో ఎన్ని బస్తాలు తీసుకున్న వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేలా వ్యవసాయ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు.యూరియా



బుకింగ్ యాప్ పై రైతులకు ఏఈవోలు గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది,మరియు స్థానిక రైతులు ఉన్నారు.

## పార్టీ ఫండ్ పేరుతో సీపీఎం నాయకులు బెదిరింపులు

- చేర్యాల ప్రాంతంలో పేద ప్రజలకు వైద్యం చేయనివ్వరా..!
- అక్షర హాస్పిటల్ ఎండి డాక్టర్ సంతోష్ కుమార్



**చేర్యాల, జనవరి 8 (జనంసాక్షి) :** చేర్యాల ప్రాంతంలో గత ఆరు సంవత్సరాలుగా అక్షర హాస్పిటల్ నెలకొల్పి పేద ప్రజలకు సేవ చేస్తూ నిరంతరం వైద్య వృత్తికి అంకితమైన తనపై స్థానిక సిపిఎం నాయకులు ఆముదాల మల్లారెడ్డి పార్టీ ఫండ్ పేరుతో డబ్బులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం పై గత కొన్ని రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వగా సిపిఎం నాయకులు తనపై బెదిరింపు కేసులు పెట్టారని ఈ విషయంపై స్థానిక సిపి దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేపట్టి అందులో తనపై ఎలాంటి నేరం రుజువు కాకపోవడంతో సిపిఎం నాయకులు ఎలాగైనా తనపై కక్ష సాధింపు చర్యలు సాధించాలనే క్రమంలో కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో వైద్యశాఖ నుండి ఏలాంటి అనుమతులు లేకుండా వర్ణిక క్లినిక్ పేరిట క్లినిక్ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ డాక్టర్ పాడిబెట్టి నర్సింహులుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బాధితులు కోరడంతో కారణాలు తెలుసుకోవడం కోసం గ్రామస్తులను కలువగా వారు తెలిపిన వివరాల ప్రకారం ఆర్ఎంపీ డాక్టర్గా క్లినిక్ నడుపుతూ పట్టపగలే మద్యం సేవించి రోగులను చూస్తున్నాడని, సులభంగా నయమయ్యే వ్యాధులను కూడా తీవ్రత ఎక్కువగా ఉందని రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాడని బాధితులు,గ్రామస్తులు తెలిపారు. ఇదే విషయంపై సంబంధిత జిల్లా మెడికల్ అసోసియేషన్‌కి తెలుపగా వారు పలు విషయాలపై ఎంక్వేరీ చేసి సంబంధిత ఆర్ఎంపీ డాక్టర్ పై చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్నా ఆర్ఎంపి డాక్టర్ స్థానిక సిపిఎం నాయకులను కలవడంతో వారు గురువారం రోజు స్థానిక సోషల్ మీడియాలో అక్షర హాస్పిటల్ డాక్టర్ ఆర్ఎంపీ డాక్టర్లను తన హాస్పిటల్ కు గ్రామాలలో ప్రజలను తన ఆసుపత్రికి పంపడం లేదని, దానిపై కోపంతోనే సంబంధి డాక్టర్లపై జిల్లా మెడికల్ అధికారులతో కేసులు పెట్టిస్తున్నాడనే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇప్పటికైనా నేను ఏ ఒక్క ఆర్ఎంపీ డాక్టర్ ని మా ఆసుపత్రికి పేషెంట్లను పంపమని గాని, పేషెంట్లను పంపిస్తే పర్సంటేజ్ ఇస్తా అని ఎక్కడైనా ఎవరు ముందైనా అన్నట్టు నిరూపిస్తే అక్షర హాస్పిటల్ భవనాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించి ఈ నాలుగు మండలాల ప్రజలకు చేతులు జోడించి నమస్కరించి ఈ ప్రాంతం నుండి వెళ్ళిపోతానని సవాల్ చేశారు. ఈ నాలుగు మండలాల ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ నిమిత్త ఫీజులతో వైద్యం చేస్తూ వారి మనసులలో స్థానాన్ని ఏర్పరచుకున్నానని అలాంటి తనపై ఈ విధంగా ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమో వారికే తెలియాలి. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు సంబంధించిన ఆర్ఎంపీ డాక్టర్లు పాల్గొని అక్షర హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్ సంతోష్ కుమార్ తమకు ఇలాంటి ఇబ్బందులను గాను, పేషెంట్లను వారి ఆసుపత్రికి పంపమని ఇప్పటివరకు చెప్పలేదని తెలిపారు.

## కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్



**హయత్‌నగర్, జనవరి 8 (జనం సాక్షి) :** ఆటోనగర్ లోని ఐలా కార్మికులకు ఐడి కార్డులను హయత్ నగర్ సర్కిల్ సీఐటీయు కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య అధ్యక్షత న సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ ఐలా కార్మికులకు కావలసిన షూ, గ్లౌజెస్, డ్రెస్సులు ప్రతి సంవత్సరం ఇవ్వాలని, ఈఎస్ఐ ప్రతినెల జమ చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ముషం నరహరి, ఐలా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# నల్లకుంట చెరువులో కాలుష్య కోరలు

- 5 టన్నుల వరకు చేపలు మృతి
- జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గోనెల శ్రీనివాస్
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చొరవపై హర్షం వ్యక్తం చేసిన మత్స్యకారులు



**జడ్చర్ల, జనవరి 8 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నల్లకుంట చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుందని, మురుగు నీరు చెరువులోకి చేరడంతో ఊపిరాడక వేలాది చేపలు మృత్యువాత పడ్డాయని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం గోనెల శ్రీనివాస్ సంఘం డైరెక్టర్లు, స్థానిక మత్స్యకారులతో కలిసి నల్లకుంట చెరువును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో సుమారు 5 కిలోల బరువున్న పెద్ద చేపలతో పాటు, చిన్న చేప పిల్లలు కుప్పలు కుప్పలుగా చనిపోయి నీటిపై తేలుతున్నాయి. దాదాపు 5 టన్నుల మేర చేపలు మృతి చెంది ఉంటాయని, దీనివల్ల మత్స్యకారులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ కాలువలను నేరుగా నల్లకుంట చెరువుకు అనుసంధానం చేయడం వల్లనే నీరు కలుషితమైందని విమర్శించారు. బుధవారం ముదిరాజ్ సంఘం సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటి వరకు అధికారులు కనీసం స్పందించకపోవడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ఉదాసీనత వల్లే ఇంత పెద్ద ఎత్తున జీవహాని జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి కాలుష్యానికి కారణమైన వారిపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. ఈ చెరువుపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకార (ముదిరాజ్) కుటుంబాలకు మున్సిపల్ యంత్రాంగం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్లు రాజాపూర్ మండల ఇంచార్జ్ శివ ప్రసాద్, మిడ్జిల్ చెన్నయ్య, జడ్చర్ల మత్స్యకార సంఘం సభ్యులు పిట్టల మురళీ, మాజీ సర్పంచ్ రేణుక, లక్ష్మమ్మ, రఘు, రవి, నర్సింహులు, పాండయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే చొరవపై హర్షం

జడ్చర్లలో చేపల మార్కెట్ ఏర్పాటుకు స్థల కేటాయింపుకు అడుగులు పడటం పట్ల మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు. మార్కెట్ కోసం స్థలాన్ని కేటాయించాలని తహశీల్దార్ నర్సింగ్ రావును ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశించడంతో మత్స్యకార సంఘం నేతలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలను గుర్తించి తక్షణమే స్పందించినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.

## ఈ నెల 20లోగా పనులు పూర్తి చేయాలి



**జడ్చర్ల, జనవరి 8 (జనం సాక్షి) :** ఫిబ్రవరి 3న జరగనున్న బాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న టాయిలెట్ల నిర్మాణ పనులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌజింగ్ ఏఈ కుమార్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 20వ తేదీలోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో అత్యవసరంగా కావలసిన వసతుల గూర్చి ఆమె అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి ఎద్దడిని తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అందుకు అవసరమైన ఉత్తర్వులు విడుదల చేస్తానని డిఇఓ ప్రవీణ్ కుమార్ కు సూచించారు. సిఎస్ఆర్ నిధులతో నూతన టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మించాలని, దానికి వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. ఇకపై పాఠశాలలో చేపట్టే ఏ నిర్మాణమైనా సరైన డిజైన్, మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మధుసూదన్ నాయక్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. కృష్ణ, ఎంఈఓ మంజులాదేవి, హెచ్ఎం చంద్రకళ, ఉత్సవ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే మొట్టమొదటి సౌండ్ లైబ్రరీ ప్రారంభం



**సంగారెడ్డి టౌన్, జనవరి 8 (జనం సాక్షి) :** రాష్ట్రంలోనే మొట్టమొదటి సౌండ్ లైబ్రరీని సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. లూయిస్ బ్రెయిలి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ రోజుల్లో సాంకేతిక విద్య అందుబాటులో లేకపోయినప్పటికీ లూయిస్ బ్రెయిలీ ధైర్యంగా ముందుకు సాగి బ్రెయిల్ లిపిని రూపొందించి, దృష్టిహీనులతో బాధపడుతున్న వారికి చదువు వెలుగులు పంచారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పరంగా అంధులకు రావాల్సిన అన్ని సంక్షమ పథకాల ఫలాలు వారికి చేరేలా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. లూయిస్ బ్రెయిలి జన్మదినం సందర్భంగా రూ. 35 లక్షలతో సౌండ్ లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. అత్యాధునిక పరికరాలతో చదవలేని వారు కూడా ఆడియో రూపంలో పుస్తకాలు, సమాచారం వినేందుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక సదుపాయాలతో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 3700 మంది అంధులు సౌండ్ లైబ్రరీ ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా మహిళా శిశు, వికలాంగుల సంక్షమ శాఖ అధికారి లలిత కుమారి, జిల్లా గ్రంథలయ కార్యదర్శి వసుంధర, పంచాయతీ రాజ్ శాఖ డీఈ దీపక్, వివిధ దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, డీడబ్ల్యూఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి

- టిఆర్పి పార్టీ డిమాండ్‌తో వినతి పత్రం అందజేత
- వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు జి.రవికుమార్

**శ్రీరంగాపూర్, జనవరి 8 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు రవికుమార్ కోరారు.ఈ మేరకు శ్రీరంగపురం మండల కేంద్రంలో టిఆర్పి పార్టీ వ్యవస్థాపకులు అధ్యక్షులు,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు,రాష్ట్ర యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆదేశాలు మేరకు శ్రీరంగాపూర్ మండలం డిప్యూటీ తాసిల్దార్ అనురాధకు గురువారం నాడు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూౌ తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సామాజికం, ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు,చట్టపరమైన రక్షణ అత్యంత అవసరమని అన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి ఇప్పటి వరకు బీసీల కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా మిగులు చూపడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీలకు ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని,ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 50 శాతం పైగా నిధులు కేటాయించాలన్నారు. అలాగే బీసీల కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు బీసీ సబ్ ప్లాన్ చట్టబద్ధత కల్పించాలని కోరారు. విద్యా రంగంలో ప్రతి మండలంలో బహుజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని, విదేశీ విద్యానిధి పథకాన్ని మరింత సరళతరం చేయాలని సూచించారు.నిరుద్యోగ బీసీ యువతకు,సంప్రదాయ కుల వృత్తులపై ఆధారపడిన వారికి ఎలాంటి షరతులు లేకుండా సబ్సిడీతో కూడిన రుణాలు



మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల గణనలో బీసీలకు సంబంధించిన నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని కోరారు.కేవలం నినాదాలతో కాకుండా,నిధులతో కూడిన చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ ద్వారానే బీసీలకు నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

## బీరంగూడ స్మశానవాటిక అభివృద్ధికి పూర్తి సహకారం



**సంగారెడ్డి, జనవరి 8 (జనం సాక్షి) :** అమీన్పూర్ మున్సిపాలిటీలోని బీరంగూడ స్మశాన వాటికను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ పేర్కొన్నారు. బీరంగూడ స్మశాన వాటికలో పలు సమస్యలు తాండవిస్తున్నాయని కమిషనర్ దృష్టికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదెల్లి రవీందర్ తో పాటు స్థానికులు ఈ మధ్య డిప్యూటీ కమిషనర్ ను కలిసి పత్రం అందజేశారు. స్పందించిన డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ గురువారం ఉదయం స్మశాన వాటికను సందర్శించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ డిప్యూటీ కమీషనర్ మాట్లాడుతూ బీరంగూడ స్మశాన వాటిక అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ మాట్లాడుతూ.. స్మశాన వాటిక బురదమయంగా మారిందని వెంటనే రోడ్లు వేయాలని, అలాగే నీటి సౌకర్యం కోసం బోర్ వేయాలని, స్నానాల గదులు నిర్మించాలని, చెత్త చెదారం తొలగించి పూల చెట్లను పెంచి సుందరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. స్మశాన వాటిక పరిశీలించిన వారిలో డిప్యూటీ కమీషనర్ తో పాటు డి ఈ వెంకటరమణ ఉన్నారు.

# నిర్లక్ష్యంతో ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు

- రోడ్డు భద్రత నిబంధనలు తప్పకుండా పాటించాలి
- టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి
- రోడ్డు భద్రత అవగాహన బైక్ ర్యాలీ

**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి) :** వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐబి నుండి జిల్లా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో వివిధ బైక్ షోరూం లకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాలు చాలా విలువైనవని, నిర్లక్ష్యంతో ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని తెలిపారు. డీఎస్పీ సత్తయ్య




గౌడ్ మాట్లాడుతూ.. రోడ్డు సేఫ్టీ నిబంధనలను క్రమశిక్షణతో పాటిస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి కావాలని తెలిపారు. జిల్లా రవాణా అధికారి అరుణ మాట్లాడుతూ... రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు రోడ్డు భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షతంగా ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి అరుణ, డీఎస్పీ సత్తయ్య గౌడ్, రవాణా శాఖ సభ్యులు తాహెర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, వివిధ బైక్ షోరూం ల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అమలులో స్పష్టమైన పురోగతి సాధించాలి



**జడ్చర్ల, జనవరి 8 (జనంసాక్షి) :** ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియలో ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో స్పష్టమైన పురోగతి కనిపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. గురువారం జడ్చర్ల పట్టణంలోని బి.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాలలో బి.ఎల్.ఓ సూపర్వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో ఎస్.ఐ.ఆర్ అమలు తీరును కలెక్టర్ క్షణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్చర్ల అర్బన్ సెగ్మెంట్ పనితీరులో వెనుకంజలో ఉండటంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మందగించిన సూపర్వైజర్లను కారణాలు అడిగి తెలుసుకుంటూ, తక్షణమే ఈ పరిస్థితిలో మార్పు రావాలని హెచ్చరించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా బి.ఎల్.ఓ లతో మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన జరపాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ అనేది అత్యంత కీలకమైన ప్రక్రియ. ఇందులో ఎలాంటి అలసత్వానికి తావుండకూడదు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో వంద శాతం ప్రగతి సాధించాలన్నారు. సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, తహశీల్దార్ నరసింహా రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ ఉద్యోగి ఆత్మహత్య

**జోగిపేట, జనవరి 8 (జనం సాక్షి) :** అందోల్ మండలం సంగుపేట గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు కుటుంబ సమస్యలతో కమ్మరి రవీందర్(39) అందోల్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు గజ ఈతగాళ్లు సహాయంతో మృతదేహాన్ని వెలికి



తీశారు. రవీందర్ గత కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ సంస్థలో ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రవీందర్ మరణంతో భార్య,కుమారుడు అనాథలయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మున్సిపల్ ఎన్నికలలో ఎన్నికల సంఘం నియమాలను పాటించాలి



**మెదక్, జనవరి 8 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళ్ని పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. గురువారం రామాయంపేటలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డిఓ రమాదేవితో కలిసి పరిశీలించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌లను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచనున్న బ్యాలెట్ పేపర్ల యొక్క భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, మూడు అంచెల భద్రత, అగ్నిమాపక పరికరాలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కౌంటింగ్ హాల్‌లో టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది కూర్చునే విధానం, ప్రవేశఉనిష్క్రమణ మార్గాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఓట్ల లెక్కింపు పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్ బల్దియాపై బీజేపీ జెండా ఎగరవేస్తాం

- మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు

**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 8 (జనం సాక్షి) :** ఒక్క ఛాన్స్ ఇచ్చి చూడండి... మెదక్ బల్దియా పై భాజపా జెండా ఎగరువెస్తామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ బీజేపీ కార్యాలయం లో బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అధ్యక్షతన మెదక్ మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులతో గురువారం సమావేశమైన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ గతంలో ఎంపీలు నామ మాత్రంగా వున్నారని మున్సిపాలిటీలకు నిధులు ఇవ్వలేదని దుయ్యబట్టారు.10 సంవత్సరాలు డిప్యూటీ స్పీకర్ వున్నా పద్మా దేవేందర్ రెడ్డి మెదక్ మున్సిపల్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కట్టలేదని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే బంగారు తెలంగాణ అన్న నాయకులు ఏమయ్యారని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వంలో ఎలా వుందో ఇప్పుడు మున్సిపాలిటీలు గ్రామ పంచాయతీలు అలాగే ఉన్నాయని మార్పు కన్పించడం లేదని చురుకులు వేశారు. పాత మున్సిపాలిటీలకు సిద్దిపేటలో వసతులు వున్నాయా?. గజ్వేల్ మున్సిపల్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ చేశారు. మెదక్ లో ఈ రోజు వరకూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ గా ఆరు సంవత్సరాలు వున్న శేరి సుభాష్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి పది సంవత్సరాలు గా ఏమి ఓరుగబెట్టారని ఎద్దేవా చేశారు. మూడు మున్సిపల్ పాలిటి లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేద్దామంటే డిల్లీ ఫైల్ ను పంపించాలేదు నా పార్లమెంటు లో 7 శాసన సభ్యులు ఉంటారు.గజ్వేల్ కు సిద్దిపేటకు రింగ్ రోడ్డు అవుతుంది. మెదక్ కు రింగ్ రోడ్డు నోచుకోలేదని మండిపడ్డారు. దీనికి సమాధానం అప్పటి మంత్రి చెప్పాలని అన్నారు. మెదక్ కు రింగ్ రోడ్డు కు డిపిఆర్ సిద్ధం అవుతుంది. ఔటర్ రింగ్ రోడ్డు నుండి పిల్లి కోటాల్ వరకు కొత్త రోడ్డు త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. మెదక్ లో సర్కార్ దవాఖానా పక్కకు మురికి కాలువలు కట్టలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31 దాటితే కేంద్ర ప్రభుత్వం నిధులు డిల్లీ కి వాపస్ పోతాయని తెలిపారు. అందుకే ఆగమేఘాల మీద మున్సిపల్ ఎన్నికల కు పోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల అభివృద్ధి మా లక్ష్యం మెదక్ చైర్మన్ కు అవకాశం ఇవ్వాలని కోరారు. మెదక్ రూపు రేఖలను మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఇంచార్జ్ గడ్డం



శ్రీనివాస్ మెదక్ జిల్లా ఇన్చార్జి బొక్క నరసింహ రెడ్డి ,మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, చోళరాం చరణ్ యాదవ్ ,జిల్లాకార్యదర్శి నాగరాజు,సంగీత, నందరెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్,బీజేవైఎం సతీష్ ,మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎంఎల్ఎన్ రెడ్డి, నల్లల విజయ్, మెదక్ జిల్లా సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్,, ముక్క సుధాకర్, బెండ వీణ ,లోకేష్ వేణు, శివ, అల్లం మధు ,అంకం శ్రీనివాస్ మనోజ్, సుంకోజి రాజు, ఆంజనేయులు,ఆఫీస్ సెక్రటరీ సాయి కిరణ్, తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో జువెనైల్ జస్టిస్ బోర్డు ప్రారంభం

- బాలలు మంచి పౌరులుగా మారాలి
- ప్రధాన న్యాయమూర్తి సూర్య చంద్రకళ...



**ములుగు,జనవరి 08(జనం సాక్షి) :** ములుగు జిల్లా పరిధి లోని బాలనేరస్థుల కేసులను విచా రించేందుకు జువెనైల్ జస్టిస్ బోర్డు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్విపి సూర్య చంద్రఖళ తెలిపారు.గురువారం బాలరక్ష భవన్ లో ఆమె జువెనైల్ జస్టిస్ బోర్డును ప్రారంభించారు.18 ఏళ్లు వయసులోపు బాలలు నేరం చేస్తే వాటిని జువెనైల్ జస్టిస్ బోర్డులో విచారణ జరిపిస్తామన్నారు. ప్రతి బుధవారం ప్రిన్సిపాల్ మెజిస్ట్రేట్ గుంటి జ్యోత్స్న ఆధ్వర్యంలో కేసుల విచారణ జరిపించి వారిలో మార్పుకు కృషి చేస్తారని తెలిపారు.బాలలు ఎవరైనా న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టీ.కన్యాలల్,అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ మధులిక తేజ, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులు మేరుగు సుభాష్,జిల్లా సంక్షమశాఖ అధికారి తుల రవి,ఉమ్మడి జిల్లా ప్రోబేషన్ అధికారి ఏ.రమణ మూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ వేణుగోపాల చారీ,ప్రధాన కార్యదర్శి రుద్రోజు బిక్షపతీ, పిపి లు, శంకర్, రాంసింగ్, న్యాయవాదులు,పిల్లల పరిరక్షణ అధికారి ఓంకార్,చైల్డ్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించాలని కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికుల సమ్మె

- 18 రోజులుగా నిలిచి పోయిన పారిశుధ్యం, మంచినీరు సరఫరా
- 2 దఫాలుగా జరిపిన చర్చలు విఫలం



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 8 (జనం సాక్షి) :** కార్మికులు తమకు వేతనాలు చెల్లించాలని, అలాగే పెండింగ్లో ఉన్న ఈఎస్ఐ పిఎఫ్ నిధులు తమ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మె చేస్తున్నారు. గత 6 రోజులుగా మున్సిపాలిటీలో అధికారిక కార్యక్రమాలు నిలిచిపోయాయి. అధికారులను కార్మికులు అడ్డుకొని కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. రెండు దఫాలుగా కార్మికులతో అధికారులు జరిపిన చర్చలు ఫలించలేదు. తమకు రావాల్సిన 5 నెలల వేతనాన్ని చెల్లించాలని, అలాగేఈ ఎస్ఐ, పిఎఫ్ రు.2 కోట్లు చెల్లించాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 4న కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్మికులతో చర్చ లు జరిగాయి.ఈ చర్చల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, మున్సిపల్ కమిషనర్ రాజేందర్లు పాల్గొన్నారు. కేవలం 2 నెలల వేతనం మాత్రమే చెల్లిస్తామని, ఆ చెల్లింపుకు గొడుగు సైతం చెప్పకపోవడంతో కార్మికులు సమ్మెను సాగిస్తున్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన చర్చలు సైతం విఫలమయ్యాయి. దీంతో ఎంతకాలమైనా తమ డిమాండ్లు సాధించుకునేంత వరకు సమ్మె కొనసాగిస్తున్నట్లు మున్సిపల్ పరిశుద్ధ కార్మిక సంఘం నాయకులు శంకర్, సంజీవ్, శంకరమ్మ లు తెలిపారు. కార్మికుల ఆందోళనకు సిఐటియు నాయకులు రాజేందర్, కృష్ణమాచారి, ముంజం ఆనంద్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి కుశన మద్దతు తెలిపి , కార్మికులకు అండగా ఉంటున్నారు. కాగజ్ నగర్ పోలీసులు డి.ఎస్.పి వహీయుద్దీన్, పట్టణ సీఐ ప్రేమ్ కుమార్లు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సమ్మె విరమించాలని పోలీసు అధికారులు కోరినప్పటికీ కార్మికులు తమ డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించేంతవరకు సమ్మె విరమించేదీ లేదని కార్మికులు ఖరాకండిగా తెగేసి చెప్తున్నారు. దీంతో కాగజ్ నగర్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం నిలిచిపోయి, కాలనీలు చెత్తాచెదారంతో దుర్గంధాన్ని విడుదలతున్నాయి. అలాగే గత 13 రోజులుగా పట్టణంలో మంచిని సరఫరా నిలిచిపోయి ప్రజలు మంచినీళ్లకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమ్మెను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# లారీ ఢీకొని వ్యాపారి మృతి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** భూపాలపల్లి పట్టణంలో గురువారం ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో దొడ్డ సత్యనారాయణ అనే వ్యాపారి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన దొడ్డ సత్యనారాయణ అనే వ్యాపారి ద్విచక్ర వాహనంపై హెూల్‌సేల్ షాప్ కు వెళ్లి కిరాణ వస్తువులు కొనుగోలు చేసి తన ఇంటికి కృషకాలనీ కీ వెళ్తుండగా, కృష్ణకాలనీ జూనియర్ కాలేజ్ దగ్గర గల మూలమలుపు సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన సింగరేణి లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య దొడ్డ వెంకటలక్ష్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు భూపాలపల్లి పట్టణ సిఐ డి.నరేష్ కుమార్ తెలిపారు.

# శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి

- శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర విధి నిర్వహణపై జోనల్, సెక్టార్స్ అధికారులకు శిక్షణ
- అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి.



**ములుగు బ్యూరో,జనవరి08(జనం సాక్షి) :** శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర ను జోనల్, సెక్టార్స్ అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు.ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మేడారం జాతరను పటిష్టంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలో భాగంగా మేడారం జాతర లో విధులు నిర్వహించనున్న జోనల్,సెక్టార్స్ అధికారులకు గురువారం మేడారం హరిత హెూటల్ లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి.,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలసి శిక్షణ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతర ప్రాంతాన్ని సమగ్రంగా 12 జోన్లుగా విభజించి, వాటికి సంబంధించిన 62 మంది జోనల్ అధికారులకు, అలాగే 51 సెక్టార్లకు చెందిన 179 మంది సెక్టార్ అధికారులకు నియమించడం జరిగినదని తెలిపారు. జాతర సమయంలో చేపట్టాల్సిన బాధ్యతలు, నిర్వహణ విధానం, ప్రజల భద్రత, రవాణా నియంత్రణ,పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి అధికారికి స్పష్టమైన మార్గదర్శకాలతో కూడిన ఎస్ఓపి మాన్యువల్‌ను అందజేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతర సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు పక్క ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. జాతర నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపారు.డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా జనసందోహాన్ని పర్యవేక్షించడంతో పాటు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులకు మాస్టర్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని అన్నారు.దీంతో సమస్యలు తలెత్తిన వెంటనే గుర్తించి, తక్షణమే పరిష్కరించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.జంపన్న వాగు ప్రాంతం లో జన సందోహం ఎక్కువగా ఉంటుందని, అధికారులు అప్రమంతగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా 3 షిఫ్టుల్లో గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు.వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జాతరను విజయవంతం చేయాలని, ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జోనల్,సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి



**మహదేవపూర్ జనవరి 8 (జనంసాక్షి) :** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో గురువారం విషాదంచోటు చేసుకుంది. అంబటిపల్లి గ్రామానికి చెందిన వడ్ల వినోద్ (30) పొలంలో ట్రాక్టర్ తో రూట్ వెయిటర్ వేస్తున్న సమయంలో ప్రమాదవశాతు ట్రాక్టర్ బోల్తా పడి వినోద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న నూతన సర్పంచ్ గుజ్జుల లావణ్య శంకర్. గ్రామప్రజలు ఘటన స్థలానికి చేరుకుని స్థానిక పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సీఎం కప్ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** విద్యార్థులు సీఎం కప్ పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం స్టేడియంలో మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడలకు సమప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామీణ స్థాయి క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపోటములు సహజమని, పాల్గొనడమే ముఖ్యమని పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి వివిధ దశల్లో జరిగే సీఎం కప్ పోటీల్లో జిల్లా విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకొని పాల్గొనాలని సూచించారు. గత పోటీల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం సుందరీకరణతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా యోగ పోటీల్లో కాంస్య పతకం సాధించిన దిలీప్‌ను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యువత క్రీడా ప్రతిభకు సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశం

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు బ్యూరో,జనవరి08(జనం సాక్షి) :** యువత తమ క్రీడా ప్రతిభను కనబరచడానికి సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశమని ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.గురువారం ములుగు జిల్లా కలెక్టరేట్ లో సీఎం కప్ రెండవ ఎడిషన్ టార్చ్ ర్యాలీ ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారులలో ప్రతిభను వెలికి తీయడం కోసం సీఎం కప్ రెండవ ఎడిషన్ సరైన వేదిక అని ఈ అవకాశాన్ని గ్రామీణ స్థాయి యువత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ క్రీడాపోటీలకు సంబంధించిన అవగాహన కల్పించడానికి జిల్లా లో ఈ నెల 8 వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల వరకు,8వ తేదీన ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, జడ్పీహెచ్ఎస్ మల్లంపల్లి పాఠశాలలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,జడ్పీహెచ్ఎస్ వెంకటాపూర్ పాఠశాలలో, మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు, జడ్పీహెచ్ఎస్ గోవిందరావుపేట్ పాఠశాలలో సాయంత్రం నాలుగు గంటల నుంచి 5 గంటల వరకు,9వ తేదీన ఐటీడీఏ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు,జడ్పీహెచ్ఎస్ మంగపేట పాఠశాలలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏహెచ్ఎస్ గర్ల్స్ తాడ్వాయి పాఠశాలలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు, 10వ తేదీన జడ్పీహెచ్ఎస్ ముప్పనపల్లి పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, జడ్.పి.హెచ్.ఎస్ వాజేడు పాఠశాలలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,జడ్పీహెచ్ఎస్ వెంకటాపురం పాఠశాలలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు టార్చ్ ర్యాలీ కొనసాగనుంది పేర్కొన్నారు.శాట్స్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ స్థాయిల్లో మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందని,ఈ నెల 17 వ తేదీ నుంచి 22 వరకు గ్రామ స్థాయిలో, 28 నుంచి 31 వ తేదీ వరకు వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 19 నుంచి 26 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయని తెలిపారు. జిల్లా క్రీడాకారులు ఎక్కువ మెడల్స్ సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ అధికారి మలోత్ సర్దార్ సింగ్,డిఈఓ సిద్ధార్థ రెడ్డి,జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పగడలా వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు,పీడీలు, పిఈటి లు,కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



**వరంగల్ ఈస్ట్, జనవరి 08 (జనం సాక్షి) :** సాంఘిక సంక్షమ గురుకుల మహిళ వరంగల్ తూర్పు డిగ్రీ కళాశాలలోముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తరగతుల వారిగా సంక్రాంతి పండగను తలపించే విధంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. గౌరమ్మలను చేసి మధ్యలో నిలిపి ఆటపాటలతో అలరించారు పండగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఉపన్యాసాలిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.రాధిక వైస్ ప్రిన్సిపల్ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విభాగంవారు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# ప్రజలకు, ప్రభుత్వాలకు వారధి పత్రికలు

- నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి జనవరి 8 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని మీడియా నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జనంసాక్షి 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జనంసాక్షి రిపోర్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా పనిచేయాలని నిష్పక్షపాతమైన వార్తలు ప్రచురిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణలో మంచిర్యాల జిల్లా బ్యూరో పింగిళి సంపత్ రెడ్డి, స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాస్, దండేపల్లి రిపోర్టర్ చక్రపాణి, రామకృష్ణాపూర్ రిపోర్టర్ సారంగరావు, నస్పూర్ రిపోర్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాముల పరిశీలన




**వరంగల్ ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి) :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జనవరి 8 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రిలో చేపట్టిన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న పోస్టుమార్టం గది నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టుమార్టం గది నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అవుట్ పేషంట్, ల్యాబ్, వార్డులు, పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఓ. పి. లో నమోదు అవుతున్న అనారోగ్య సమస్యల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరిస్తూ సాంకేతిక పరికరాలను సమకూర్చి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా అధికంగా వచ్చే జలుబు, జ్వర పీడితులకు వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ఫైర్ సేఫ్టీ నిబంధనలు బాధ్యతగా పాటించాలి..

- జిల్లా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి..



**మహబూబాబాద్ ప్రతినిధి, జనవరి 8 (జనం సాక్షి) :** రోడ్డు భద్రత మహెూత్సవాల్లో భాగంగా గురువారం మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా హైస్కూల్‌లో రోడ్డు, ఫైర్ సేఫ్టీ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల వాహన డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే రోడ్డు భద్రత, ఫైర్ సేఫ్టీ అంశాలపై సమీక్ష సదస్సు జరిగింది. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి వాహన డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడంతో పాటు, ఓవర్టేక్ సమయంలో అత్యంత జాగ్రత్త వహించాలని అన్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. టూ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెవీ వాహనాల డ్రైవర్లు సీట్‌బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ప్రతి డ్రైవర్ తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. పాఠశాలల వాహనాలకు నిరంతరం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండేలా తనిఖీలు చేయించుకోవాలని, వాహనాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. అనుకోని అగ్ని ప్రమాదాల సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని పిలుపునిచ్చారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమని, లైసెన్సు లేకుండా వాహనం నడపరాదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ఈ నెలలో స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. లయన్స్ క్లబ్ సహకారంతో డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్ నిర్వహించి, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి టి. మోహన్ రావు, డిపిఆర్ఓ పి. రాజేంద్ర ప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు వెంకట్ రెడ్డి, సాయి చరణ్, ట్రాఫిక్ ఎస్సై అరుణ్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ నర్మద, డ్రైవర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ కాలువలో చెత్త తొలగింపు

**పెద్దవంగర జనవరి 08(జనం సాక్షి) :** రైతన్నల క్షమం కోరే పార్టీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ఈదురు బుచ్చమ్మ అన్నారు.గురువారం మండలంలో చిట్యాల గ్రామంలో శ్రీరాంసాగర్ నుంచి నీటిని విడుదల చేసిన సందర్భంగా కాలువలో చెత్త కంప చెట్లు కూడుకపోవడంతో కాల్వను సర్పంచ్ ఈదురు బుచ్చమ్మ,జెసిబి సహాయంతో నీరు పోయే విధంగా చెట్లను తొలగించారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, ఆవుల మహేష్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## హెల్మెట్ లేకపోతే బంకుల్లో ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ బంద్



**తిరుమలగిరి (సాగర్), జనవరి 8 (జనంసాక్షి) :** ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి, లేకపోతే పెట్రోల్ బంకుల్లో ఇంధనం పోయవద్దు! జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నో హెల్మెట్–నో పెట్రోల్ నినాదాన్ని కఠినంగా అమలు చేస్తామని తిరుమలగిరి సాగర్ ఎస్ఐ వీరశేఖర్ స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక పెట్రోల్ బంకును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. బంక్ నిర్వాహకులకు, సిబ్బందికి కీలక సూచనలు చేశారు. హెల్మెట్ లేకుండా వచ్చే వాహనదారులకు పెట్రోల్ పోయకూడదని, నిబంధనలు ఉల్లంఘించితే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాణరక్షణకు హెల్మెట్ తప్పనిసరి. పెట్రోల్ కోసం వచ్చిన వాహనదారులతో ముఖాముఖి మాట్లాడిన ఎస్ఐ, రోడ్డు ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడుకోవడానికి హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో వివరించారు. హెల్మెట్ మీ రక్షణ కోసమే, పోలీసుల కోసం కాదు అని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ చర్యలతో మండలంలో హెల్మెట్ ఉపయోగం పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

# దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

- బాధితురాలు దుబ్బాక జ్యోతి

**కనగల్లు, జనవరి 8 (జనం సాక్షి) :** మండలంలోని జి ఎడవెల్లి గ్రామంలో దళిత మహిళ దుబ్బాక జ్యోతి కుటుంబం పై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి డిమాండ్ చేశారు. బాధితురాలు దుబ్బాక జ్యోతి వెల్లడిస్తున్న వివరాలు ఇలా ఉన్నాయి. జి ఎడవల్లి రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 40 లో 0.35 గుంటల తరిపొలం (మా గాని) తనకు ఉందని, ఇట్టి భూమిని గత 50 సంవత్సరాల నుంచి తన అత్తమామలతో పాటు ప్రస్తుతం మేము సేద్యం చేసుకుంటూ ఇందులో పండిన పంటపై ఆధారపడి జీవనోపాధి కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన బీసీ కులస్తులైన బొమ్మ కంటి లక్ష్మమ్మ, బొమ్మ కంటి నరేందర్, పర్సనబోయిన శంకర్, పర్సనబోయిన రామకృష్ణులు గత ఆరు నెలల నుంచి ఈ భూమిని దున్నవద్దని, మా సర్వే నెంబర్లు లో ఉందని ఈ భూమి జోలికి రావద్దని బెదిరిస్తూ, దుర్భాషలాడుతూ ఇబ్బందులు పెడుతూ వస్తుండే వారని తెలియజేశారు. బుధవారం రోజు (7 వ తారీకు) న నేను, నా కుమారుడు దుబ్బాక నాగరాజు, నా కోడలు దుబ్బాక ఊహ రాణి లతో కలిసి పొలం దగ్గరికి వెళ్లి దున్ని వరినారు వేస్తుండగా పర్సనబోయిన శంకర్, పర్సనబోయిన రామకృష్ణ, బొమ్మ కంటి నరేందర్, బొమ్మ కంటి యువరాజ్, పర్సనబోయిన స్వప్న, దొంతర బోయిన యాదమ్మలు ఆవేశంతో ముక్కుమ్మడిగా వచ్చి మేము పొలం పనులు చేస్తుండగా మా దగ్గరికి వచ్చి పొలములో నుంచి బయటికి వెళ్లిపోండి అంటూ రాళ్లతో దాడి చేస్తూ కులం పేరుతో (మాదిగ) దుర్భాషలాడుతూ మా దగ్గరికి వచ్చి నన్ను బురద పొలములో నెట్టివేయడంతో నాకు ఎడమ చేయి విరిగింది, పర్సనబోయిన కమలమ్మ, పర్సనబోయిన సునీత, బొమ్మ కంటి లక్ష్మమ్మలు వచ్చి మేము వేసిన వరి నాటును చెదరగొట్టి, పొలం గట్లకు గళ్ళు పెట్టడం పూర్తిగా నా యొక్క పంటను ధ్వంసం చేసినారు.. ఈ దుస్సంఘటనను నా కుమారుడు నాగరాజు తన సెల్ ఫోన్లు రికార్డు చేస్తుండగా ఇది గమనించిన రామకృష్ణ నా కుమారుని చేతిలో ఉన్న సెల్ ఫోన్లు పక్కనే ఉన్న గోరికి బలంగా కొట్టడంతో పగిలిపోయిందని, ఇదే కాకుండా నా కుమారుని చంపుతానని కర్రలతో వెంటపడగా అతను తప్పించుకొని పారిపోయాడు, నా మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు, రెండు తులాల వెండి గొలుసు వారు మాపై చేసిన దాడిలో ఇవి తెగి బురదలో పడిపోయినాయి అంటూ బాధితురాలు జ్యోతి తమ గోడును చెప్పుకుంటూమీడియా ముందు రోధించింది. ఆమె వెంట కుటుంబ సభ్యులు, కుల సంఘ బాధ్యులు ఉన్నారు.

**కులం పేరుతో దూషించిన వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**



జీ ఎడవెల్లి గ్రామానికి చెందిన దళిత కులస్తురాలుదుబ్బాక జ్యోతిపై ఇదే గ్రామానికి చెందిన బీసీ కులస్తులు నరేందర్, రామకృష్ణ, శంకర్, యువరాజ్, లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు కుల పేరుతో దుర్భాషలాడుతూ, దాడి చేసి, జ్యోతిని తీవ్రంగా గాయపరిచిన బాధ్యులపై ఎస్సీ, ఎస్పీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పోల వెంకటాద్రి, కందుల మోహన్, దుబ్బ దేవేందర్, పెరిక వెంకటేశ్వర్లు, పోలే విజయ్ కుమార్, డి.ఎస్.పి బాధ్యులు బాలరాజ్, పుల్లెంల పరమేష్ లు పోలీస్ లను డిమాండ్ చేశారు.

**కేసు నమోదు చేశాం..**

జి ఎడవల్లి గ్రామానికి చెందిన దుబ్బాక జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు బాధ్యులపై నమోదు చేసినట్లు ఎస్సై కే రాజీవ్ రెడ్డి తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నత అధికారులకు నివేదిక పంపినట్లు తెలియజేశారు.

# చండూరు రెవెన్యూ డివిజన్‌గా మారినా.. తీరని గ్యాస్ కష్టాలు

- మూడేళ్లయినా ఏర్పాటు కాని ప్రభుత్వ గ్యాస్ ఏజెన్సీ
- ప్రైవేటు వ్యక్తుల దగ్గర అధిక ధరలకు కొనలేక పేద ప్రజల అవస్థలు
- వెంటనే ఏజెన్సీని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి

**చండూరు, జనవరి 8 (జనంసాక్షి) :** చండూరు మున్సిపాలిటీ కేంద్రం రెవెన్యూ డివిజన్‌గా ఆవిర్భవించి మూడు సంవత్సరాలు గడుస్తున్నా... నేటికీ స్థానికంగా ప్రభుత్వ గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు కాకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివిజన్ స్థాయి హోదా దక్కినా, కనీస సౌకర్యాలు అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పేదలపై ఆర్థిక భారం**




చండూరులో అధికారిక గ్యాస్ ఏజెన్సీ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, కొందరు ప్రైవేటు వ్యక్తులు సిలిండర్లను బ్లాక్‌లో నిల్వ చేసి, ప్రభుత్వ ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అత్యవసర సమయాల్లో గ్యాస్ కోసం ప్రజలు వారు అడిగినంత చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇది నిత్యం కూలి పనులు చేసుకునే పేద, మధ్యతరగతి కుటుంబాలపై మోయలేని ఆర్థిక భారం మోపుతోంది.

**పక్క మండలాలకు పరుగులు**

సిలిండర్ రీఫిల్లింగ్ కోసం వినియోగదారులు పక్క మండలాలైన నల్గొండ, మునుగోడు, నార్కట్‌పల్లి లేదా మర్రిగూడ వరకు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల పెట్రోల్, రవాణా ఖర్చులతో పాటు, ప్రయాణ సమయం వృధా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. వృద్ధులు, మహిళలు గ్యాస్ సిలిండర్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

**జిల్లా కలెక్టర్ స్పందించాలి..**

మూడేళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా జిల్లా నూతన కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ప్రత్యేక చొరవ తీసుకుని, వెంటనే చండూరు మండల కేంద్రంలో ప్రభుత్వ గ్యాస్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని, ప్రైవేటు దోపిడీ నుండి పేదలను కాపాడాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

## జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన డిగ్రీ కళాశాల విద్యార్థి



**రామన్నపేట, జనవరి 7 (జనం సాక్షి) :** జాతీయ స్థాయి హాకీ పోటీలకు రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నోముల సాయి కుమార్ ఎంపికయ్యారు. బుదవారం మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం నందు జరిగిన ఎంపిక పక్రియ పోటీలో పాల్గొనగా ఈ నెల 12న తమిళనాడు లోని సత్యభామ విశ్వ విద్యాలయం నందు జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఆడనున్నట్లు తెలిపారు. సాయి కుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందుకు తోటి విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ, సంతోషం తో సాయి కుమార్ కి శుభాకంక్షలు తెలిపి, జాతీయ స్థాయిలో జరిగే పోటీలో మంచి ప్రతిభ కనబరిచి, విజేత గా నిలిచి తల్లిదండ్రులకి, కళాశాల కి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# సంగీతంతో మానసిక సమస్యలు దూరం

**సూర్యాపేట, జనవరి 8 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని త్రివేణి గార్డెన్ లో సుధా బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన 23వ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో శ్రీ వాసవి సేవాసమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తంను ప్రముఖ సిని సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్ ఘనంగా సన్మానించారు. బచ్చు పురుషోత్తం సుమధుర గీతాలు సోషల్ మీడియా గ్రూప్ ద్వారా ప్రతి రోజు రాత్రి సంగీత అభిమానులకు పలు సినిమాల్లోని సుమధుర గీతాలు ప్రసారం చేస్తున్నారు. ఈ సందర్భంగా సుధాబ్యాంక్ మేనేజింగ్ డైరక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఉదయం నుండి రాత్రి వరకు ఎంతో మంది బిజీగా వారి వారి పనుల్లో అలిసి పోయి సతమతమవుతున్న ప్రజలకు తాను సేకరించిన పాటలు సోషల్ మీడియా ద్వారా ప్రసారం చేస్తూ వారికి మానసిక ప్రశాంతతను కలిగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంకు అధ్యక్షులు మీలా మహదేవ్, వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్



నాయకులు పెద్దిరెడ్డి రాజా ప్రముఖ రచయిత జర్నలిస్ట్ పులగం చిన్నారాయణ, సుధా బ్యాంకు డైరెక్టర్లు తోట శ్యాంప్రసాద్, అప్పం శ్రీనివాస రావు, ఏపూరి శ్రవణ్ కుమార్, పటేల్ నరసింహారెడ్డి, అనంతుల శారద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన కే.మేఘన



**మిర్యాలగూడ, జనవరి 8 (జనం సాక్షి) :** ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ లో మిర్యాలగూడ పట్టణంలోని బకాల్వాడి జెడ్పిహెచ్ఎస్ విద్యార్థిని కె. మేఘన ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు ఏ. కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని అభినందించారు. నగదు బహుమతి, ప్రశంసా పత్రం ను మేఘన కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ప్రతిభ పరీక్షలలో, క్రీడలలో విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయస్థాయిలలో ప్రతిభ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు చిన్నయ్య, శ్రీదేవి, గిరిజ, స్వాతి, బాలు, వెంకటేశ్వర్లు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక శారీరక దృఢత్వం

- క్రికెట్‌ను ప్రారంభించిన డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి



**గరిడేపల్లి, జనవరి 8 (జనం సాక్షి) :** క్రీడలతో మానసిక శారీరిక దృఢత్వం పెంపుతుతుందని కోదాడ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పొనుగోడు గ్రామంలో పొనుగోడు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రాబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాలను గుర్తించడానికి ఈ క్రీడలు ఎంతో దోహదపడుతుందని అన్నారు. వరసగా మూడు రోజులు జరిగే పోటీలో పాల్గొనే క్రీడాకారులు తమ క్రీడా స్ఫూర్తి ని చాటాలని స్నేహ పూరిత వాతావరణంలో క్రీడలు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చలికంటి నరేష్, గ్రామ సర్పంచ్ కటకం వేణు, ఉప సర్పంచ్ జోగు అరవింద్ రెడ్డి, మాజీ ఎంపీపీ కటకం ఆశ రమేష్, మాజీ సర్పంచ్ జోగు సరోజనమ్మ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ పీఎస్ పరిధిలో హ్యాష్ ఆయిల్ కేసు నమోదు



**రాజేంద్రనగర్, జనవరి 8 (జనంసాక్షి) :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో హ్యాష్ ఆయిల్ అక్రమంగా కలిగి ఉండి అమ్మేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను శంషాబాద్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు ఊట్‌పల్లి గ్రామంలోని శ్రీకృష్ణ హాస్పిటల్ సమీపంలోని బహిరంగ ప్రదేశంలో తనిఖీలు నిర్వహించగా, టేకు చెట్టు కింద అనుమానాస్పదంగా ఉన్న డింబకేశ్వర నాగ ప్రణవ్ (26) యెర్ర శ్రీనివాసులు (21) వద్ద నుంచి ఒక సీసా హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గోవా నుంచి హ్యాష్ ఆయిల్ తెచ్చి వినియోగించడంతో పాటు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులను అభినందించిన ఐటీడీఏ పీవో, ఎఎస్పి

**భద్రాచలం, జనవరి 8 (జనంసాక్షి) :** అండర్ 14 ఎస్ జి ఎఫ్ క్రికెట్ నేషనల్ లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టులో భద్రాచలం చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ నుండి ముగ్గురు క్రీడాకారులు జట్టుకు ఎంపికైన సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్ లు క్రికెట్ క్రీడాకారులను అభినందించారు. అశ్వాపురంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ఎస్జీఎఫ్ 69 వ క్రికెట్ పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉమ్మడి పది జిల్లాల టీంలు ఇందులో పాల్గొన్నారు. విన్నర్స్ గా రంగారెడ్డి, రన్నర్స్ గా ఖమ్మం జిల్లా టీంలు కప్ ను గెలుచుకున్నాయి. రాజస్థాన్ లో జరగనున్న అండర్ 14 ఎస్ జి ఎఫ్ క్రికెట్ నేషనల్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టులో భద్రాచలం చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ నుండి ముగ్గురు క్రీడాకారులు జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్ లు ముగ్గురు క్రికెట్ క్రీడాకారులను అభినందించారు. అందులో నక్క రిత్విక్, రిషికేష్, పంజా విశ్రుత్ కృష్ణ లు ఎంపిక కాగా వీరి ఎంపిక పట్ల చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ కోచ్ కుప్పాల తేజ హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ మా క్రికెట్ అకాడమీ నుండి ముగ్గురు ప్లేయర్స్ రాజస్థాన్ లో జరగనున్న ఎస్ జి ఎఫ్ క్రికెట్ అండర్ 14 నేషనల్ కు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.



## జనం సాక్షి కథనంతో కదిలిన యంత్రాంగం


- మట్టి అక్రమ రవాణాపై మైనింగ్ అధికారుల దాడులు
- 7 టిప్పర్లు పోలీసులకు అప్పగింత

**మిర్యాలగూడ, జనవరి 8 (జనం సాక్షి) :** అక్రమ మట్టి రవాణా పై ఎట్టకేలకు మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. 'మిర్యాలగూడలో గుట్టలు మాయం' అంటూ 'జనం సాక్ష' దినపత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన మైనింగ్ అధికారులు గురువారం మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం శివారులో అక్రమంగా మట్టి త్రవ్వకాలు, రవాణా జరుపుతున్న వ్యవహారం పై దాడి చేశారు. 7 టిప్పర్లను స్వాధీనం చేసుకొని, రూరల్ పోలీసులకు అప్పగించారు. అవంతిపురం గుట్టల్లో మట్టి తవ్వకాలు చేసేందుకు తమ శాఖ నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్న అధికారులు అక్రమ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడంతో దాడి చేసి కట్టడి చేశారు. కాగా కంటి తుడుపు చర్యలుగా కాకుండా అక్రమార్కులపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని ప్రకృతి వనరులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



# గ్రీన్ ట్రిబ్యునల్ నోటీస్ అందుకున్న పేదలకు అండగా ఉంటాం

**కోదాడ, జనవరి 8 (జనం సాక్షి) :** కోదాడ పట్టణ పరిధిలో చెరువు కట్ట ప్రాంతంలో గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన నోటీసులు అందుకున్న పలు ప్రాంతాలలో గురువారం మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పర్యటించి అక్కడ ఉన్న నివాసితులను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గత 50 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఉంటున్నామని కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, వచ్చిన డబ్బులతో ఎంతో కొంత దాచుకుని నిర్మాణాలు చేపట్టుకున్నామని, ఈ కట్టిన ఇళ్లకు ప్రభుత్వం నల్లా బిల్లు, కరెంట్ బిల్లు తదితర ఏ బిల్లులైనా వసూలు చేస్తుందని, అలాంటి పర్మిషన్లు ఇచ్చిన ప్రభుత్వం కోర్టుల పేరుతో ఇలా నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని, గత ఎన్నికల్లో మాకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకుని గెలిచిన ఎమ్మెల్యే ఇప్పుడు మేము ఇంత ఇబ్బందుల్లో ఉంటే కనీసం స్పందించడం లేదని కన్నీరు మున్నీరవుతూ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ దగ్గర స్థానికులు తమ బాధను వెలిబుచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ వాస్తవానికి ఈ చెరువు విస్తీర్ణం 1100 ఎకరాలని కానీ అధికారులు రికార్డులలో తప్పులు చూపిస్తున్నారని, ఈ ప్రాంతం లో ఇప్పటికే పెద్ద పెద్ద బిల్డింగులు, వాణిజ్య సముదాయాలు, అపార్ట్మెంట్లు నిర్మాణం చేశారని అలాంటి వారిని వదిలిపెట్టి కేవలం రెక్కాడితే డొక్కాడని కుటుంబాలను ఆసరాగా చేసుకుని ఈ నోటీసులు అందజేయడం సమంజసం కాదని అన్నారు. 50 ఏళ్ల నుండి ఈ ప్రజలు ఇక్కడే నివసిస్తున్నారని గతంలో కలెక్టర్ స్వయంగా పట్టాలు కూడా అందజేశారని, పట్టా ల్యాండ్ అని అమ్మితే నిరుపేదలు వీటిని కొనడం జరిగిందని అందుకు సంబంధించిన సేల్ డీడిలు కూడా ఉన్నాయని అంతేకాకుండా వీళ్ళకి ప్రభుత్వాలు పట్టణంలో వసూలు చేసే అన్ని పనులను వీళ్ళ నుంచి కూడా వసూలు చేస్తున్నారని, ఇల్లు కట్టుకోవడానికి అన్ని అనుమతులు కూడా మంజూరు చేశారని అలాంటి వారే ఈరోజు నోటీసులు అందజేయడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. ఈరోజు పట్టణంలో మున్సిపల్ ఎన్నికలు రాగానే కాంగ్రెస్ పార్టీ నోటీసుల పేరుతో దొంగ నాటకాలకు తెరలేపారని, మళ్లీ వీళ్ళు మాయమాటలు చెప్పి మీ సమస్యలను పరిష్కారం మాతో సాధ్యమని ప్రజల్ని మభ్యపెట్టి మళ్లీ ఓట్లు వేసుకునే పరిస్థితి ఉందని దీనిని ప్రజలందరూ గమనించాలని కోరారు. ఇలాంటి



చర్యలను బీఆర్ఎస్ పార్టీ సహించదని బాధితుల పక్షన ఎంతవరకైనా పోరాడడానికి వెనకాడబోమని, బాధిత కుటుంబాలు ఎవరు అధైర్య పడవద్దు అని మీ అందరికీ బీఆర్ఎస్ పార్టీ పక్షన మేము అండగా ఉంటామని ఈ విషయంలో ఒక ప్రత్యేక లాయర్ ను నియమించి బాధితుల పక్షన కొట్లాడానికి సిద్ధంగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు.




## ఇండియన్ రైల్వే బంపరాఫర్..

### ప్రయాణికులకు శుభవార్త!

**న్యూఢిల్లీ:**సంక్రాంతి పండుగ వచ్చేసింది. నగరాల్లో ఉండేవారంతా దాదాపు ఊళ్లకు బయలుదేరుతున్నారు. ఈ సమయంలో ఇండియన్ రైల్వే.. ప్రయాణికులకు ఒక శుభవార్త చెప్పింది.టికెట్ కొనుగోలుపై 3 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు ప్రకటించింది. దీని గురించి మరింత సమాచారం వివరంగా ఇక్కడ.. రైల్‌వన్ యాప్ ద్వారా బుక్ చేసుకున్న అన్‌రిజర్వ్ టిక్కెట్ల బుకింగ్ మీద 3 శాతం తగ్గింపు లభిస్తుంది. ఇది 2026 జనవరి 14 నుంచి జులై 14 వరకు అందుబాటులో ఉంటుంది. నగదు రహిత ప్రయాణాన్ని ప్రోత్సహించడానికి ఇండియన్ రైల్వే ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. డిజిటల్ చెల్లింపు మోడ్‌లను ఉపయోగించి ఖీజీతిశ్రీూనివ యాప్ ద్వారా బుక్ చేసుకున్న అన్‌రిజర్వ్ టిక్కెట్లపై మాత్రమే తగ్గింపు పొందవచ్చు.

**రైల్‌వన్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవడం ఎలా?**

గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్ ద్వారా ఈ సూపర్ యాప్ డౌన్‌లోడ్ చేయాలి. యాప్ వినియోగదారుల లొకేషన్‌ను డిఫాల్ట్‌గా రీడ్ చేయడానికి అనుమతులు కోరుతుంది. దీన్ని ఆన్ చేసుకోవాలి.యాప్ ఇన్‌స్టాల్ అయిన తర్వాత లాగిన్, న్యూ యూజర్ రిజిస్ట్రేషన్, గెస్ట్ అనే ఆప్షన్లు వస్తాయి.కొత్తగా రిజిస్టర్ చేసుకోవాలి కాబట్టి న్యూ యూజర్ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేస్తే.. రైల్ కనెక్ట్, యూటీఎస్ అని రెండు ఆప్షన్లు డిస్‌ప్లే అవుతాయి. గతంలో ఇప్పటికే రైల్ కనెక్ట్ యాప్‌లో లాగిన్ వివరాలు ఉంటే ఆయా వివరాలతో లాగిన్ కావొచ్చు. లేదంటే కొత్తగా వివరాలు ఎంటర్ చేసి సైనప్ చేయాల్సి ఉంటుంది.సైనప్ కోసం మొబైల్ నెంబర్ ఇచ్చి రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది.మీ పూర్తి పేరు, మొబైల్ నెంబరు, ఈ-మెయిల్, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, క్యాప్చా ఎంటర్ చేసి వివరాలు నమోదు చేసుకోవచ్చు.ఓటీపీ, ఎంపిన్ ఇచ్చి అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. తర్వాత 2ఫ్యాక్టర్ వెరిఫికేషన్ కోసం ఫింగర్ ప్రింట్ లేదా డివైజ్ లాగిన్ వివరాలు ఇవ్వాలి.

మూడు శాతం డిస్కౌంట్ కోసం..

ఇప్పటికే మీరు ఇన్‌స్టాల్ చేసుకున్న యాప్.. లాగిన్ అవ్వాలి.ప్రాథమిక వివరాలు (పేరు, ఇతర వివరాలు) నమోదు చేసుకోవాలి.అన్‌రిజర్వ్ టికెట్ బుకింగ్ కోసం ఎంపికను సెలక్ట్ చేసుకుని.. ప్రయాణ తేదీని, మీరు ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారా ఆ స్టేషన్‌ను సెలక్ట్ చేసుకోవాలి.డిజిటల్ మోడ్ (యూపీఐ, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్) ద్వారా చెల్లింపు చేయాల్సి ఉంటుంది. ఇలా పేమెంట్ చేసినప్పుడు మాత్రం మీకు డిస్కౌంట్ లభిస్తుంది.చెల్లింపు పూర్తయిన తరువాత.. టికెట్ యాప్‌లోనే జనరేట్ అవుతుంది. ప్రయాణ సమయంలో టికెట్ తనిఖీల కోసం దాన్ని మీ ఫోన్‌లో చూపించవచ్చు.

**రైల్‌వన్ యాప్ ద్వారా లభించే సేవలు**

టికెట్ బుకింగ్: ప్రయాణికులు ట్రైన్ టికెట్స్ బుక్ చేసుకోవచ్చు.ప్లాట్‌ఫామ్ పార్సిల్ బుకింగ్: వినియోగదారులు ప్లాట్‌ఫామ్ టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు. పార్సిల్ డెలివరీకి సంబంధించిన సేవలను బుక్ చేసుకోవచ్చు.రైలు పీఎన్‌ఆర్ స్టేటస్: ట్రైన్ షెడ్యూల్, పీఎన్‌ఆర్ స్టేటస్ వంటి వాటికి సంబంధించిన విషయాలను తెలుసుకోవచ్చు.

# ఆఖరులో నష్టాల్లోకి..

**ముంబై:**వరుస నష్టాల్లో కొనసాగుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు.. గురువారం ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 780.18 పాయింట్ల నష్టంతో 84,180.96 వద్ద, నిఫ్టీ 263.90 పాయింట్ల నష్టంతో 25,876.85 వద్ద నిలిచాయి. ఆకాష్‌న్స్యూ-ప్రాజెక్ట్స్ లిమిటెడ్, జిందాల్ ఫోటో లిమిటెడ్, బాలాజీ అమైన్స్ లిమిటెడ్, పనాసియా బయోటెక్ లిమిటెడ్, రోలటైనర్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ఎన్‌ఆర్బీ ఇండస్ట్రియల్ బేరింగ్స్ లిమిటెడ్, మనక్సియా అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, యాషో ఇండస్ట్రీస్ లిమిటెడ్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, సిగ్నేచర్ గ్లోబల్ (ఇండియా) లిమిటెడ్ వంటి సంస్థలు నష్టాల జాబితాలో నిలిచాయి.

ఏడాది చివరికల్లా 93,918 పాయింట్లకు సెన్సెక్స్

బీఎస్ఈ ఎక్స్ఛేంజ్‌లోని బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ 2026 డిసెంబర్ నాటికి 93,918 పాయింట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ క్లయింట్ అసోసియేట్స్ అంచనా వేసింది.అంటే సెన్సెక్స్ ప్రస్తుత స్థాయి (84,961)తో పోలిస్తే 11% పెరిగే వీలుందని అభిప్రాయపడింది. "దేశీయ స్థూల ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయి. కార్పొరేట్ ఆదాయాల అవుట్‌లుక్ మెరుగ్గానే ఉన్నాయి. అయితే షేర్ల వాల్యుయేషన్లు అధికంగా ఉండటం,







అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా ఇన్వెస్టర్లు 'క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి' వ్యూహాన్ని అనుసరించవచ్చు. దీంతో ఈ ఏడాది భారతీయ మార్కెట్ విస్తృత స్థాయి ర్యాలీలకు స్వస్తి పలికి.., ఎంపిక చేసుకున్న, ఫండమెంటల్ ఆధారిత అవకాశాల దిశగా అడుగులు వేయొచ్చు" అని సంస్థ రీసెర్చ్ హెడ్ నితిన్ అగర్వాల్ తెలిపారు.రిస్క్ అంచనాలను మెరుగుపరుచుకుంటూ.., సరైన డైవర్సిఫికేషన్ విధానాలను అనుసరిస్తే దీర్ఘకాలంలో సంపద సృష్టికి ఈక్విటీలు ప్రధాన వనరులుగా కొనసాగుతాయని అగర్వాల్ పేర్కొన్నారు.ఇంకా 2026కి సంబంధించిన క్లయింట్ అసోసియేట్స్ వార్షిక ఈక్విటీ అంచనా నివేదికలో....పోర్ట్‌ఫోలియో వైవిధ్యీకరణలో బంగారం, వెండి కీలకం. డాలర్ బలహీనత, భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధానాల్లో మార్పుల కారణంగా గతేడాదిలో విలువైన లోహాలు భారీ రాబడులు ఇచ్చాయి. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో బంగారం డిమాండ్ పెరిగి, వ్యూహాత్మక పెట్టుబడి సాధనగా పసిడి ప్రాధాన్యం మరింత పెరిగింది. అంతర్జాతీయంగా సరఫరా సమస్యలు, అమెరికా-చైనా ఉద్రిక్తతలు, వెండిని కూడా కీలక లోహంగా గుర్తించే చర్చల నేపథ్యంలో వెండి ధరలు గణనీయంగా పెరిగాయి.భారత్ వృద్ధి అవుట్‌లుక్ మెరుగ్గానే ఉంది. బలమైన డిమాండ్, తయారీ-సేవల రంగ విస్తరణ, స్థిరమైన జీఎస్టీ వసూళ్ల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశీయ జీడీపీ వృద్ధి 6.8 శాతంగా నమోదవ్వొచ్చు.

## ఇది కదా రికార్డ్ అంటే!.. ఏకంగా కోటి..

**ముంబై:**సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా.. తన గురుగ్రామ్ ప్లాంట్ నుంచి 10 మిలియన్ల (కోటి) ద్విచక్ర వాహనాన్ని విడుదల చేసి.. ఉత్పత్తిలో అరుదైన మైలురాయిని చేరుకుంది. కంపెనీ దేశంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ విజయాన్ని వెల్లడించింది.కంపెనీ మొదటి 5 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేయడానికి.. 14 సంవత్సరాలు పట్టింది. ఆ తరువాత ఆరేళ్లలో మరో 5 మిలియన్ వాహనాలను ఉత్పత్తి చేసింది. అంటే.. క్రమంగా కంపెనీ వాహనాలను డిమాండ్ పెరుగుతూ వచ్చింది. దీంతో కంపెనీ తన ఉత్పత్తిని కూడా పెంచాల్సి వచ్చింది. సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా అమ్మకాలు పెరగడానికి యాక్సెస్ 125 వెన్నెముకగా నిలిచింది. ఆ తరువాత జాబితాలో బర్గ్‌మాన్ స్ట్రీట్, అవెనిస్ వంటి ఇతర స్కూటర్లు, అలాగే జిక్సర్ 150/250 సిరీస్, అడ్వెంచర్ ఓరియెంటెడ్ స్ట్రోమ్ కూడా సంస్థ పురోగతికి చాలా ఉపయోగపడ్డాయి.సుజుకి మోటార్‌సైకిల్ ప్రస్తుతం 1,200 కంటే ఎక్కువ అమ్మకాలు సేవా టచ్‌పాయింట్‌లను కలిగి ఉన్నారు.




## హైదరాబాద్ రియల్ ఎస్టేట్, ఆఫీస్ మార్కెట్ అదుర్స్

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్ రియల్ ఎస్టేట్, ఆఫీస్ మార్కెట్ 2025లో బలమైన వృద్ధిని నమోదు చేసింది. నగరంలో వార్షిక కార్యాలయ లీజింగ్ 11.4 మిలియన్ చదరపు అడుగులకు చేరి, చరిత్రలో రెండవ అత్యధిక స్థాయిని సాధించింది.అదే సమయంలో 2025 ద్వితీయార్ధంలో లగ్జరీ గృహాల అమ్మకాలు మొత్తం విక్రయాలలో 71 శాతంగా నమోదయ్యాయి.ఈ వృద్ధికి ప్రధాన కారణం గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ విస్తరణ. హైదరాబాద్‌లో కొత్త జీసీసీలు 40 శాతం పెరిగి, భారత్‌లో రెండవ అత్యంత డిమాండ్ ఉన్న నగరంగా నిలిపాయి. దక్షిణ భారతదేశంలో బెంగళూరు ముందంజలో ఉన్నప్పటికీ, జీసీసీల ద్వారా కార్యాలయ స్థల వృద్ధిలో హైదరాబాద్ బెంగళూరును (33%) అధిగమించింది. ప్రస్తుతం నగరంలోని మొత్తం లీజింగ్ కార్యకలాపాల్లో జీసీసీల వాటా సుమారు 50 శాతం.గోల్డ్‌మన్ సాచ్స్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, సర్వీస్‌నౌ వంటి గ్లోబల్ సంస్థలు భారీ లావాదేవీలతో హైదరాబాద్‌ను హై-వాల్యూ కార్యకలాపాల కోసం కీలక కేంద్రంగా నిలిపాయి. ఈ డిమాండ్ వల్ల హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో కార్యాలయ అద్దెలు నెలకు 10 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ.77కు చేరాయి.నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, రూ.కోటి పైబడిన ఇళ్లు ఇప్పుడు మార్కెట్‌ను నడుపుతున్నాయి. ఇవి మొత్తం లావాదేవీ విలువలో దాదాపు 50 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2025లో రెసిడెన్షియల్ అమ్మకాలు 4 శాతం పెరిగి 38,403 యూనిట్లకు చేరగా, బెంగళూరులో వృద్ధి స్థిరంగా ఉంది. హైదరాబాద్‌లో సగటు ఆస్తి ధరలు 13 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ.6,721కు చేరాయి. కొత్త సరఫరా పరిమితంగా ఉండటంతో అమ్ముడుపోని ఇన్వెంటరీ 2 శాతం తగ్గింది.రూ.2-5 కోట్ల సెగ్మెంట్‌లో అమ్మకాలు 22 శాతానికి పెరిగాయి. రూ.10-20 కోట్ల అల్ట్రా-లగ్జరీ గృహాలు కేవలం 1.1 త్రైమాసికాల్లోనే అమ్ముడవుతున్నాయి. దీనికి విరుద్ధంగా, రూ.50 లక్షల లోపు గృహాల వాటా 4 శాతానికి పడిపోయింది.కోకాపేట, గచ్చిబౌలి, తెల్లాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాలు లగ్జరీ హౌసింగ్‌కు కేంద్రాలుగా మారాయి. మెరుగైన మౌలిక సదుపాయాలు, బెంగళూరుతో పోలిస్తే తక్కువ జీవన వ్యయం, టీఎస్ ఐపాస్ వంటి ప్రభుత్వ చర్యలు హైదరాబాద్‌ను హై-గ్రోత్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా నిలిపాయి.



## ప్రతీ వీధికుక్కను తరలించాలనలేదు

- కేవలం సంస్థలు, కార్యాలయాల దగ్గరి నుంచి మాత్రమే వాటిని తరలించాలని ఆదేశాలు ఇచ్చాం
- జంతువుల జనన నియంత్రణపై ప్రధానంగా దృష్టిపెట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం సూచన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వీధిలో ఉన్న ప్రతి కుక్కను తరలించాలని తాము చెప్పలేదని గతంలో ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు గురువారం స్పందించింది. కేవలం సంస్థలు, కార్యాలయాల దగ్గరి నుంచి మాత్రమే వాటిని తరలించమన్నామని పేర్కొంది. వీధి కుక్కల అంశంపై గురువారం కూడా విచారణ జరిగిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. జంతువుల జనన నియంత్రణకు సంబంధించిన నిబంధనలపై ప్రధానంగా దృష్టిపెట్టాలని సుప్రీం ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. సున్నితమైన ప్రదేశాలలో భద్రతపై ఆందోళన వ్యక్తంచేసిన న్యాయస్థానం.. ఆసుపత్రి వార్డుల్లో, రోగుల చుట్టూ కుక్కలు సంచరించడానికి అనుమతించాలా అని ప్రశ్నించింది. దేశంలో కుక్క కాటు ఘటనలు ఆందోళనకర రీతిలో పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల భద్రత, ఆరోగ్యం తమకు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసింది. విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు తదితర జనసమ్మర్ద బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు సంచరించకుండా చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలని తెలిపింది.

# చుక్కల్లో ధరలు

- ఇరాన్‌లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం
- ఆకాశంలో నిత్యావసరాల ధరలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



**టెహ్రాన్:**ఇరాన్ దేశాన్ని ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కుదిపేస్తోంది. గత కొంతకాలంగా అక్కడ ద్రవ్యోల్బణం నియంత్రణ లేకుండా పెరిగిపోవడంతో, సామాన్యుడి కనీస అవసరాలైన ఆహార పదార్థాల ధరలకు రెక్కలు వచ్చాయి.ముఖ్యంగా బియ్యం, వంట నూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. దీనివల్ల మధ్యతరగతి మరియు పేద ప్రజలు ఒక పూట భోజనం గడవడానికి కూడా తీవ్రంగా శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రస్తుత మార్కెట్ ధరలను గమనిస్తే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థమవుతుంది. కిలో బియ్యం ధర ఏకంగా 2.2 లక్షల రియాల్స్‌కు చేరుకోగా, లీటర్ వంట నూనె ఏకంగా 18 లక్షల రియాల్స్‌కు విక్రయించబడుతోంది. అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే, ఒక ట్రే గుడ్ల ధర 35 లక్షల రియాల్స్‌గా పలుకుతోంది. అంటే ఒక చిన్న గుడ్డు విలువ కూడా లక్ష రియాల్స్‌కు పైగానే ఉండటం అక్కడి ఆర్థిక పతనానికి నిదర్శనంగా నిలుస్తోంది.కేవలం వారం రోజుల వ్యవధిలోనే ధరలు రెట్టింపు కావడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యల్ప కాలంలోనే నిత్యావసరాల రేట్లు ఇంత భారీగా పెరగడం వెనుక అంతర్జాతీయ మార్కెట్లో రియాల్ విలువ పడిపోవడమే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే ఇరాన్ కరెన్సీ అయిన రియాల్ విలువ 14.7 లక్షలకు పడిపోవడంతో దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు చుక్కలను తాకుతున్నాయి.ఈ ఆర్థిక అస్థిరత వల్ల ఇరాన్ ప్రజల కొనుగోలు శక్తి పూర్తిగా క్షీణించింది. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కరెన్సీ విలువ మరీ దారుణంగా పడిపోవడం వల్ల పొదుపు చేసుకున్న డబ్బు కూడా కరిగిపోతోందని, భవిష్యత్తులో ఈ ధరల పెరుగుదల ఇంకా ఏ స్థాయికి వెళ్తుందోనని అక్కడి ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు.

## మూడో 'ఆర్థిక శక్తి'గా భారత్ ఎదగాలంటే..

- దిగుమతులు తగ్గించుకుని ఎగుమతులు పెంచుకోవాలి
- కేంద్ర రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ


**న్యూఢిల్లీ:**భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలంటే దిగుమతులు తగ్గించుకుని, ఎగుమతులను పెంచుకోవాలని కేంద్ర రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. సీఎస్ఐఆర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ వ్యర్థాలను విలువైన జాతీయ వనరుగా మార్చుకోవడం ద్వారా ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవచ్చని చెప్పారు. దీనివల్ల వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం కారణంగా వెలువడే కాలుష్యాన్ని నిరోధించొచ్చన్నారు. పెట్రోల్‌లో ఇథనాల్‌ను 15 శాతం కలపడం ద్వారా ఏడాదిలో 4,500 కోట్ల డాలర్ల విదేశీ మారకాన్ని ఆదా చేసుకోవచ్చని చెప్పారు.ఇటీవలే జపాన్‌ను దాటేసి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడం తెలిసిందే. రహదారుల నిర్మాణంలో బయో బిటుమన్‌ను (పెట్రోలియం రహిత) వినియోగించడం 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా పరివర్తనాత్మక అడుగుగా మంత్రి గడ్కరీ పేర్కొన్నారు. వాణిజ్య పరంగా బయో బిటుమన్‌ను ఉత్పత్తి చేసిన మొదటి దేశం భారత్ అని చెప్పారు. ఇది రైతుల జీవితాలను మార్చేస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతంగా నిలుస్తుందన్నారు.వ్యవసాయం, నిర్మాణ రంగ సామగ్రి తయారీదారులు ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఫ్లెక్స్ ఇంజన్లతో కూడిన వాహనాలను ప్రోత్సహించాలని కోరారు. హైడ్రోజన్ రవాణా అన్నది పెద్ద సమస్యగా పేర్కొంటూ.. ఈ విషయంలో భారత్ ఇంధన ఎగుమతిదారుగా అవతరించాలన్నారు. శిలాజ ఇంధనాల దిగుమతి కోసం భారత్ రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు.

# పురుషులూ.. కుక్కల్లానే

**సుప్రీం వ్యాఖ్యలపై నటి రమ్య పోస్ట్ • మండిపడ్డ నెటిజన్లు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

వీధికుక్కల కేసు విచారణలో.. సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేస్తున్నది తెలిసిందే. అయితే కోర్టు వ్యాఖ్యల ఆధారంగా ప్రముఖ నటి, మాజీ ఎంపీ రమ్య(దివ్య స్పందన) చేసిన ఓ పోస్ట్‌పై నెటిజన్స్ భగ్గుమంటున్నారు.కుక్కలను.. మగవాళ్లకు ముడిపెట్టి ఆ పోస్ట్ ఉండడమే అందుకు కారణం.వీధి కుక్కల అంశంపై మరోసారి విచారణ జరుపుతున్న సర్వోన్నత న్యాయస్థానం.. వీధి కుక్కలనువాటి ప్రవర్తన ఆధారంగా వర్గీకరించడం సాధ్యం కాదంటూ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే "ఫలానా కుక్క కాటేస్తుంది.. ఫలానాది కాటేయదు అని వీధుల్లో తిరిగే కుక్కలను చూసి ముందుగా తెలుసుకోవడం సాధ్యం కాదు. వీధి కుక్కల మూడ్ ను ఎవరు అర్థం చేసుకోలేరు" అంటూ బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది.అయితే సుప్రీం కోర్టు వ్యాఖ్యలపై రమ్య తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఓ పోస్ట్ చేశారు. 'మరి మగవాళ్ల మైండ్‌ను కూడా చదవలేం. వాళ్ళు ఎప్పుడు లైంగికదాడి చేస్తారో.. ఎప్పుడు హత్య చేస్తారో తెలియదు. కాబట్టి వాళ్లందరినీ జైలులో పెట్టాలా?' అని ఇన్‌స్టాలో ఓ పోస్టు చేశారు. దీంతో కుక్కలతో పోలుస్తావా? అంటూ





కొందరు పురుషులు నటి రమ్యపై భగ్గుమంటున్నారు. ఆమె క్షమాపణలు చెప్పేదాకా ఊరుకునేది లేదని.. అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ వార్నింగ్ ఇస్తున్నారు.కన్నడ నటి రమ్య అలియాస్ దివ్య స్పందనకు శాండల్‌వుడ్ క్వీన్‌గా పేరుంది. ఆమె తెలుగు, తమిళ్ భాషల్లోనూ నటించారు. ఆ తర్వాత రాజకీయాల్లో చేరారు. కాంగ్రెస్ తరఫున 2013 మాండ్య లోక్‌సభ ఉప ఎన్నికల్లో నెగ్గి ఎంపీ అయ్యారు. అయితే 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. యువతలో ఆమెకు ఉన్న క్రేజ్ గుర్తించి.. రాహుల్ గాంధీ ఆమెకు సోషల్ మీడియా వింగ్‌ను అప్పగించారు. ఈ క్రమంలోనే తరచూ పలు అంశాలపై స్పందిస్తూ వస్తున్నారు.కన్నడనాట సంచలనం సృష్టించిన రేణుకాస్వామి హత్య కేసులో స్టార్ నటుడు దర్శన్ నిందితుడిగా జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కన్నడ సినీ పరిశ్రమ మౌనంగా ఉండిపోయింది. అయితే.. ఎంతటి వారైనా చేసినదానికి ఫలితం అనుభవించాల్సిందే అంటూ రమ్య స్పందించడంతో దర్శన్ ఫ్యాన్స్ రెచ్చిపోయారు. ఆమెను రేప్ చేస్తామని, చంపుతామంటూ సోషల్ మీడియాలో బెదిరింపులకు దిగారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు.

## బీమా అనైతిక విక్రయాలకు ఇక చెక్!

**న్యూఢిల్లీ:**బీమా రంగంలో ఉత్పత్తులను తప్పుదోవ పట్టించి విక్రయించడం (అనైతిక మార్గాల్లో) ఆందోళన కలిగిస్తున్నట్టు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి వార్షిక నివేదిక పేర్కొంది.అసలు దీనికి గల కారణాలను గుర్తించేందుకు బీమా సంస్థలు లోతైన విశ్లేషణ చేయాలని సూచించింది. 2023-24లో జీవిత బీమా కంపెనీలకు వ్యతిరేకంగా 1,20,726 ఫిర్యాదులు రాగా, 2024-25లోనూ ఇదే స్థాయిలో 1,20,429 ఫిర్యాదులు దాఖలైనట్టు తెలిపింది. అనైతిక వ్యాపార విధానాలపై మాత్రం ఫిర్యాదులు 23,335 నుంచి 26,667కు పెరిగినట్టు వెల్లడించింది. మొత్తం ఫిర్యాదుల్లో అనైతిక వ్యాపార పద్ధతులకు సంబంధించినవి 19.33 శాతం నుంచి 22.14 శాతానికి పెరిగినట్టు పేర్కొంది. వ్యక్తుల అవసరాలకు సరిపడని, నియమ, నిబంధనలు, షరతులు గురించి పూర్తిగా తెలియజేయకుండా, కేవలం ప్రయోజనాల గురించే చెబుతూ పాలసీలను విక్రయించడాన్ని మిస్ సెల్లింగ్‌గా చెబుతుంటారు. బ్యాంక్‌లు, బీమా ఏజెంట్ల రూపంలో ఈ తరహా విక్రయాలు సాగుతుంటాయి. "మిస్ సెల్లింగ్‌ను నిరోధించేందుకు గాను తగిన విధానాలను అమలు చేయాలని బీమా సంస్థలకు సూచించాం. ఉత్పత్తి అనుకూలతను అంచనా వేయడం



(పాలసీదారునకు అనుకూలమైనా), పంపిణీ ఛానల్ వ్యాప్తంగా కొన్ని నియంత్రణలు అమలు చేయడం, మిస్ సెల్లింగ్‌పై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించడం, మూల కారణాలను గుర్తించేందుకు అధ్యయనం చేయాలని సూచించడమైంది"అని ఐఆర్‌డీఏఐ తన 2024-25 నివేదికలో వివరించింది. తప్పుడు మార్గాల్లో బీమా ఉత్పత్తుల విక్రయంపై కేంద్ర ఆర్థిక శాఖ బ్యాంక్‌లు, బీమా సంస్థలను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉండడం గమనార్హం. అనుకూలం కాని పాలసీలను విక్రయించడం పాలసీదారులు తర్వాత రెన్యువల్ చేసుకోరని, దాంతో పాలసీల రద్దునకు దారితీస్తున్నట్టు పేర్కొంది.

**బీమా విస్తరణ 3.7 శాతం**

దేశంలో బీమా విస్తరణ 2024-25 సంవత్సరానికి జీడీపీలో 3.7 శాతంగా ఉన్నట్టు ఐఆర్‌డీఏఐ నివేదిక తెలిపింది. ఇది ప్రపంచ సగటు 7.3 శాతం కంటే సగమే. జీవిత బీమా రంగంలో విస్తరణ రేటు 2023-24లో ఉన్న 2.8 శాతం నుంచి 2024-25లో 2.7 శాతానికి తగ్గినట్టు తెలిపింది. నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ విస్తరణ రేటు మాత్రం యథాతథంగా ఒక శాతం వద్దే ఉంది.

# ప్రాణాలు కాపాడే వారికి రూ.25 వేల ఆర్థిక సహాయం

- ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి
- ఆసుపత్రుల్లో లక్ష యాభై వేల వరకు క్షతగాత్రులకు వైద్య సహాయం
- రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు






**తంగళ్లపల్లి, జనవరి 08 (జనంసాక్షి) :** రోడ్డు పై వెళ్లే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లు, స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గీతే హాజర య్యారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు రోడ్డు భద్రత,బాధ్యత, ప్రమాదాల నివారణ పై పాటలు ఆలపించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు, డ్రైవర్లు, స్కూల్ విద్యార్థులు రహదారి ప్రతిజ్ఞ చేశారు.ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ దేశంలో గత ఏడాది 4 లక్షల80వేల ప్రమాదాలు జరిగాయని, దానిలో 1 లక్ష 70వేల మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి రోజు రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి చెందుతున్నారని వివరించారు. జిల్లాలో గత ఏడాది 268 ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ఎక్కడైనా ఆసుపత్రికి వెళ్లే రోడ్డు ప్రమాద బాధితులే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మొదట బాధితులు డ్రైవర్లేనని, ప్రతి డ్రైవర్ రోజు వాహన భద్రత ప్రతిజ్ఞ చేసి ఇంటి నుంచి బయటకు వెళ్ళాలని సూచించారు. తమ కుటుంబ, పిల్లల బాద్యతను గుర్తు పెట్టుకొని జాగ్రతగా వాహనాలను వాహనాలను నడపాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంతో డ్రైవర్ తోపాటు ఎదుటివారి జీవితాలు ఇబ్బంది పడుతాయని తెలిపారు. అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు. ప్రయాణికులతో మర్యాదగా ఉండాలని సూచించారు. ప్రతి నెల రోడ్డు సేఫ్టీ కమిటీ మీటింగ్ ఆర్అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులతో సమావేశం పెడుతున్నామని, బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, నివారణ చర్యలు, సైన్ బోర్డ్స్ ఏర్పాటు తదితర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన కల్పించాలని, వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారికి పెట్రోల్ పోయవద్దనే ఆదేశాలు ఇస్తామని, నో హెల్మెట్ .. నో పెట్రోల్ అమలు చేస్తామని తెలిపారు. అందు బాటు ధరలో ఉండే హెల్మెట్ ప్రతి ద్విచక్ర వాహన దారుడు తీసుకోవాలని, వాహనం ఎక్కినప్పటి నుంచి కింద దిగే వరకు సెల్ ఫోన్ వినియోగం చవద్దని వాహనదారులకు సూచించారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకు వెళ్లి ప్రాణాలు కాపాడే వారికి ప్రభుత్వం రహవీర్ గుడ్ సామరితన్ కింద రూ. 25 వేల సహాయాన్ని అందిస్తుం ది.రోడ్డు ప్రమాద బాధితులకు ఆసుపత్రిలో రూ.1 లక్ష 50 వేల వరకు వైద్యంపొందే సదుపాయం ఉందని వెల్లడించారు.

**డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు ఫోన్ వాడవద్దు.....**

డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రతి డ్రైవర్ ఫోన్ వినియో గించవద్దని ఎస్పీ మహేష్ బీ గీతే సూచించారు. అపరిచిత డ్రైవర్లు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్కూల్ ఆటోలు, బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత చర్యలు పకడ్బందిగా తీసుకో వడంతో గత ఏడాదితో పోల్చితే 40 శాతం ప్రమాదాలు తగ్గాయని వెల్లడించారు. అసలు ప్రమాదాలే జరవద్దని ఆకాంక్షించారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవ్ చేయవద్దని అన్నారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవతో ప్రతి నెల రోడ్ సేఫ్టీ మీటింగ్ పెడుతున్నారని, బ్లాక్ స్పాట్స్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారని, రోడ్డు పైకి వచ్చే చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర భద్రత చర్యలు చేపడుతున్నారని సిరిసిల్ల, వేములవాడ డిపో మేనేజర్లు కొనియాడారు. అక్కడే ఉన్న తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (ట్రైడ్స్)ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గీతే కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, ఆర్అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, సిరిసిల్ల, వేములవాడ డిపో మేనేజర్లు ప్రకాశ్ రావు, శ్రీనివాస్, ఎంవీఐ వంశీధర్, ఏ ఎంవీఐలు రజనీ దేవి, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

# నాక్ ద్వారా మహిళా శక్తిని అభివృద్ధి చేయడమే లక్ష్యం

**బి.ఎన్.రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డా.బి.నరేందర్ రావు**



**కరీంనగర్/హుజురాబాద్,జనవరి 08(జనంసాక్షి):** హుజురాబాద్ పట్టణంలోని కేసీ క్యాంప్ ఆవరణలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్స్ట్రక్షన్ కార్యాలయంలో, బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.ఎన్. రావు తెలిపారు. డాక్టర్ బి.ఎన్. రావు మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధి కల్పించడం, ఆర్థిక స్వావలంబనలో ముందడుగు వేయడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు తమ జీవితాలను మార్చుకోవాలని, తమ కాళ్లపై నిలబడేలా ప్రయత్నించాలని సూచించారు. శిక్షణతో పాటు పేద మహిళలకు కుట్టు మిషన్లు అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలను పెంపొందిస్తామని పేర్కొన్నారు. ముఖ్య అతిథి కరీంనగర్ ఆర్టీఓ మహేశ్వర్ మాట్లాడుతూ... మహిళా సాధికారత , ఆర్థిక స్వావలంబన కోసం ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో అవసరం. మహిళలు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని ఉపయోగించి, తాము, కుటుంబం కోసం సంపూర్ణ స్వయం ఉపాధి సాధించగలగాలని ఇలాంటి కార్యక్రమాలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయి. నాక్ బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ కలిసి చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం నాకు అసిస్టెంట్ డైరెక్టర్ జి. రమేష్ తెలిపారు. నాక్ ప్రధాన లక్ష్యం నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం. బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి మహిళల కోసం ఇలాంటి శిక్షణలు నిర్వహించడం ఎంతో గర్వకారణం. శిక్షణ పొందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించాలన్నారు. బుధవారం కేసీ క్యాంప్ లోని నాక్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉచిత కుట్టు శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాక్ సిబ్బంది సబిత, అధం పాల్గొన్నారు.

# ఎండు గంజాయి పట్టివేత

**నలుగురి అరెస్ట్**

**ఆర్మూర్, జనవరి 8 (జనంసాక్షి) :** ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ చౌరస్తాలో గంజాయి ముఠాను ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేశారు. నలుగురిని అరెస్టు చేసి వారి నుండి 1200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు.నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కౌట్ల బి గ్రామానికి చెందిన బండారి వినోద్ కుమార్, పొటియా గ్రామానికి చెందిన తలారి లక్ష్మణ్, నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకాకు చెందిన దత్త దేవ్ జీ దుకారే,వినాయక రామ్ దేవ్ జి దుకారే కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు.



వారి వద్ద నుండి రెండు మోటార్ సైకిళ్ళు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు.

# బహ్రెయిన్‌లో పిట్ల దేవరాజు ఆకస్మిక మృతి



**ముస్తాబాద్ జనవరి 8 (జనంసాక్షి):** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెంది న పిట్ల దేవరాజు (41) బహ్రెయిన్‌లో పనిచేస్తూ ఈరోజు ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం అక్కడి కంపెనీకి చెందిన అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దేవరాజు బాత్రూంలో మృతి చెందినట్లు కంపెనీ వర్గాలు తెలియజేశాయి.ఉపాధి కోసం కొన్నేళ్లుగా బహ్రెయిన్‌లో పనిచేస్తున్న దేవరాజు అకస్మా త్తుగా మృతి చెందడం కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ప్రణయ్ (18), సందీప్ (12) ఉన్నారు. భర్త మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.దేవరాజు మృతితో పోతుగల్ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, బంధువులు, స్నేహి తులు ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తూ సంతాపం తెలియజేస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిం చాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 8 (జనంసాక్షి):** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు కామారెడ్డి నిజామాబాద్ రూరల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఏవో కు గురువారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది.
ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేందర్, సురేష్ లు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మాల్ తుమ్మెద ప్రాథమిక పాఠశాలలో ఈ నెల మంగళవారం న ఫుడ్ పాయిజన్ అవడం జరిగింది ఇందులో 4వ తరగతి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 8 మందికి ఫుడ్ పాయిజన్ జరిగింది ఈ నిర్లక్ష్యానికి కారణం సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడమే కారణమని వారు అన్నారు. ఇలాంటి ఘటనలు అనేక చోట్ల జరుగుతున్నా కానీ ప్రభుత్వాధికారులు నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. కావున ఇకనైనా జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు ఒక్కొక్క ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులందరికీ నాణ్యమైన ఆహారం అందేలాగా చూడాలని వారు కోరారు. అలాగే ఈ యొక్క ఫుడ్ పాయిజన్ ఎందువలన జరిగిందో విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే పనులను అడ్డుకున్న గీత కార్మికులు




**ముత్తారం, జనవరి 08 (జనంసాక్షి):** ముత్తారం మండలం లక్కారం గ్రామం వద్ద జరుగుతున్న నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను గీత కార్మికులు అడ్డుకున్నారు. గురువారం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డుకు అడ్డుగా ఉన్న తాటి,ఈత చెట్లను తొలగించేందుకు జెసిబి యంత్రాలతో వచ్చిన అధికారులను గీత కార్మికులు అడ్డుకున్నారు. లక్కారం ప్రాంతంలో సుమారు 200 తాటి,ఈత చెట్లను కొల్పోతు న్నామని, తద్వారా సుమారు 40 మంది గీత కార్మికులు ఉపాధిని కొల్పోయిన రోడ్డున పడే పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా పట్టాదారులకు నష్టపరిహారం ఇచ్చిన సొసైటీకి ఎలాంటి చెల్లింపులు చేపట్టకపోవడంతో గీత కార్మిక వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న తమకు సొసైటీ నుంచి ఎలాంటి పరిహారం అందలేదని,దీంతో తాము ఉపాధి కొల్పోయి కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని అధికారులకు గోడు వెల్లబుచ్చుకున్నారు.అధికారులు తమ దయనీయ పరిస్థితిని అర్థం తమ కుటుంబాలను రోడ్డున పడేయకుండా ఉండేందుకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

# జుట్టు లాగి కొట్టుడు.. బూతు మాటలు తిట్టుడు

- ఎడపల్లి గురుకుల పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ నిర్వాకం
- టీచర్‌ని మార్చాలని రోడ్డు ఎక్కిన విద్యార్థులు



**ఎడపల్లి, జనవరి 8 (జనంసాక్షి) :** విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ ఇంగ్లీష్ టీచర్ ఏకంగా మహిళా విద్యార్థులని సైతం చూడకుండా జుట్టు లాగి కొట్టడం..... బూతు మాటలు తిడుతూ వారిని మానసికంగా హింసించడం చేస్తున్న ఘటన గురువారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని గురుకుల రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో చోటుచేసుకుంది. ఇంగ్లీష్ టీచర్ నిర్వాహకంపై విద్యార్థులు రోడ్డెక్కి నిరసన తెలిపేందుకు పూనుకోగా ఇతర ఉపాధ్యాయులు వారిని అడ్డుకొని కళాశాల ప్రాంగణంలోనే నిరసన తెలిపే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇక వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఇంగ్లీష్ టీచర్ రజిని ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యాబోధన విషయంలో విద్యార్థులను బూతు మాటలు తిడుతూ హింసించడంతో పాటు చిన్న తప్పిదం చేసిన వారిని జుట్టు పట్టి లాగి మరి కొట్టడంపై విద్యార్థినిలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అటే మాకు గౌరవం ఉందని అయితే ఇంగ్లీష్ టీచర్ రజిని చిన్నచిన్న విషయాలకు భూతద్దం లాగా చూపుతూ, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల ముందే బూతు మాటలు తిడుతూ మానసిక వేదనకు గురి చేస్తుందని విద్యార్థినిలు స్పష్టం చేశారు. మరీ ముఖ్యంగా పనిష్మెంట్ విషయంలో దద్దులు వచ్చే విధంగా కొట్టడంతో పాటు జుట్టు లాగి మరీ కొడుతున్నారని దాంతో తాము ఆశించిన రీతిలో చదవలేకపోతున్నామని విద్యార్థినిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఆమెను తొలగించి న్యాయం చేయాలని వారు కోరారు. కాగా సదరు ఉపాధ్యాయురాలు రజినిని సెలవులపై వెళ్లే విధంగా జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ విషయంలో ప్రిన్సిపల్ గంగా శంకర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యను ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించడం జరిగిందని, రేపు వచ్చి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయడం జరిగిందని ఆయన వివరించారు.

# సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు నియామకాలలో అక్రమాలు

- స్థానికులు, భూ నిర్వాసితులకు అన్యాయం
- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు



**మంథని (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ ఆర్.జి త్రీ పరిధిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు నియామకాల విషయంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. స్థానికులు, భూ నిర్వాసితులను పూర్తిగా విస్మరించి, సింగరేణి అధికారులు, సెక్యూరిటీ కాంట్రాక్టర్లు కుమ్మక్కై దళారీ వ్యవస్థగా మారి నాన్‌లోకల్ వ్యక్తులకు ఉద్యోగాలు అమ్ముకుంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక యువతకు రావాల్సిన ఉద్యోగాలను దూరం చేసి, డబ్బు ఉన్నవారికి మాత్రమే అవకాశాలు కల్పించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అక్రమ నియామకాలను వెంటనే రద్దు చేసి, స్థానికులు, భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశా రు. ఈ సందర్భంగా సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శభీరుద్దీన్ కు లికిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య,మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్, కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ కాటం సత్యం, జిల్లా బీజేపీ నాయ కులు ముల్కూరి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్దం మురళి, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు ఉడుత శంకర్,బండ కిరణ్ రెడ్డి, ఐఎన్టియుసి నాయకులు శ్రీనివాస చారి పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో 13 కేజీల గంజాయి పట్టివేత

- ఐదుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్
- నిందితుల్లో ఇద్దరు మహిళలు
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి




**నిజామాబాద్ బ్యూరో (జనంసాక్షి):** మధ్యప్రదేశ్ కేంద్రంగా కొనసా గుతున్న అక్రమ గంజాయి రవాణా ముఠాగుట్టు ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. మొత్తం ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి ఆరు లక్షల విలువైన 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు.. అరెస్టు చేసిన వారిలో ఇద్దరు మహిళలు ఉండడం ఎక్సైజ్ పోలీసులను విస్మయానికి గురిచేసింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపరింటెం డెంట్ మల్లారెడ్డి వివరాలను వెల్లడించారు. అదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం దేవులా తాండ కు చెందిన పూజా పవర్, అదే జిల్లా కుప్పి గ్రామానికి చెందిన దుర్వదా భాయి జాదవ్ ఇద్దరు కలిసి మధ్యప్రదేశ్ లోని సిర్పూర్ పట్టణంలో 9వేల రూపాయలకు కిలో చొప్పున గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేశారు. మహారాష్ట్రలోని కిన్వాట్ కు చెందిన కిషన్ మోతిరామ్, ఇంద్రజిత్ ఠాగ్రేలను కలుసు కొని బస్సు ద్వారా నిర్మల్ కు చేరుకున్నారు. అక్కడినుండి వీరు నలుగురు కలిసి గురువారం తెల్లవారుజామున నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న కామారెడ్డి జిల్లా గాంధారి మండలం చద్మల్ తండా కు చెందిన మంజ వెంకట్రాం కు గంజాయి ప్యాకెట్లు ఇస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. పక్కా సమాచారం మేరకు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ స్వప్న ఆధ్వ ర్యంలో పోలీసులు దాడి చేసి అక్రమ గంజాయి ముఠాను పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో వెంకట్రాంనీను విచారించగా తాను వారి వద్ద 15వేల రూపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేశామన్నారు. దానిని నిజామాబాద్ నగరంలో 20వేల వరకు అమ్ముతున్నట్లు వెల్లడించారు. వీరి వద్ద నుండి ఆరు లక్షల విలువైన 13 కిలోల గంజాయితోపాటు ఐదు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు మల్లారెడ్డి తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ స్వప్నతో పాటు ఎస్సైలు సుస్మిత, మల్లేష్, సిబ్బంది సునీల్, ప్రభాకర్, రవి, సంగయ్య, సౌమ్య, సుచరిత, సంజయ్‌లు పాల్గొన్నారు.

# గిరిజన పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తాం

**రైతులు ఆందోళన చెందవద్దు తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి):** తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి గిరిజన పోడు భూముల సమస్యలపై గిరిజన రైతులతో సమావేశమై, వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గురువారం మారుతి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పోడు భూముల వాటి సమస్యల పై ఉమ్మడి జిల్లా గిరిజన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పోడు భూముల హక్కులకు సంబంధించిన చట్టాన్ని 2005లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా, 2008లో అమలులోకి వచ్చిందన్నారు. దరఖాస్తులు చేసిన పలువురు రైతులకు ఇప్పటివరకు పాస్‌బుక్కులు రాకపోవడం, కొందరికి మొత్తం విస్తీర్ణానికి కాకుండా తక్కువ ఎకరాలు నమోదు కావడం, హక్కు పత్రాలు ఉన్నప్పటికీ సాగు చేయనివ్వకపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు తెలిపారు.అలాగే పోడు భూములపై బ్యాంకు రుణాలు అందకపోవడం, ఫారెస్ట్ రెవెన్యూ భూముల మధ్య సమస్యలు, పాస్‌బుక్ ఉన్నా పంట రుణాలు రాకపోవడం, ఆన్‌లైన్ వివరాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఫారెస్ట్ కింద ఉన్న పట్టాలు భూభారతి పోర్టల్‌లో కనిపిస్తే చాలా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఈ అంశాలను ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, ప్రస్తుతం ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఏవైనా సమస్యలు ఉన్న రైతులు గ్రామసభల ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, కొత్త దరఖాస్తులు సమర్పించే అవకాశం నిరంతర ప్రక్రియగా ఉంటుందని తెలిపారు. ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అడవులను రక్షిస్తూ, సంరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా అందరిదని అన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను కమిషన్ చైర్మన్‌కు విన్నవించారు. కొందరికి ఇప్పటివరకు పట్టాలు రాకపోవడం, సాగు చేయనివ్వకపోవడం, పాస్‌బుక్‌లో ఎకరాల తేడాలు ఉండటం, బంజారా భవనాల నిర్మాణానికి అనుమతులు, ఆగిపోయిన పాస్‌బుక్కుల మంజూరు, బోర్లు వేసేందుకు అనుమతులు, బ్యాంకు రుణాలు ఇప్పించాలని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషన్ సభ్యులు అడ్వకేట్ సునీల్ పోడు భూముల హక్కుల చట్టాలపై సవివిరంగా వివరించారు. సభ్యులు రాములు నాయక్, గంగాధర్, జిల్లా అదనపు కలెక్టర్ విక్టరీ, బాన్స్ వాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ నరసింహారెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్ రావు, తహశీల్దార్ రేణుక చౌహాన్, రెవెన్యూ, అటవీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎడపల్లి మండల ఎంఈఓను తొలగించాలి

**జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి**



**ఎడపల్లి, జనవరి 8 (జనంసాక్షి) :** ఎడపల్లి మండల ఇన్చార్జి మండల విద్యాశాఖ అధికారి శివలింగ గాలప్పను తొలగించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈనెల 5వ తేదీన ఎడపల్లి మండలంలోని వడ్డెర కాలనీలో జరిగినటువంటి సంఘటన దురదృష్టకరమన్నాడు. మండల విద్యాశాఖ అధికారి ఒక ఉపాధ్యాయునిపై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టడం శోచనీయమని, మన విద్యా వ్యవస్థలో పై అధికారుల దృష్టికి తీసుకొని వస్తే బాగుండేది కానీ అలా జరగకుండా ఎం.ఈ.ఓ విద్యా వ్యవస్థకు మచ్చ తెచ్చే విధంగా వ్యవహరించడం సిగ్గుసేటు అన్నారు. అదేవిధంగా మండల ఉపాధ్యాయులను మానసికంగా వేధించుతిన్నారని స్పష్టం చేశారు. పై సంఘటనే కాకుండా గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగి ఉన్నట్లు వారి దృష్టికి వచ్చినట్లు డీఈవోకు వివరించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ ఇంచార్జి శివలింగ గాలప్పను వెంటనే తొలగించాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు పి. మోహన్ రెడ్డి ఎస్టియు జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ , బి.టి.ఫ్ జిల్లా అధ్యక్షులు స్వామి నాయక్, టి.ఆర్.టి.ఫ్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ఆర్‌యుపిపి జిల్లా అధ్యక్షులు జమీలుల్లా, ఆర్ యుపిటిఎస్ జిల్లా అధ్యక్షులు అజయ్ కుమార్, ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ధర్మేందర్ ఉన్నారు.

## కులాలు, వర్గాల కతీతంగా మత్స్యశాఖ సహకార సంఘం అభివృద్ధి చెందాలి

- నూతన గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో
- మేకల మల్లి బాబు యాదవ్ దనియాకుల హనుమంతరావు



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి):** రాజకీయాలు కులాలు వర్గాలకతీతంగా గిరిజనులు గిరిజనేతరులు ఒక కుటుంబం లాగా కలిసిమెలిసి ఆర్థికంగా బలోపేతం కావాలని మాజీ జెడ్పిటిసి, మాజీ డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ పిలుపునిచ్చారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలోని కొండాయిగూడెం మత్స్య శాఖ సహకార సంఘంలో నూతనంగా గిరిజనులు సభ్యత్వం తీసుకున్నారు. ప్రభుత్వం వారిచే జారీ చేయబడిన సభ్యత్వ కార్డులు పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. తదనంతరం మత్స్యశాఖ సంఘం అధ్యక్షులు మేకల మల్లికార్జున రావు అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమంలో మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు ధనియా కుల హనుమంతరావు తో పాటు పాల్గొన్న మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఏజెన్సీ ఏరియా ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం మత్స్యశాఖ సంఘంలో 207మంది గిరిజనులను సభ్యులుగా చేర్చుకోవడం జరిగిందని, వారంతా ఐటిడిఏ, మత్స్య శాఖ ద్వారా చేపలు పట్టడం వల విసరడం మార్కెటింగ్ చేయడం లాంటి వాటిని నేర్చుకోవడం జరిగిందని, అదేవిధంగా ప్రతి సంవత్సరం చెరువులలో చేప పిల్లల పోసి పెంచుకోవాలని, దీనికోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అనేక రాయితీలు, భీమా సౌకర్యం, కల్పించిందని, కులాలు తెగలు, బేధాభిప్రాయాలు లేకుండా సంఘం సభ్యులంతా ఒక కుటుంబం లాగా ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని శ్రీను, సంఘం ప్రధాన కార్యదర్శి బండి నాగేశ్వరరావు, డైరెక్టర్లు అయితనబోయిన వీరభద్రం, తురక బిక్షం, చల్ల పెద్ద నాగయ్య, చల్ల నరసింహారావు బండి బేగయ్య, చల్ల మల్లయ్య బానోతు లక్ష్మ, ధరావత్ లాలు అయితనబోయిన విటల్ రావు, శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు అయితనబోయిన నాగేశ్వరరావు ధర్మ సోత్ కిషన్, ధర్మ సోత్ నాగేశ్వరరావు, భానోత్ వీరన్న బానోతు కిషన్ పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ సర్కిల్‌ను హైదరాబాద్‌లో కోల్పోవద్దు

**రాజేంద్రనగర్,జనవరి8(జనంసాక్షి):** రాజేంద్రనగర్ సర్కిల్‌ను హైదరాబాద్ కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తాలో ఘనంగా నిరసన దీక్ష నిర్వహిం ఓచారు. "హైదరాబాద్ వద్దు సైబరాబాద్ ముద్దు", "చరిత్రను చెరపొద్దు" అనే నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ , రాజేంద్రనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొని, మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం వల్ల రాజేంద్రనగర్ సర్కిల్ తన అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా తీసుకున్న ఈ చౌకబారు నిర్ణయం అభివృద్ధికి ఆటంకం అవుతుందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా 4 సార్లు గెలిచిన ప్రకాష్ గౌడ్ కి ఈ అంశంపై అవగాహన లేదా అని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా రాజేంద్రనగర్ సర్కిల్‌ను సైబరాబాద్ పరిధిలోనే కొనసాగించాలని ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేయడంపై వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేస్తూ, కాటేదాన్‌ను తలతోకలేని విధంగా విభజించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చన జయప్రకా శ్‌తో పాటు సీనియర్ నాయకులు, సర్కిల్ నాయకు లు, మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ట్రిపుల్ వెసెల్ హార్ట్ బ్లాకేజీ .. హార్ట్ అటాక్ నుంచి కాపాడి...

- 76 ఏళ్ల వృద్ధుడి ప్రాణాలను రక్షించిన మలక్ పేట యశోదా ఆసుపత్రి వైద్య బృందం
- సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పవన్ పోద్దార్

**వనపర్తి బ్యూరో జనవరి 8 (జనంసాక్షి):** హార్ట్ అటాక్ (అక్యూట్ కోరొనరీ సిండ్రోమ్) అనేది గుండెకు రక్తప్రసరణ అకస్మాత్తుగా ఆగిపోవడం వల్ల ఏర్పడే అత్యంత ప్రమాదకర పరిస్థితి. వెంటనే చికిత్స అందించకపోతే గుండె పనితీరు దెబ్బతినడం, గుండె వైఫల్యం లేదా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వృద్ధులలో గుండె రక్తనాళాల్లో అనేక బ్లాకేజీలు ఉన్నప్పుడు ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ కేసులో సకాలంలో చేసిన థ్రాంబోలిసిస్, అనంతరం ఆధునిక కార్డియాక్ పరీక్షలు ,సరైన వైద్య నిర్వహణ వల్ల తీవ్రమైన హార్ట్ అటాక్‌కు గురైన వృద్ధ రోగి ప్రాణాలను యశోదా ఆసుపత్రి వైద్యులు కాపాడారు.బైపాస్ శస్త్ర చికిత్సకు సమానంగా కట్టింగ్ బెలూన్ (యాంజియోప్లాస్టి) ప్రత్యేక చికిత్స ద్వారా, హార్ట్ ఎటాక్ గురయ్యే వారి ప్రాణాలు కాపాడవచ్చని, డాక్టర్ పవన్ పోద్దార్,అసోసియేట్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, డాక్టర్ ఏ.రాఘవేందర్ గౌడ్‌లు తెలిపారు. గురువారం ఓ ప్రైవేటు బ్లాంకెట్ హాల్‌లో కట్టింగ్ బెలూన్"ప్రత్యేక గుండె చికిత్స పై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు అత్యాధునిక వైద్య సదుపాయలతో బైపాస్ శస్త్ర చికిత్స లేకుండా యశోద హాస్పిటల్ వైద్యులు 76 ఏళ్ల వృద్ధునికి కట్టింగ్ బెలూన్ ప్రత్యేక వైద్య పద్ధతుల ద్వారా చికిత్స చేసి ప్రాణాలు కాపాడమని అన్నారు. వనపర్తి పట్టణానికి చెందిన ఎం కృష్ణ గోకుల్ దాస్ కు నవంబర్లో ఛాతిలో నొప్పి రావడంతో చికిత్సకు స్థానిక వైద్యుని కలవడంతో వైద్యుడు ఈసీజీ పరీక్ష నిర్వహించి హార్ట్ ఎటాక్ గా నిర్ధారించి, గుండెకు రక్తప్రసరణ జరిగే ప్రధాన 3 రక్త నాళాలు మూసుకోవడం తో రేటే ప్లేస్ ఇంజక్షన్ తో తాంబ్రెలిసిస్ చేసి మెరుగైన అధునాతన వైద్య చికిత్స కోసం మలక్ పేట యశోద హాస్పిటల్ కు రెఫర్ చేశారన్నారు. యశోద హాస్పిటల్ వైద్యులు కృష్ణ గోకుల్ దాస్ కు వైద్య పరీక్షలు నిర్వహించి మూడు రక్త నాళాలు మూసుకున్నాయని బైపాస్ శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించామనీ.. కానీ వారి కుటుంబ సభ్యులు బైపాస్ సర్జరీ వద్దనడంతో యశోద హాస్పిటల్ వైద్యులు అధునాతన ప్రత్యేక వైద్య పద్ధతుల ద్వారా బహుళ రక్తనాళాల లోపల పరిస్థితిని స్పష్టంగా చూపించే ఇన్ ట్రా వాస్క్యులర్ ఇమేజింగ్ అల్ట్రా సౌండ్( ఐ ఈ యు ఎస్) తో స్క్రీన్ పై రక్తనాళాల్లోని లోపలి స్థితినీ గమనిస్తూ.. "కట్టింగ్ బెలూన్"(యాంజియోప్లాస్టి) వంటి ప్రత్యేక వైద్య పద్ధతితో సమస్యత్మకంగ ఉన్న రక్తనాళాలను వెడల్పు చేస్తూ రక్తప్రసరణ పెరిగే విధంగా చికిత్స చేసి లెఫ్ట్ సర్కం ఫ్లెక్స్ ఆర్టరీ లో 2.25 , 20 మిల్లీమీటర్ల స్టంట్ వేశామన్నారు. గుండెకు ముఖ్యమైన ఎల్ ఏ డి , పక్క నున్న దయాగ్నల్ రక్తనాళాల్లో ఉన్న క్లిష్టమైన సమస్యను కట్టింగ్ బెలూన్ సహాయంతో పరిష్కరించి మూసుకుపోయిన దయాగ్నల్ రక్తనాళం మధ్య భాగాన్ని చిన్న బెలూన్ తో వెడల్పు చేయడం ద్వారా రక్తప్రసరణ పెరిగి అక్కడ అదనపు స్టంట్ అవసరం ఉండదన్నారు. ఎల్ ఏ డి రక్తనాళం మొదటి భాగంలో మోస్తారు ఇరుకుగా ఉండటం .. మిగతా భాగాల్లో ఎక్కువగా గట్టిపడ్డ మలినా లు ఉండటం వల్ల మొదట బెలూన్ అక్కడికి వెళ్ళకపోవ దంతో మరోసారి ఇన్ ట్రా వాస్క్యులర్ అల్ట్రా సౌండ్(ఐవియుఎస్) ద్వారా లోపల ఎల్ ఎ డి రక్తనాళం గట్టి పడినట్లుగా గుర్తించి చిన్న బెలూన్ తో ముందుగా రక్తనాళాన్ని సడలించి కట్టింగ్ బెలూన్ సహాయంతో సిద్ధం చేసి ఎల్ ఎ డి రక్తనాళాల్లో 3.0 ,38 మిల్లీమీటర్ల స్టంట్ వేశామన్నారు. పెద్ద బెలూన్ తో స్టంట్ అవసరం మేర పెరగడానికి ఒత్తిడి పెంచామన్నారు. చివరగా చేసిన ఇన్ ట్రా వాస్క్యులర్( ఐ వియూఎస్ ) పరీక్షలో స్టంట్ బాగా తెరుచుకొని రక్తం ప్రసరించే స్థలం పూర్తిగా సరిపడా ఉందని నిర్ధారణ అయిందని, దయాగ్నల్ రక్తనాళం ప్రవేశ భాగం కొంచెం ఇరుకుగా కనిపించిన అది రక్తప్రసరణకు సమస్య కలిగించేదిగా లేకపోవడంతో అదనపు చికిత్స అవసరం లేదని తెలిపారు. ఈ కేసు యశోదా ఆసుపత్రి, మలక్‌పేట్‌లో అందుబాటులో ఉన్న అధునాతన కార్డియాక్ కేర్ సేవలకు, అత్యవసర హార్ట్ అటాక్ నిర్వహణలో వైద్య బృందాల వృత్తి నైపుణ్యానికి అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది. సకాలంలో చేసిన థ్రాంబోలిసిస్, సమగ్ర కార్డియాక్ మూల్యాంకనం మరియు ఆధునిక చికిత్సల ద్వారా అత్యంత క్లిష్టతరమైన, హై-రిస్క్ గుండె సంబంధిత పరిస్థితుల్లో కూడా రోగి ప్రాణాలను కాపాడడంలో యశోదా ఆసుపత్రుల అత్యుత్తమ సేవలకు ఈ కేసు మరో నిదర్శనం. అత్యాధునిక అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ, ఇంటర్వెన్షనల్ సర్జరీ టీముల సేవలు, నిపుణులైన వైద్య బృందాలు యశోదా ఆసుపత్రి శాఖలన్నింటిలోనూ 24 గంటలూ అందుబాటులో ఉన్నాయని, నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు, వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని మలక్ పేట యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె.శ్రీనివాసరెడ్డి, అసోసియేటెడ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర,ఏ వాసు కిరణ్ రెడ్డి తెలిపారు.




## ఏసీబీ వలలో మరో అవినీతి తిమింగలం

### 50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డి ఎం జగన్మోహన్



**వనపర్తి బ్యూరో జనవరి జనవరి 8 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ జగన్మోహన్ రైస్ మిల్లర్ నుండి రూ.50వేలు లంచం తీసుకుంటూ, ఏసీబీకి పట్టుబడ్డారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సిహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రైసు మిల్లర్ నుండి సీఎంఆర్ మిల్లు పర్మిషన్ కోసం 1,70,వేలు లంచంగా డిమాండ్ చేయగా, అతను 50 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నారు.రైస్ మిల్లర్ ఫిర్యాదు మేరకు గురువారం నాడు జగన్మోహన్, కలెక్టర్ సముదాయ భవనంలో ఉన్న కార్యాలయం నుండి ఇంటికి వెళ్లే దారిలో మిల్లర్ నుండి 50 వేలు లంచం తీసుకోగా అక్కడే మాటు వేసుకొని ఉన్న ఏసీబీ అధికారులు వల పని పట్టుకున్నారు. కార్ డ్రైవర్ తో సహా అతన్ని కూడా అదుపులో తీసుకున్నామని, వీరిని హైదరాబాద్ నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 10 64 అలాగే వాట్సాప్, ట్విట్టర్, ఫేస్బుక్, ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని, ఆయన తెలిపారు ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నాడు వ్యవసాయాధికారి, నేడు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నెల వ్యవధిలోనే వరుసగా కలెక్టర్ సముదాయ భవనంలోనే ఎసిబి దాడులు జరుగుతుండడంతో చర్చనీయాంశంగా మారింది.



## గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

**ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజీజ్ ఖాన్**

**హనుమకొండ ప్రతినిధి జనవరి 8 (జనంసాక్షి) :** గ్రామిణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్ అన్నారు. సీఎం కప్ 2025 రెండవ ఎడిషన్ టార్చ్ ర్యాలీ గురువారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం ఎదుట ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అజీజ్ ఖాన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఔత్సాయిక క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలోని ప్రతి గ్రామంలో క్రీడల పై అవేర్నెస్ పెంచేందుకు సీఎం కప్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ రవి మాట్లాడుతూ గ్రామిణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించే ఎందుకే సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నారు. హనుమకొండ యువజన క్రీడా అధికారి గుగులోత్ అశోక్ కుమార్ మాట్లాడుతూ సీఎం కప్ టార్చ్ ర్యాలీ రెండు రోజులపాటు హనుమకొండ జిల్లాలోని అన్ని మండలాలలో నిర్వహిస్తున్నమని చెప్పారు. మొదటి రోజు జీఎన్ఎస్ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ పబ్లిక్ గార్డెన్ అదాలత్, హంటర్ రోడ్డు, నాయుడు పెట్రోల్ పంప్, మామునూర్, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్, ఐనవోలు ఆర్చ్ నుండి జడ్.పి.హెచ్.ఎస్ పున్నేలు, ఐనవోలు, వెంకటాపూర్, వనమాల కనపర్తి, తరాలపల్లి, రాంపేట కడిపికొండ, జిహెచ్ఎస్ కాజీపేట, మడికొండ, ధర్మసాగర్, జానకిపురం, మల్లికుదుర్ల, సోడషపల్లి, వేలేరు, కొత్తకొండ, ముల్కనూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, హసన్ పర్తి మీదుగా జేఎన్ఎస్ కు చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 9వ తేదీన కమలాపూర్ మండలం అంబాల, గూడూరు, లక్ష్మీపూర్, శనిగరం, నడికూడ, పరకాల, కామారెడ్డి పల్లి, శాయంపేట, ఆరేపల్లి, తిరుమలగిరి ఆత్మకూరు, గూడెప్పాడ్, ఊరుగొండ, ఒగ్లాపూర్, దామెర, ఆరేపల్లి ములుగు రోడ్డు మీదుగా టార్చ్ ర్యాలీ తిరిగి హనుమకొండ లోని జె ఎన్ ఎస్ కు చేరుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనం కలెక్టర్ రవి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వరద రాజేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.



## మహబూబ్ నగర్‌లో విధులు.. హైదరాబాద్‌లో విందులు

- ఆఫీసులో లేని అధికారికి లక్షల్లో జీతాలు
- తుమ్మిళ్ల ఇసుకపై ఉమ్మడి పాలమూరు అధికారి కమీషన్ల నీడ
- ఉన్నత ఆదికారులకు ఫిర్యాదుచేసే పనిలో పాలమూరు ప్రజలు




**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 08 (జనంసాక్షి):** ఇక్కడ అక్రమాలు – హైదరాబాద్‌లో వినోదాలు అన్న చందంగా తయారైంది మహబూబ్ నగర్ టీజీఏండి అధికారి తీరు..! ఉమ్మడి జిల్లాకు ప్రాజెక్టు అధికారిగా ఆకుల శ్రీకాంత్ వచ్చి ఆరు నెలలు దాటుతున్నా, జిల్లా లో ప్రభుత్వ ఇసుక క్వారీలను ప్రారంభించడంలో చూపిస్తున్న జాప్యం వెనుక అసలు రంగు బయటపడు తోంది. విధులు నిర్వహించాల్సిన సమయంలో సదరు అధికారి మహబూబ్ నగర్ లో అస్సలు కనిపించడం లేదు. కానీ, హైదరాబాద్ లోని ఖరీదైన హోటళ్లు, ఇసుక కాంట్రాక్టర్లతో కలిసి విందులు,వినోదాల్లో మునిగితేలుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి.జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు సహకరిస్తూ, ఆ సంపాదనతో భాగ్యనగరంలో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని ఉమ్మడి జిల్లా ప్రజలు మండి పడుతు న్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లా తుమ్మిళ్ల ఇసుక రీచ్ వద్ద టిజీఎండిసి ఆధ్వ ర్యంలో నది నుంచి తీసి నిల్వ ఉంచిన ఇసుక నిల్వలు ఇప్పుడు సదరు ఆధికా రి తీరు వల్ల అక్రమార్కుల పాలవుతున్నాయి. అధికారులు ఇసుకను నది ఒడ్డున డంప్ చేసినప్పటికీ, ఇప్పటి వరకు అమ్మకాలు ప్రారంభించకపోవడం సదరు అధికారి శ్రీకాంత్ మతులబు చాలానే పలువురు బహటంగానే చర్చించుకుం టున్నారు.





**ఆఫీసులో లేని అధికారి**

మహబూబ్ నగర్ కేంద్రంలోని తన కార్యాలయానికి ఈ అధికారి అస్సలు రావడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఒకవైపు ప్రభుత్వ క్వారీలు మూతపడటంతో ఇసుక కొరత ఏర్పడి సామాన్యులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు ప్రైవేట్ కాంట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా ఆయన పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. చాలారోజులుగా వివరాలు అడిగేందుకు దిశ ప్రతినిధులు పలుమార్లు ప్రయత్నించిన కూడా కార్యలయంలో ఖాళీ కుర్చీలే దర్శనం ఇస్తున్నాయిగాని అధికారి మాత్రం కనిపించడం లేదు.

**కమిషన్ల కోసమే తుమ్మిళ్ల క్వారీల నిలిపివేత**

జోగులాంబ గద్వాల్ జిల్లా ఆలంపూర్ సమీ పంలోని తుమ్మిళ్ల వద్ద నది నుంచి ఇసుకను సేకరించి నిల్వ ఉంచినప్పటికీ,ఇప్పటివరకు దానిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం వెనుక పెద్ద 'కమీషన్ల' దందా ఉన్నట్లు చర్చ సాగుతోంది.

**ఉన్నతాధికారుల ఆదేశాలకు బేఖాతరు**

రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఇసుక క్వారీలను వెంటనే ప్రారంభించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని ఆదేశం చినప్పటికీ, సదరు అధికారి ఆ ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారు. కార్యాలయంలో ఉండాల్సిన సమయం లో ఆయన ఇసుక కాంట్రాక్టర్లతో కలిసి మందు, విందుల్లో మునిగితేలుతున్నారని, గాలికొదిలేశారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో కృత్రిమ ంగా ఇసుకుకు డిమాండ్ సృష్టించి ప్రయివేట్ క్రాంట్రా క్ట్ సహకరిస్తున్నారని ప్రజల నుంచి అనుమానాలు పుట్టుకొస్తున్నాయి.

### పతంగుల పండగకు
## చెరువుల సుందరీకరణ


**అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్**



**హైదరాబాద్, జనవరి 08 (జనంసాక్షి) :** హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం సందర్శించారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువుల చెంత పతంగుల పండుగను పెద్దఎత్తున నిర్వహి ంచాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను పరిశీలిం చారు. కూకట్పల్లి నల్లచెరువుతో పాటు మాదాపూర్లోని తమ్మిడికుంట, పాతబస్తీలోని బమ్-రుక్న్ – ఉద్ – దౌలా చెరువులను సందర్శించారు. మూడు నాలుగు రోజుల్లో సుందరీకరణ పనులు పూర్తి చేసి వేడుకలకు వేదికలు సిద్ధం చేయాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. మొక్కల ను విరివిగా నాటి చెరువులను సుందరీకరించాలని కోరారు. చెరువుల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చెరువుల పరిసరాలు ప్రజలకు ఆకర్షణీయంగా ఉండేలా అభివృద్ధి చేయాలని, నడక మార్గాలు, లైటింగ్, శుభ్రత పనులు, భద్రతా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. పండగ నాటికి చెరువులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

## లైసెన్స్ సర్వేయర్లు అవగాహన కలిగి ఉండాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**హనుమకొండ ప్రతినిధి జనవరి 8 (జనంసాక్షి) :** భూమి కొలతలకు సం బంధించి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి వచ్చిన నూతన సర్వే మిషన్ పై లైసెన్స్ సర్వేయర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. భూమి కొలతల శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నూతన సర్వే మిషన్‌తో భూమి కొలతలు ఏ విధంగా చేపట్టాలనే అంశంపై గురు, శుక్రవారాల పాటు హైదరాబాద్ లోని భూమి, కొలతల శాఖ నుండి వచ్చిన మాస్టర్ ట్రైనర్ తో ధర్మసాగర్, హసన్ పర్తి మండలాలకు సంబంధించిన లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు.భూముల సర్వేకు సంబంధించిన అంశాల పైన తప్పని అవగాహన కలిగి ఉండాలన్నారు. నూతన సర్వే మిషన్ లోని అంశాలు(ఫీచర్స్) అన్నింటిపై అవగాహన ఉండాలన్నారు.

## జొన్నబండలో పార్కును కాపాడిన హైడ్రా

**1444 గజాల పార్కు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్**




**హైదరాబాద్, జనవరి 08 (జనంసాక్షి):** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఓల్డ్ ఆల్వాల్ పరిధి, జొన్నబండలోని ఎంహెచ్ఆర్ కాలనీలో పార్కును హైడ్రా గురువారం కాపాడింది. 1444.40 గజాల పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసింది. లే ఔట్ ప్రకారం సర్వే నంబర్లు 575, 576 (పార్ట్), 577, 578 (పార్ట్), 598 మరియు 580 (పార్ట్)లలో మొత్తం 1444.40 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దీనిని ఆక్రమించేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రాకమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాలమేరకు సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించింది. పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. దీంతో గురువారం హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పార్కును కాపాడిన హైడ్రాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. చెత్త వేయకుండా పార్కుగా అభివృద్ధి చేయాలని జీహెచ్ కోరుతామన్నారు.

## సీఆర్పీ కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత



**పాలకుర్తి, జనవరి 08(జనంసాక్షి):** మండలంలోని ముత్తారం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని సమగ్ర శిక్ష క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గా పని చేస్తున్న కొంతం సాంబయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులకు ఎంఈవో పోతుగంటి నర్సయ్య చేతుల మీదుగా గురువారం ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ మండలంలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు రూ.1,04,600 లక్ష పోగు చేసి ఆర్థిక సహాయం చేశారని తెలిపారు. మృతుడు సాంబయ్య కూతురు పేరున పోస్టుఫీసులో ఫిక్స్డ్ డిపాజిట్ చేసి కుటుంబ సభ్యులకు పాసు పుస్తకాన్ని అందచేశారు. ఆర్థిక సాయం అందచేసిన ఉపాధ్యాయులకు ఎంపీవో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు బైకాని వెంకటయ్య, ఓరుగంటి రమేష్, అంజయ్య, వెంకటేశ్వర్లు, ఇమ్మడి అశోక్, విజయేందర్, వడ్లకొండ శ్రీనివాస్, అరుణ, మల్లేష్, మధు, బలరాం, చిదురాల శ్రీనివాస్, తాడూరు రమేష్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
9 జనవరి 2026

# హరీష్ రావుకు తీన్మార్ మల్లన్న అమ్ముడు పోయిండు

- బీఆర్ఎస్ విష కౌగిలిలో ఉండి కవితక్కపై అసత్య ప్రచారం చేస్తుండు
- కవితక్కపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే తెలంగాణలో తిరగనీయం
- కుక్కను తరిమి కొట్టినట్లు తరిమికొడతామని హెచ్చరిస్తున్నాం
- నీ వెనుక ఉన్న గుంటనక్కలకు దమ్ముంటే మాట్లాడాలి
- తెలంగాణ జాగృతి నాయకులు శ్రీకాంత్ గౌడ్, ఆనంద్, మాధవి







**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారిపై తీన్మార్ మల్లన్న విష ప్రచారం చేస్తున్నాడని తెలంగాణ జాగృతి నాయకులు మండిపడ్డారు. అగ్గిపెట్టె హరీష్ రావు డైరెక్షన్ లో , బీఆర్ఎస్ విష కౌగిలిలో చేరి తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలంగాణ జాగృతి బంజారాహిల్స్ కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్ గౌడ్, జాగృతి నాయకులు ఆనంద్, మాధవి మీడియాతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్నవి నీచ, దిగజారుడు, బ్లాక్ మెయిల్ రాజకీయాలని శ్రీకాంత్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రి వర్గంలోకి కవిత గారిని తీసుకునే ప్రయత్నం చేశారంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై ఆయన కౌంటర్ ఇచ్చారు. జూన్ 8 నాడు ముగ్గురు కాంగ్రెస్ మంత్రులు ప్రమాణం చేశారని అప్పుడు కవిత గారు బీఆర్ఎస్ లోనే ఉన్నారన్న సోయి కూడా లేకుండా మల్లన్న మాట్లాడుతున్నారని అన్నారు. మోకాలికి బోడిగుండుకు ముడిపెట్టేలా తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. టీఆర్పీ అనే పార్టీ పెట్టిన నువ్వు కాంగ్రెస్ బీఫామ్ మీద గెలిచిన ఎమ్మెల్సీకి ఎందుకు రాజీనామా చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. నీ పార్టీ కి ఇంకా గుర్తు కూడా రాలేదని....కచ్చితంగా నీకు క్యూఆర్ కోడ్ ఉన్న గుర్తు రావాలని కోరుకుంటున్నామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా మళ్లీ ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేసే నీచమైన వ్యక్తివి నువ్వు అన్నారు. నీ టీఆర్పీ పార్టీ పేరు టెలివిజన్ రేటింగ్ పాయింట్స్ అని పెట్టుకోవాలని సూచించారు. నీ ఛానెల్ వ్యూస్ కోసం ఇష్టానుసారం మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. సిగ్గు, లజ్జ లేని వ్యక్తి తీన్మార్ మల్లన్న అని మండిపడ్డారు. ఛాయ్ కి పైసలు అడుకున్న నీకు హెచ్ఎండీఏ పరిధిలో 660 ఎకరాల భూమి ఎలా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. స్కూటీ పైన తిరిగే నీకు హెలికాప్టర్ లో ప్రచారానికి వెళ్లేంత డబ్బులు ఎలా వచ్చాయో ప్రజలకు చెప్పాలన్నారు. సాయి ఈశ్వరాచారి అనే బీసీ బిడ్డ ఆత్మహత్యకు నువ్వే కారణమా కాదా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతా చారి ఆత్మబలిదానం చేసుకున్నట్లే నువ్వు బీసీల కోసం బలిదానం చేసుకోవాలంటూ ఆయనను రెచ్చగొట్టలేదా అని ప్రశ్నించారు. కచ్చితంగా ఈశ్వరాచారి మరణం తీన్మార్ మల్లన్న చేసిన హత్యేనని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పేదలు నీ దగ్గరకు వస్తే వారిని కూడా వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేసిన నీచ చరిత్ర నీదంటూ శ్రీకాంత్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద వారి నుంచి బడా కార్పొరేట్ సంస్థల వరకు బ్లాక్ మెయిల్ చేసి వేల కోట్లకు పడగెత్తావని అన్నారు. కవితక్క మీద అవాకులు పేలినందకు గతంలోనే నీ పై దాడి చేశాం. మళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేస్తే ఈసారి పాతళంలోకి తెక్కుతామని శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు.

## కుక్కను తరిమినట్లు తరిమి కొడతాం

కవితక్క మీద అవాకులు పేలితే కుక్కను తరిమినట్లు తరిమికొడతామని జాగృతి నేత ఆనంద్ హెచ్చరించారు. హరీష్ రావు ఎంగిలి మెతుకులకు అమ్ముడు పోయి కవితక్క మీద ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. గతంలోనే నీ పై దాడి చేస్తే తృటిలో తప్పించుకున్నావ్. కానీ ఈ సారి మాత్రం నిన్ను తెలంగాణ లో తిరగనివ్వమని హెచ్చరించారు. హరీష్ వేసే కుక్క బిస్కట్ల కోసం కవితక్క మీద మొరుగుతున్నావన్నారు. ఆడబిడ్డల మీద నువ్వు మాట్లాడుతున్న మాటల కారణంగా వాళ్లు రాజకీయాలకు రావాలంటే భయపడుతున్నారని అన్నారు. రాజకీయంగా విధానపరంగా మాట్లాడితే సరే గానీ తలతిక్క వ్యాఖ్యలు చేస్తే కుక్క తరిమినట్లు తరిమికొడతామని ఆనంద్ హెచ్చరించారు.

## దమ్ముంటే నీ వెనుక ఉన్న గుంటనక్కలు మాట్లాడాలి

హరీష్ రావు ఇచ్చిన కోట్ల సొమ్ముతో కవితక్క మీద పిచ్చికుక్కల తీన్మార్ మల్లన్న మొరుగుతున్నాడని జాగృతి మహిళా నాయకురాలు మాధవి మండిపడ్డారు. కవితక్క కాలి గోటికి కూడా సరిపోని వ్యక్తి తీన్మార్ మల్లన్న అని విమర్శించారు. దమ్ముంటే మల్లన్న వెనుక ఉండి ఆడిస్తున్న గుంట నక్కలు బయటకు వచ్చి మాట్లాడాలని మాధవి డిమాండ్ చేశారు. మల్లన్న అజెండా ఏంటీ ఆయన ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలన్నారు. బీసీల కోసం పార్టీ పెట్టానని చెబుతున్న మల్లన్న వెనుక అసలు ఎంత మంది బీసీలు ఉన్నారో చెప్పాలని కోరారు. మున్నూరు కాపు కులంలో చెడబుట్టావని మాధవి మండిపడ్డారు. మొన్నటి వరకు బీఆర్ఎస్ ను తిట్టి, ఇప్పుడు కాంగ్రెస్ ను తిడుతున్నావ్. అసలు నీ పార్టీ ఏంటో, విధానాలు ఏంటో ప్రజలకు చెప్పాలని కోరారు. ఆస్తుల పంచాయితీ కాదని శాసన మండలి కవిత గారు స్పష్టంగా దేవుడి మీద, తన పిల్లల మీద ఒట్టు వేశారు. కవితక్కను ప్రమాణం చేసి చెప్పాలని అడిగే స్థాయి నీకుందా అని ప్రశ్నించారు. బీసీల కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్న కవితక్క పై పిచ్చి కూతలు కూస్తే నీ భరతం పట్టటం ఖాయమని మాధవి హెచ్చరించారు.

# ఓరుగల్లును పట్టించుకోవడం లేదు

- మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం అనుమతులు ఇచ్చింది
- కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరాలి
- రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామ్ చందర్ రావు



**వరంగల్ బ్యూరో, జనవరి 08 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాం చందర్ రావు ని వరంగల్ చౌరస్తాలో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కాషాయ జెండాలు గర్వంగా ఎగురుతూ సాగిన భారీ బైక్ ర్యాలీలో అండర్ బ్రిడ్జి వద్ద శివనగర్ మండలం నాయకులు క్రేన్ సహాయంతో గజమాలతో సత్కరించారు. అనంతరం రాజశ్రీ గార్డెన్లో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో కార్యకర్తల ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్ రాం చందర్ రావు ప్రసంగించారు. అలాగే రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రన్న కి శాలువతో సత్కరించి త్రిశూలాన్ని బహుకరించారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ 'వరంగల్ ను గత కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.ఈ నగరం ప్రతి రోజు స్థానికులతో పాటు విద్య, ఉద్యోగం, వ్యాపారం పేరుతో వచ్చే వారితో కలిపి సుమారుగా 30 లక్షల మంది ఉంటారు. ఇంతటి చరిత్రతో పాటు, పత్తి, వరి పండించే రైతులు ఉమ్మడి రాష్ట్రంలోనూ నెంబర్ వన్ గా ఈ వరంగల్ జిల్లా ఉంది. అందుకే ఇక్కడ గతంలోనే అజంజాహి వస్త్ర పరిశ్రమ, ఎయిర్ పోర్ట్ నిర్మాణాలు జరిగాయి. కానీ ప్రత్యేక రాష్ట్రం కొట్లాడి సాధించుకున్నాక మాత్రం కాకతీయుల రాజధాని నాటి ఓరుగల్లు, నేటి వరంగల్ మాత్రం ఆ స్థాయి అభివృద్ధికీ మాత్రం నోచుకోవడం లేదు. వరంగల్ నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నగరంగా తీర్చిదిద్దడానికి రోడ్లు డ్రైనేజీలు చారిత్రాత్మక కట్టడాలు వ్యాపార సముదాయాలు ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేయడానికి ఈ ప్రధాన మూడు పథకాలను కేటాయించి అభివృద్ధికి నేరుగా నిధులు ఇచ్చిన ఇక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు గత ప్రస్తుత ప్రభుత్వాలు అవినీతికి తావిస్తూ అభివృద్ధిని మరిచి ఇచ్చిన నిధులను దారి మళ్లించి అరకొరక నిధులతో చేసిన అభివృద్ధిని మేము అంటే మేము చేశామని కప్పలు కొట్టుకోవడం తప్ప ఇక్కడ ఒక్క రూపాయి కూడా రాష్ట్రం నుంచి కేటాయించి చేసిన ఒక్క అభివృద్ధి కూడా లేకపోవడం బాధాకరం. వరంగల్లో నిర్మించే టెక్స్టైల్ పార్కుకు పూర్తి సహకారం కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. మామునూరులో నిర్మించే ఏర్పోర్ట్ కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యతయుతంగా నిధులు కేటాయించి అన్ని అనుమతులను ఇచ్చింది మోదీ సర్కార్. ఈ వరంగల్ నగరానికి పూర్వ వైభవం రావాలి అంటే వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరాలి. కాకతీయుల కళావైభవం మరోసారి అందించాలి అంటే కాషాయ జెండాతోనే సాధ్యం.గత ప్రభుత్వం ప్రతి ఏడాది 300 కోట్లు ఇస్తానని నమ్మబలికి కార్పొరేషన్ లో జెండా ఎగరేసింది. కానీ ఒక్కరూపాయి ఇవ్వలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పథకాలను పక్కదారి పట్టించి నిధులను దుర్వినియోగం చేసారు'అని అన్నారు.

### సమస్యల అధ్యయనానికి


# జాగృతి మరో 12 కమిటీలు

- మొత్తం 44 కమిటీలు ఏర్పాటు చేసిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించబోయే బ్లూ ప్రింట్ లో భాగంగా మరో 12 కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 32 కమిటీలను ప్రకటించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు గురువారం వాటికి అదనంగా మరో 12 కమిటీలు ఏర్పాటు చేశారు. మొత్తం 44 కమిటీలు ద్వారా ఆయా రంగాల్లో స్టడీ చేయనున్నారు. ఎక్స్ సర్వీస్ మెన్ సంక్షమం, గిగ్ వర్కర్స్ సంక్షమం, జర్నలిస్టుల సంక్షమం, వికలాంగుల సంక్షమం - సాధికారత, బిజినెస్/ఎంఎస్ఎంఈ, స్పోర్ట్స్, పబ్లిక్ ట్రాన్స్ పోర్టేషన్ - రోడ్స్ - ఇన్ ఫ్రా స్ట్రక్షర్, ఎన్విరాన్మెంటల్ - ఫారెస్ట్, అర్బన్ ప్లానింగ్, హౌసింగ్, దేవాదాయ - అన్ని మతాల ప్రార్థన మందిరాలు, అభివృద్ధి, ఎనర్జీ - గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కమిటీలు ఏర్పాటు చేశారు. ఒకో కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులను నియమించారు. ఈ కమిటీల సభ్యులు ఆయా రంగాల్లో స్టడీ చేసి తమ నివేదికలను ఈనెల 17వ తేదీ వరకు స్టీరింగ్ కమిటీకి అందజేయాలని సూచించారు.

# ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

- సంతాపం ప్రకటించిన జైరామ్ రమేశ్



**పూనె, జనవరి8 (జనంసాక్షి) :** ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ (82) కన్నుమూశారు. ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూనెలోని తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు సిద్ధార్థ్ గాడ్గిల్ గురువారం వెల్లడించారు. మాధవ్ గాడ్గిల్ పశ్చిమ కనుమల పర్యావరణ ప్రాముఖ్యతకు ఆయన విశేష కృషి చేశారు. ప్రపంచ జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన పశ్చిమ కనుమలలో ఆయన చేసిన కృషికి గాను 2024లో ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ గౌరవమైన వార్షిక ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డును బహూకరించింది. ఆయన పర్యావరణానికి సంబంధించి విలువైన సిఫార్సులను అందించారు. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో పర్యావరణానికి నష్టం చేకూర్చకుండా కఠినమైన ఆంక్షలను తన నివేదికలో సిఫార్సు చేశారు. వాటిల్లో కొత్త రోడ్లు లేదా భవన నిర్మాణాల కట్టడాలకు అనుమతించరాదని, నిటారుగా ఉన్న వాలులో అభివృద్ధి చేయరాదని, రాతి తవ్వకాలపై నిషేధం విధించాలని ఆయన సిఫార్సు చేశారు. మాధవ్ గాడ్గిల్ మృతికి మాజీ పర్యావరణశాఖా మంత్రి, కాంగ్రెస సీనియర్ నేత జైరాం రమేశ్ సంతాపం తెలిపారు. 'మాధవ్ గాడ్గిల్ ఒక అత్యున్నతస్థాయి విద్యావేత్త, అవిశ్రాంత క్షేత్ర పరిశోధకుడు, మార్గదర్శక సంస్థ నిర్మాత, గొప్ప సంభాషణకర్త, ప్రజల నెట్‌వర్క్‌లు, ఉద్యమాలను దృఢంగా నమ్మిన వ్యక్తి, ఐదు దశాబ్దాలకు పైగా చాలామందికి స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శి, గురువు. ఆధునిక శాస్త్రంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందిన ఆయన జీవవైవిధ్య పరిరక్షణలో ఛాంపియన్‌గా నిలిచారు' అని జైరాం రమేష్ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే మాధవ్ స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచిపోతారని జైరాం రమేష్ అన్నారు.

## లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన గుత్తా

**నల్లగొండ, జనవరి8 (జనంసాక్షి) :** నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో 41 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన రూ.12.50 లక్షల విలువ గల చెక్కులను తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకం చాలా ఉపయోగకరమైన పథకమని, ఈ పథకం ద్వారా పేద ప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతుందన్నారు. అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

# అక్షర విలువకు నిలువుటద్దం జనంసాక్షి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కితాబు



**కరీంనగర్ బ్యూరో, జనవరి 08 (జనంసాక్షి) :** జర్నలిజం విలువలను కాపాడటంలోనూ, అక్షర విలువలను పెంచటడంలోనూ జనంసాక్షి తెలుగు దినపత్రిక ముందువరుసలో ఉంటోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో పురుడు పోసుకున్న ఈ పత్రిక నేటికీ ప్రజలకు తోడుగానే నిలుస్తోందని, ప్రజాకోణంలో అన్ని అంశాలనూ ప్రచురిస్తోందని గుర్తుచేశారు. జనంసాక్షి 2026 క్యాలెండర్‌ను కరీంనగర్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. జనంసాక్షి విలేకరులు నిజాయితీ, నిబద్ధతకు దర్పణంగా ఉంటారని ప్రశంసించారు. పాత్రికేయ రంగం పాడైపోతోందని విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో జనంసాక్షి మాత్రం జనంవెంటే నిలిచేందుకు పాటుపడుతోందని చెప్పారు. రాష్ట్ర రాజకీయాలను విశ్లేషణాత్మకంగా వివరించడంలో మేటిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జనంసాక్షి కరీంనగర్ జిల్లా బ్యూరో బుర్ర పరశురాం గౌడ్, వీణవంక విలేకరి సాజిద్, శంకరపట్నం విలేకరి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


# బిచ్చగాడి మృతి.. 4.5 లక్షల నగదు లభ్యం

- డబ్బాల్లో దాచుకున్న నగదు గుర్తించిన పోలీసులు

**తిరువనంతపురం, జనవరి8 (జనంసాక్షి) :** కేరళలో ఓ బిచ్చగాడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అయితే అతని వద్ద ఉన్న కంటేనర్‌లో సుమారు నాలుగున్న లక్షల నగదును సీజ్ చేశారు. అలప్పుజాలో ఈ ఘటన జరిగింది. వాస్తవానికి ఆ ప్రాంత ప్రజలకు ఆ యాచకుడు సుపరిచితం. రోజూ అతను ఆ ఏరియాలోనే అడుక్కుంటూ తిరుగుతుంటాడు. అయితే సోమవారం రాత్రి ఆ బిచ్చగాడు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు అయ్యాయి. అతన్ని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో అతని పేరును అనిల్ కిశోర్‌గా నమోదు చేశారు. చికిత్స అనంతరం అతడు ఎవరికీ చెప్పకుండా అక్కడినుంచి వెళ్లిపోయాడు. తన పేరు అనిల్ కిశోర్ అని ఆస్పత్రి అధికారులతో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం ఆ యాచకుడి మృతదేహం ఓ దుకాణం ముందు ఉండటాన్ని మున్సిపల్ అధికారులు గుర్తించి పోస్ట్‌మార్టం కోసం ఆ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. యాచకుడి మృతదేహం సమీపంలో ఓ ప్లాస్టిక్ డబ్బా దొరికింది. తనిఖీ కోసం దాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. అది తెరిచి చూసిన అక్కడి అధికారులు ఒక్కసారిగా షాక్‌కి గురయ్యారు. దానినిండా డబ్బు ఉందని, అది రూ.4.5 లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. స్థానిక పంచాయతీ సభ్యుడు ఫిలిప్ ఉమ్మన్ సమక్షంలో ఆ బిచ్చగాడి కంటేనర్‌ను ఓపెన్ చేశారు. దాంట్లో నగదును గుర్తించారు. ఆ మొత్తం విలువ సుమారు 4.5 లక్షలు ఉన్నట్లు తేల్చారు. సీజ్ చేసిన నగదులో రద్దు అయిన రెండు వేల రూపాయల నోట్లు ఉన్నాయి. ఇంకా విదేశీ కరెన్సీ కూడా ఉన్నది. ప్లాస్టిక్ టిన్నుల్లో నగదును స్టోర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తిండి కోసం కిశోర్ డబ్బులు యాచించేవాడు అని స్థానికులు చెప్పారు. కానీ అతని వద్ద అంత డబ్బు ఉన్న విషయం ఎవరికీ తెలియదన్నారు. అందరూ షాక్‌కు గురైనట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న డబ్బును కోర్టులో జమ చేయనున్నట్లు పోలీసులు చెప్పారు.

## ఇంకా మండుతూనే ఉన్న బ్లో ఔట్


- అదుపులోకి రాని మంటలు



**కోనసీమ, జనవరి8 (జనంసాక్షి) :** ఇరుసుమండ వద్ద ఓఎన్‌జీసీ బావిలోసంభవించిన బ్లోఅవుట్ ఇంకా అదుపులోకి రాలేదు. వరుసగా నాలుగో రోజూ అగ్నికీలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. ఈ నెల 5న బ్లోఅవుట్ జరిగినప్పుడు భారీ మంటలు రాగా.. ప్రస్తుతం ఉధృతి తగ్గింది. ప్రమాద స్థలానికి 10 మీటర్ల దగ్గరకు వెళ్లి సిబ్బంది నియంత్రణ చర్యలు చేపడుతున్నారన్నారు. మంటల్ని అదుపు చేసేందుకు నీటిని విరజిమ్మే పక్రియ నిరంతరం కొనసాగుతోంది. మంటలు పూర్తిగా ఆర్పేందుకు మరికొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉంది.

# జలరవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ

- లాజిస్టిక్స్ వినియోగంలో ప్రపంచ స్థాయిలో పోటీ
- పర్యాటక రంగం గేమ్ చేంజర్ కానుంది
- కేబినేట్ సమావేశంలో సిఎం చంద్రబాబు వెల్లడి
- మంత్రుల తీరుపై మరోమారు అసహనం



**అమరావతి, జనవరి 8 (జనంసాక్షి) :** జల రవాణా పెంచుకునే దిశగా కార్యాచరణ రూపొందించాలని సిఎం చంద్రబాబు తెలిపారు. లాజిస్టిక్స్ వినియోగంలో ప్రపంచ స్థాయిలో పోటీ పడాలన్నారు. జల రవాణా మెరుగుపర్చు కుంటే అభివృద్ధి పథంలో ముందుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. రెండున్నర గంటలపాటు జరిగిన సమావేశంలో కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించింది. క్యాబినేట్‌లో అజెండా అంశాలు ముగిశాక,రాజకీయ, తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు అన్ని తీర ప్రాంత జిల్లాలో ఒక్కో పోర్టు ఏర్పాటు కావాలి. జగన్ పాలనలో విధించిన ట్రూఅప్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరిస్తోంది. రూ. 4,490 కోట్ల ట్రూఅప్ ఛార్జీలు ప్రభుత్వమే భరిస్తోంది. యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.5.19 నుంచి రూ. 4.90కి తగ్గించాం. ఫెర్రో అల్లాయిస్ యూనిట్లు 70 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఏడాదిపాటు విద్యుత్ రాయితీలను కల్పిస్తే, తర్వాత అవే ఉత్పత్తి చేసుకుంటాయి. చీరాలలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించాలి. సూర్యలంకలో కొత్తగా 3 హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. పర్యాటక రంగం ఓ గేమ్ ఛేంజర్. పర్యాటక రంగంలో అన్ని అవకా శాలను అందిపుచ్చుకోవాలి. బార్లకు, లిక్కర్ షాపులకు తేడా లేకుండా ఏఈఆర్‌టీ ఛార్జీలు సమం చేయాలని చంద్రబాబు అన్నారు. 'సముద్రంలో కలిసే జలాలు తెలుగు రాష్ట్రాలు ఉపయోగించుకుంటే మేలు కదా. నీరు ఊరికే సముద్రం పాలైతే ఎవరికీ ఉపయోగం ఉండదు. నీటి లభ్యత ఉంటే రైతులు కొత్త పంటలు వేసుకోవచ్చు. పోలవరం పూర్తయితే కృష్ణా జలాల్ని విశాఖకు తీసుకెళ్లొచ్చు. జగన్ హయాంలోనే రాయలసీమ లిఫ్ట్ ఆగిపోతే మనపై నిందలు వేస్తున్నారు. అధికారుల సమన్వయంతో ప్రతీ ప్రాజెక్టు గ్రౌండ్ అవ్వాలి. అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తున్నాం. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని సీఎం వివరించారు. కేబినెట్ ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరు, పార్టీ వ్యవహారాల నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత పార్టీ కార్యాలయానికి తరచూ తానే రావాల్సి వస్తోందని, అయినా ప్రజల నుంచి వచ్చే వినతులు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. నెలకు రెండు నుంచి మూడు సార్లు నేనే పార్టీ ఆఫీస్‌కు రావాల్సి వస్తోంది. అయినా వినతులు మాత్రం తగ్గడం లేదన్న సీఎం చంద్రబాబు.. ప్రజా సమస్యల పరిష్కారంలో మంత్రులు మరింత చొరవ చూపాలని సూచించారు. పార్టీ కోసం ఐదేళ్ల పాటు కష్టపడ్డ కార్యకర్తల పేర్ల జాబితాను అందించమని పలుమార్లు కోరినా.. ఇప్పటికీ జిల్లాల నుంచి పూర్తి వివరాలు అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు.. ఎన్నిసార్లు అడిగినా.. పార్టీ కోసం ఐదు సంవత్సరాలు కష్టపడ్డ వారి పేర్లు ఇవ్వడం లేదు. ఈ నిర్లక్ష్యం సరైన పద్ధతి కాదు అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. పార్టీ నిర్మాణం, పార్లమెంటు స్థాయి కమిటీల ఏర్పాటులోనూ మంత్రుల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందలేదని పేర్కొన్నారు.

## డ్వాక్రా బజార్‌లో హల్వా రుచి చూసిన బాబు

**గుంటూరు, జనవరి 8 (జనంసాక్షి) :** గుంటూరు నగర శివారులో సరస్ ప్రదర్శన – అఖిల భారత డ్వాక్రా బజార్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం పరిశీలించారు. ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం స్వయంగా పరిశీలించారు. ఒక స్టాల్‌లో ఏర్పాటు చేసిన మాడుగుల హల్వా రుచి చూసి.. టేస్ట్ బాగుందని నిర్వాహకులను అభినందించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను సీఎం ఆసక్తిగా తిలకించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే మాధవి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370